అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 20-8-2023
సంపుటి : 9 సంచిక : 231 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు + 4 పేజీలు ప్రత్యేకం + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



మణిపూర్ హృదయ విదారకం

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- గవర్నర్ అనుసూయ ఉయికేతో బృందం భేటీ
- పరిస్థితులు మెరుగుపరిచేలా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : మణిపూర్ ప్రజల బాధలు హృదయ విదారకంగా ఉన్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం తీరు అధ్వాన్నంగా ఉందని తెలిపారు. సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం మూడు రోజుల మణిపూర్ పర్యటనలో భాగంగా రెండో రోజు శనివారం ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ఇంఫాల్ చేరుకున్న బృంద సభ్యులు సహాయ శిబిరాలను సందర్శించారు. మొయిరాంగ్‌లో ఒక సహాయ శిబిరం, చురచంద్‌పూర్‌లో రెండు సహాయ శిబిరాలను నేతలు సందర్శించారు. ఆ తర్వాత రాష్ట్ర గవర్నర్ అనుసూయ ఉయికేను వారు కలిశారు. దాదాపు గంటపాటు చర్చలు జరిపారు. సహాయక శిబిరాల్లో ఉన్న భయానక పరిస్థితులను చక్కదిద్దేలా జోక్యం చేసుకోవాలని అభ్యర్థించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సీతారాం ఏచూరికి గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, అస్సాం రాష్ట్ర కార్యదర్శి సుప్రకాష్ తాలూక్‌ధర్, కేంద్ర కమిటీ సభ్యురాలు డెబ్లీనా హెంబ్రామ్, మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి క్షేత్రిమయుమ్ శాంత తదితరులు హాజరయ్యారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులతో కూడా సీపీఐ(ఎం) నేతలు సమాలోచనలు జరిపారు. మణిపూర్ ప్రజలకు బీజేపీ ద్రోహం చేసిందని వారు తెలిపారు. సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ...11లో

హరికిషన్‌సింగ్ సూర్జీత్ భవన్‌పై ఖాకీల దాష్టీకం

వీ 20 సమ్మిట్ జరక్కుండా గేటుకు తాళం

- మోడీ సర్కార్ ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల అత్యుత్సాహం
- లోపలున్నవారు వెళ్లిపోవాలని హెచ్చరికలు
- అనుమతి లేదంటూ రాద్ధాంతం
- తిరగబడిన సభికులు
- ఎమర్జెన్సీని తలపిస్తోంది-నిర్వాహకులు



న్యూఢిల్లీ: ప్రగతిశీల శక్తులకు మోడీ సర్కార్ భయపడింది. ఢిల్లీలోని వ్యూహాత్మక రాజకీయ అధ్యయన, విజ్ఞాన కేంద్రం హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌పై పోలీసులు దాడి చేశారు. సెప్టెంబర్‌లో జరిగే జీ20 అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు భారతదేశం ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ సదస్సులో చర్చించాల్సిన ప్రజా మేనిఫెస్టో అంశాలపై అభిప్రాయాలు చెప్పేందుకు వివిధ రాజకీయ, ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'జీ20లో వీ20-పీపుల్స్ సమ్మిట్'ను ఇక్కడ నిర్వహిస్తున్నారు. మూడ్రోజులు జరిగే ఈ సమ్మిట్ ఈనెల 18న (శుక్రవారం) ప్రారంభమైంది. తొలిరోజు అనేకమంది వక్తలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశంలో జరుగుతున్న అనేక దారుణాలకు ఎలా అడ్డుకట్ట వేయాలనే దానిపై సుదీర్ఘ ...5లో

అసమ్మతిని అణిచేస్తున్నారు
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో 5లో



ఒకే బీ-ఫామ్.. ఒక్కరే అభ్యర్థి..

- అతడి గెలుపుకోసం అందరూ కృషి చేయాల్సిందే...
- తేల్చి చెప్పిన మంత్రి కేటీఆర్
- 21న సీట్ల ప్రకటన నేపథ్యంలో అమెరికా ఫ్లయిటెక్కిన వర్కింగ్ ప్రెసిడెంట్
- అలకలు, నిరసనలకు దూరంగా ఉండేందుకే..
- వారం రోజుల పాటు విదేశీ టూర్ వివరాలు 5లో..

ట్రైలర్ మాత్రమే చూసింన్రు..
ఇక సినిమా చూపిస్తాం
ప్రతిపక్షాలపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు వివరాలు 5లో..

దగా...మోసం...!

'సర్వేల' మాయాజాలం • తప్పుల తడకగా అంచనాలు • తిమ్మిని బమ్మిని చేసే కుట్ర

మన దేశంలో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడంలో పోల్ సర్వేల హడావిడి అంతాఇంతాకాదు. 2024 లోక్‌సభ ఎన్నికలకు మరో 8-10 నెలల సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే దేశంలో సర్వేల సందడి ప్రారంభమైంది. వివిధ టెలివిజన్ ఛానల్స్, వార్తా పత్రికలు సొంతంగా కానీ లేదా సర్వే సంస్థల ద్వారా కానీ వీటిని నిర్వహిస్తుంటాయి. వీటినే ఒపీనియన్ పోల్స్ అంటారు. ఈ సంస్థలే పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ నిర్వహిస్తాయి. ఏ పార్టీకి విజయావకాశాలు ఉన్నాయో చెప్పేస్తాయి. ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయో కూడా జోస్యం చెబుతాయి. కొన్ని ఛానల్స్ లేదా పత్రికలు ఎన్నికలకు చాలా కాలానికి ముందే సర్వేలు చేసి, వాటిపై చర్చా గోష్టులు నిర్వహిస్తాయి. అయితే ఈ సర్వేలు నిజమవుతాయా? లేక అంచనాలు తప్పుతాయా? అన్నది అలా ఉంచితే చాలా సందర్భాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రమాదంలో పడేస్తాయి.



పాలకులకు సాగిలపడుతున్న కార్పొరేట్ మీడియా

న్యూఢిల్లీ : ఈ సంవత్సరం చివరలో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. సహజంగానే ఆయా రాష్ట్రాలలో సర్వేల హడావిడి మొదలైంది. కానీ ఇంకా ఆ రాష్ట్రాలలో పొత్తులు ఖరారు కాలేదు. కూటములు ఏర్పడలేదు. ఏ పార్టీ కూడా అభ్యర్థులను ప్రకటించలేదు. అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన సర్వేలు చేస్తున్నారు? అభ్యర్థులు ఎవరు, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు అనేది తేలకుండానే ఈ సంస్థలు ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయో, ఎంత శాతం ఓట్లు వస్తాయో తేల్చేస్తుంటాయి. అసలు మన దేశంలో చాలా సందర్భాల్లో పార్టీ సాధించే సీట్లకు, అది పొందే ఓట్లకు పొంతనే ఉండదు. ఈ విషయం సర్వే సంస్థలకూ తెలుసు. ఉదాహరణకు 2014 లోక్‌సభ ఎన్నికలలో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ ఉత్తరప్రదేశ్‌లో 20 శాతం ఓట్లు సాధించింది. అయినా ఆ పార్టీకి ఒక్క సీటూ రాలేదు.

పొత్తులు ఖరారు కాకుండానే...

ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు సంబంధించి మాత్రమే కాకుండా రాబోయే లోక్‌సభ ఎన్నికలపై కూడా సర్వే సంస్థలు, మీడియా అంచనాలు వేసేస్తున్నాయి. ఈ సర్వేలన్నీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు ఘన విజయం తప్పదని జోస్యం చెబుతున్నాయి. బీజేపీ కూటమికి 300 స్థానాలకు పైగా వస్తాయని, ప్రతిపక్ష ఇండియా కూటమికి దక్కేది 200 సీట్ల కంటే తక్కువేనని ఢంకా బజాయించి మరీ చెబుతున్నాయి. ఎన్నికలకు చాలా సమయం ఉండగా ఇలాంటి సర్వేలు చేయాల్సిన అవసరమేమిటి, అవి ఎంతవరకూ సమర్థనీయం అనేదే ప్రశ్న. ఇదంతా చూస్తుంటే ఈ పోల్ సర్వేలను ఎవరు స్పాన్సర్ చేస్తున్నారు, దాని వెనుక ఉన్న ...11లో

ప్రజలను నమ్మించేందుకే...

ఈ సంస్థలన్నీ ఎన్నికల సర్వేల పేరిట మోసానికి పాల్పడడమే కాకుండా వేర్వేరు ఇతర సందర్భాల్లో సైతం తమ సర్వే ఫలితాలను వీక్షకులు, పాఠకుల పైన రుద్దుతున్నాయి. ఉదాహరణకు గత నాలుగు సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్షాల ప్రశ్నలతో ఇబ్బంది పడి ఉక్కిరిబిక్కిరి అయిన ప్రతి సందర్భంలోనూ ఇలాంటి సర్వేలు తెర పైకి వచ్చాయి. ప్రజలను ప్రభావితం చేశాయి. దీంతో చాలా మంది అమాయక ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్నే గుడ్డిగా సమర్థించారు. రైతుల ఆందోళన, రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందం, పెగాసస్ గూఢచర్యం వంటి ఉదంతాల సమయంలో కూడా సర్వేలు జరిగాయి. ఈ సర్వేలన్నీ ప్రజలు ప్రభుత్వం వైపే ఉన్నారని నమ్మబలికాయి. ఇంకో విశేషమేమంటే ప్రధాని మోడీ విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ సర్వేలు జరిగేవి. ఆ పర్యటనలు ఫలప్రదంగా జరిగాయని, విదేశాలలో దేశ ప్రతిష్ట ఆకాశమంత ఎత్తుకు ఎదిగిందని ఒపీనియన్ పోల్‌లో ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారని ఆ సర్వేలు నమ్మించేవి.

26న చేవెళ్లలో ప్రజాగర్జన సభ

మల్లిఖార్జున ఖర్గే హాజరు 29న వరంగల్‌లో మైనార్టీ డిక్లరేషన్

- ఓబీసీ, మహిళా డిక్లరేషన్ కోసం సబ్ కమిటీ
- సోనియాగాంధీ చేతుల మీదుగా ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల
- ప్రతీ గడపకూ చేరాలి... ప్రతీ తలుపూ తట్టాలి
- టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికలకు కాంగ్రెస్ వడివడిగా అడుగులేస్తున్నది. అందులో భాగంగా వివిధ వర్గాలకు సంబంధించిన డిక్లరేషన్లు విడుదల చేయాలని టీపీసీసీ విస్తృతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించింది. ఎన్నికల తుది మ్యానిఫెస్టోను ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ చేతుల మీదుగా విడుదల చేస్తామన్నారు. ఈనెల 26న సాయంత్రం నాలుగు గంటలకు చేవెళ్ల ప్రజా గర్జన సభను భారీ ఎత్తున నిర్వహించాలని తీర్మానించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్ ...11లో

విద్వేష ప్రసంగం ఎవరు చేసినా...

మతంతో నిమిత్తం లేకుండా చర్యలు తీసుకోవాలి : సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఏ మతానికి వ్యతిరేకంగా విద్వేష ప్రసంగం చేసినా ఒకే రకంగా చూడాల్సిన అవసరముందనీ, నేరస్తుడి మతంతో సంబంధం లేకుండా చట్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విద్వేష ప్రసంగాలను ఎదుర్కొనే విషయంలో తెహసీన్ పూనేవాలా కేసులో 2018లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ భట్టిలతో కూడిన బెంచ్ పేర్కొంది. ఈ అంశంపై దాఖలైన పలు పిటిషన్లను శుక్రవారం బెంచ్ విచారిస్తూ పై వ్యాఖ్యలు చేసింది. "ఏ పక్షం వారు విద్వేష వ్యాఖ్యలు చేసినా వాటిని ఒకే తీరున చూడాలి. ఈ విషయంలో మేం చాలా స్పష్టంగా వున్నాం. విద్వేష ప్రసంగాలకు పాల్పడిన వారెవరైనా వారిపట్ల చట్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందే. ఇప్పటికే మా అభిప్రాయాన్ని మేం వెల్లడించాం. మళ్లీ పునరావృతం చేయాల్సిన అవసరం వుండదు' అని బెంచ్ పేర్కొంది. కేరళలో జులైలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ యువజన విభాగం ర్యాలీ సందర్భంగా 'హిందువులను చంపండి' అంటూ నినాదాలు చేశారని ఒక పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దానిపై కోర్టు స్పందిస్తూ, మతంతో సంబంధం లేకుండా విద్వేష ప్రసంగం ఎవరు చేసినా ఒకటేనని, దాన్ని సహించరాదని స్పష్టం చేసింది. నుహ్‌లో ఇటీవల అల్లర్ల సందర్భంగా ముస్లింలపై చేసిన వ్యాఖ్యలను షహీన్ అబ్దుల్లా సుప్రీం దృష్టికి ...11లో

కాంట్రాక్టు ఏఎన్ఎంలను
రెగ్యులర్ చేయాలి
సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ వివరాలు 11లో..

కేరళలో పింఛన్ల పంపిణీ ప్రారంభం

ఓనం సందర్భంగా 60 లక్షల మందికి అందజేత



తిరువనంతపురం : ఓనం సందర్భంగా లబ్ధిదారులందరికీ రెండు నెలల సంక్షేమ పింఛను పంపిణీని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ప్రారంభించారు. సామాజిక భద్రతా పింఛనుకు రూ.1,550 కోట్లు, సంక్షేమ బోర్డు పింఛనుకు రూ.212 కోట్లు కలిపి రూ.1,762 కోట్లు కేటాయించినట్టు సీఎం తెలిపారు. సుమారు 60 లక్షల మందికి రూ.3,200 చొప్పున పింఛన్ల పంపిణీ ఈ నెల 23 నాటికి పూర్తి చేయనున్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి రెండేండ్లు దాటింది. అప్పటి నుంచి ఓనం సందర్భంగా ఒకేసారి రెండు నెలల పంపిణీ కొనసాగుతోంది.


పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) సాఫ్ట్‌వేర్ ద్వారా ఆర్థిక సహాయ కార్యక్రమాలన్నీ చేపట్టాలన్న కేంద్రం నిబంధనలను కేరళ రాష్ట్రం అమలు చేస్తోంది. అయినప్పటికీ కేంద్రం వాటాగా లబ్ధిదారులకు అందాల్సిన రూ.580 కోట్ల సహాయం రాష్ట్రానికి అందలేదు. మొత్తం 60 లక్షల మంది లబ్ధిదారులలో జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) ద్వారా 6,88,329 మందికి కేంద్ర సాయం అందాల్సి ఉంది. కేంద్రం వాటా అందనప్పటికీ 2021 జనవరి నుంచి ఎన్ఎస్ఏపి లబ్ధిదారులతో సహా అర్హులైన సామాజిక భద్రత పెన్షన్ లబ్ధిదారులందరికీ రాష్ట్రప్రభుత్వం పూర్తి మొత్తాన్ని చెల్లిస్తోంది. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం రాజీ లేకుండా నిలబెట్టుకుంటోందని సీఎం విజయన్ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.

వామ్మో ధరలు..

భారీగా పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం

- 2020 తర్వాత ఇప్పుడే అధికం
- ఆందోళనలో మోడీ ప్రభుత్వం

దేశంలో నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగి జూలైలో 11.51%గా నమోదైంది. 2020 జనవరి తర్వాత ఆహార ద్రవ్యోల్బణం ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరంలో లోక్‌సభకు ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఈ ధరాఘాతాన్ని చూసి కలవరపాటుకు గురవుతోంది.



న్యూఢిల్లీ : మార్కెట్ అంచనాలను తలకిందులు చేస్తూ కూరగాయలు, పప్పులు, ఆహార ధాన్యాలు, పాలు-పాల ఉత్పత్తుల ధరలు బాగా పెరగడంతో గత పదిహేను నెలలో తొలిసారిగా జులైలో వార్షిక రిటైల్ ద్రవ్యోల్బణం (వినియోగదారులు తమ వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసే వస్తువులు, సేవల ధరలకు సంబంధించిన రేటు) 7.44%నికి చేరింది. జూన్‌లో కేవలం 4.88%గానే ఉన్న ఈ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. వార్షిక రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో 6.40%గా ఉంటుందని ఆర్థికవేత్తలు అంచనా వేయగా అది తప్పింది. 2022 ఏప్రిల్ తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ద్రవ్యోల్బణానికి ప్రధాన సూచికగా ఉండే వినియోగ ధరల సూచిక (సీపీఐ) జూలైలో అంచనాలకు తగిన విధంగానే ఉండగా, రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరుగుతుందని ఊహించలేదని ఇండియా రేటింగ్స్ ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ చెప్పారు. జూన్‌లో 4.49%గా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం జూలైలో 11.51%కి చేరుతుందని ఎవరూ ఊహించలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 5.4%గా ఉండవచ్చునని రిజర్వ్‌బ్యాంక్ గత నెలలో అంచనా వేసింది. గతంలో 5.1%గా ఉన్న ద్రవ్యోల్బణం ఆహార ధరల పెరుగుదల కారణంగా 5.4%కి చేరవచ్చునని తెలిపింది. ఇక కూరగాయలకు సంబంధించిన ద్రవ్యోల్బణం ఏకంగా 37.34% పెరిగింది. అంతకుముందు జూన్ నెలలో కూరగాయల ద్రవ్యోల్బణం 1% తగ్గడం గమనార్హం. వంటగదిలో ...11లో

ఇండ్ల కోసం ఎన్నాళ్లు తిప్పుకుంటారు..?

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి



నవతెలంగాణ-ధూల్‌పేట్

నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని చెప్పి.. ఇంకెన్నాళ్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని ప్రశ్నిఆచరు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శనివారం రిలేదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజలకు రెండు పడకల గది కట్టిస్తామని కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చి ప్రలోభాలకు గురి చేసిందని చెప్పారు. ఇప్పటి వరకు ఇండ్లు ఇవ్వకుండా మహిళలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పట్టణంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని ఇప్పటివరకు వేలల్లో మాత్రమే పరిమితం అయ్యాయని, అవి కూడా పంపిణీ చేయలేని పరిస్థితిలో ఉన్నాయని అన్నారు.

దరఖాస్తుల పరిశీలనకు సర్వేలు చేస్తున్నా.. అవి ఏ ప్రాతిపదికన చేస్తున్నారో అర్థం కాకుండా ఉందన్నారు. పాతబస్తీలో ఎక్కువ శాతం పేద ప్రజలు నివసిస్తున్నారన్నారు. అనేక సార్లు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను కలెక్టర్, ఆర్డీఓ, ఎంఆర్‌ఓకు అందజేశారని చెప్పారు. ఆన్‌లైన్‌లో చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బండ్లగూడ మండలంలో దాదాపు 1800 ఇండ్లు ఇప్పటివరకు పూర్తి కాగా, స్థానికులను ఎలాంటి పత్రాలూ అందించకపోవడంపై ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే వరకు తెచ్చుకోవద్దన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సక్రమంగా సర్వే చేసి అర్హులైన పేద ప్రజలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలను పెద్దఎత్తున కదిలించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు హెల్ కోటిరెడ్డి, లక్ష్మమ్మ, సత్తార్, కృష్ణా నాయక్, బాబర్ ఖాన్, శశికళ, కిషన్, రామ్ కుమార్, శ్రీను, రాజేష్, నూర్జహాన్, ఫిర్దోస్, జావిదా బేగం, భాను బేగం, లక్ష్మి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

25న సచివాలయంలో ప్రార్థన మందిరాలు
సీఎంచేతుల మీద ప్రారంభం

- తుది దశ పనులను పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్వమత సౌభ్రాతత్వం పరిడవిల్లే విధంగా ప్రార్థన మందిరాల నిర్మాణం జరిగిందని, వీటిని ఈనెల 25న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించనున్నారని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గుడి, మసీదు, చర్చి నిర్మాణ తుది దశ పనులను శనివారం అధికారులతో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాలు కలియ తిరిగారు. మిగిలిన చివరి దశ పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2300 గజాల స్థలంలో గుడి నిర్మాణం జరిగిందనీ, పనులన్నీ పూర్తయ్యాయని వెల్లడించారు. శివాలయం, పోచమ్మగుడి, హనుమాన్, గణపతి ఆలయాల పనులు అన్ని పూర్తయ్యాయని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన విగ్రహాలను తిరుపతి నుంచి ప్రత్యేకంగా తీసుకొస్తున్నామన్నారు. యాగంతో ఈ ఆలయాలు ప్రారంభం అవుతాయన్నారు. మసీదు, చర్చి కూడా ఆయా మత పెద్దల సమక్షంలో వారి మతాచారం ప్రకారం ప్రారంభించుకుంటామని తెలిపారు. తెలంగాణ అంటేనే గంగా జమునా తేహజీబ్ అని సర్వమత సమ్మేళితమన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే కాలేయాదయ్య, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ డా.మధుశేఖర్, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, డీఈలు దుర్గాప్రసాద్, మోహన్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, రైతు నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు తదితరులు ఉన్నారు.

ఇండ్లస్థలాలపై రాజీలేనిపోరు

24న జర్నలిస్టులు,రాజకీయపార్టీలతో సెమినార్

- టీడబ్ల్యూజేఎఫ్ ఓబీ తీర్మానం ప్రభుత్వ ఉద్యోగుల్లాగే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలుచేయాలంటూ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లస్థలాలు ఇచ్చేవరకు రాజీలేనిపోరాటం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం తీర్మానించింది. ఈనెల 24న సీనియర్ జర్నలిస్టులు, రాజకీయపక్షాలతో హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. శనివారం నగరంలోని త్యాగరాయగానసభలో ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య అధ్యక్షత వహించగా, ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య గత కార్యకాలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ఆఫీసు బేరర్ల సమావేశం రోజంతా చర్చించింది. సమాజానికి విస్తృతంగా సేవలు అందిస్తున్న జర్నలిస్టులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడటం సరైంది కాదని అభిప్రాయపడింది. గత 35 ఏండ్లుగా రాష్ట్రంలో స్థలాలు ఇవ్వలేదని గుర్తు చేసింది. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వొచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోవడం న్యాయం కాదని అభిప్రాయపడింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. సెమినార్ తర్వాత కూడా స్పందించకపోతే ఇందిరాపార్క్ దగ్గర రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇండ్లస్థలాలపై ఒక విధాన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేసింది. ఇకపోతే ప్రభుత్వ ఉద్యోగులకు హామి ఇచ్చినట్టుగా జర్నలిస్టులకు సైతం ఆరోగ్యపథకాన్ని ఉచితంగా వర్తింపచేయాలని విజ్ఞప్తి చేసింది. ఇలాగే కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన రైల్వే రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు నెలాఖరులో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఆఫీసు బేరర్ల సమావేశం ప్రకటించింది.

దేశ రాజధాని న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నామనీ, భారీసంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని సూచించింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫీసు బేరర్లు పి.ఆనందం, ఎస్‌కె సలీమ, ఆర్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల్లేవు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు

- హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ముగిసిన ఎస్ఎఫ్ఐ పాదయాత్ర

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస మౌలిక వసతుల్లేవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, సంక్షేమ వసతి గృహాల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ, ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మూడ్రోజుల అధ్యయన యాత్రలు శనివారం ముగిశాయి.

ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉంటే ఒక్క కళాశాలలో కూడా పాఠ్యపుస్తకాలు ఇప్పటికీ పంపిణీ చేయలేదని, యూనిఫామ్ ఇవ్వలేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీచర్స్, లెక్చరర్స్, వార్డెన్స్, ఎంఈఓలు, వర్కర్స్ ఇంకా అనేక పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వ భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు. సబ్జెక్టులకు కూడా టీచర్లు సరిగా లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన్న ట్రస్ట్ నుంచి వచ్చే భోజనాలను రద్దు చేసి.. మధ్యాహ్న భోజన కార్మికులను పెట్టి వండించి పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే చలో ప్రగతిభవన్ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, అధ్యక్షులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గద్దర్ సంస్మరణ సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాయుద్ధనౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ సంస్మరణ సభ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కళానిలయంలో జరగనుంది. ఈ మేరకు సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, డిజి నర్సింహారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం, సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ సినీ దర్శకులు బి నర్సింగ్‌రావు, ప్రముఖ కవి జయరాజ్, వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న హాజరవుతారని తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ(సీ), ఫార్వర్డ్‌బ్లాక్, ఆరెస్పీ, సీపీఐ (ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఐ ఎంఎల్ (జనశక్తి) పార్టీల రాష్ట్ర నాయకులు, గద్దర్ కుటుంబ సభ్యులు కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు, గద్దర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకుకుంటుందనీ, వారికి అండగా ఉంటుందని ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మైనార్టీలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కట్టుబడి ఉందని చెప్పారు. మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకాన్ని మైనార్టీల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. గడిచిన తొమ్మిదేండ్ల కాలంలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. వంద శాతం సబ్సిడీ కింద ఒక్కో లబ్దిదారుడికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. 204 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి అందరికి విద్య అందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నిరుపేద మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం కింద ఒక్కో మైనార్టీ విద్యార్థికి రూ.20 లక్షలకు పైగా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు అబ్దుల్ అహ్మద్ బీన్ బలాలా, జాఫర్ హుస్సేన్, కాలేరు వెంకటేష్, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ మహ్మద్ ఇంతియాజ్ ఇషాక్, రాజేశ్వర్ రావు, మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, హజ్ కమిటీ చైర్మెన్ తారిక్ అన్సారీ, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ ఇఫ్తారియా, వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ మసివుల్లా ఖాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఎండీ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీ ఆస్పత్రిలో .... మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఆదివారం నుంచి సేవలనందించనున్నది. ఆదివారం ఉదయం 11.15 గంటలకు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు దీనిని ప్రారంభించనున్నారు. ఒకటిన్నర లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు బ్లాకులు, ఏడంతస్తుల్లో అన్ని డిపార్ట్ మెంట్లను దీంట్లో ఏర్పాటు చేశారు. ఓపీ, ఓపీ ల్యాబ్, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు, ప్రసవ కేంద్రాలు, 36 లేబర్ డెలివరీ, రికవరీ రూములు, ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత తల్లి బిడ్డల కోసం 120 పడకలు, సమస్యలు ఎదురయ్యే పిల్లల కోసం నియోనాటల్ ఐసీయూ, ఇన్ బార్న్, అవుట్ బార్న్, ఎస్ఎన్ సీయూలు బేబీ వార్మర్స్, ఫోటోథెరపీ మిషన్లతో పాటు మదర్ కేర్ సెంటర్ ఏర్పాటుచేశారు.

సీరియస్ ఉన్న గర్భిణీల కోసం మెటర్నల్ ఐసీయూ, శస్త్రచికిత్సల అనంతరం తల్లుల కోసం 48 పడకలున్నాయి. ఎంఐసీయూలో కిడ్నీ సంబంధిత సమస్యలు ఎదురయ్యే తల్లులు, శిశువుల కోసం డయాలసీస్ సౌకర్యంతో పాటు ఆర్ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు.

జలాశయాల్లో చేపల వేటకు సౌరశక్తి పడవలు

ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్) ముమ్మర ప్రయత్నాలను ప్రారంభించింది. ముఖ్యంగా రాష్ట్రంలోని భారీ జలాశయాల్లో నిలువచేసిన లోతైన నీటిలో చేపలు పట్టేందుకు అనుగుణంగా మత్స్యకారులకు అవసరమైన యంత్ర సామాగ్రిని సమకూర్చేందుకు వీలున్న మార్గాలను మత్స్య సహకార సంఘాల సమైక్య కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. లోతైన నీటి నిలువను కలిగి ఉండే రిజర్వాయర్లో తెప్పలపై ప్రయాణం సురక్షితం కాకపోవడంతో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తప్పించాలని భావిస్తున్నది. రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్, దేశ, విదేశాల్లో అమల్లో ఉన్న విధానాలపై ఇది వరకే అధ్యయనం చేసి అనుభవం గడించారు. మర పడవలు డీజిల్, పెట్రోల్, లాంటి ఇంధనంతో నడిచే మోటర్ బోట్ల వినియోగంపై కూడా ఆయన అధ్యయనం నిర్వహించారు. ఫలితంగా తెప్పల వినియోగం స్థానంలో సౌరశక్తి (సోలార్) వినియోగంతో ఎలాంటి ఇంధన ఖర్చులు లేని పద్ధతిలో మత్స్యకారులకు అనేక రకాలుగా ఉపయోగపడే సురక్షితమైన ఫిషింగ్ బోట్స్‌ను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. సౌరశక్తి, నీటి అలల నుంచి ఉత్పత్తి చేయగలిగే విద్యుత్ శక్తి ఆధారంగా నడిచే హైబ్రిడ్ మోటార్లను బోట్లను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ ఆలోచనను అమల్లో తేవడానికి కేరళ రాష్ట్ర రాజధాని కొచ్చిన్‌లో నెలకొల్పిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ వారి సహాయ సహకారాలను తీసుకొనున్నట్టు ఆయన వెల్లడించారు. ఇందుకోసం త్వరలోనే కొచ్చిన్‌లోని ఆ సంస్థ సందర్శించి అక్కడి శాస్త్రవేత్తలు నిపుణులతో ప్రత్యేకంగా చర్చించనున్నట్టు చెప్పారు.

ఈ విషయంలో ప్రాథమికమైన అవగాహన కోసం హైదరాబాదులోని బిట్స్ పిలాని సంస్థలో పనిచేస్తున్న నిపుణులతో శనివారం చర్చించారు. తమ పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా బిట్స్ పిలానీ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ మోర పాకల శ్రీనివాస్, ప్రొఫెసర్ సంతాను కోలే తదితరులు హామీ ఇచ్చారు.

మైనార్టీలకు మొండి చెయ్యే..

కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలకు మెలిక

- లక్షతో సరిపెట్టే యోచన
- పాత దరఖాస్తులే పరిశీలన.. కొత్తవారికి అవకాశమే లేదు



అభ్యర్థుల ఎంపికలో జాప్యం.. విధివిధానాలపై గందరగోళం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"ఎస్సీ, ఎస్టీ వర్గాల మాదిరిగానే మైనార్టీల్లో కూడా పేదరికం ఉంది. ముస్లింలు, ఇతర మైనార్టీల జీవితాల్లో మార్పులు తేవాలని ప్రభుత్వం ఆచరణాత్మక విధానం అమలు చేస్తున్నది. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే విషయంలో ఎస్సీ, ఎస్టీల పట్ల ఎంత ఉదారంగా ఉంటుందో, మైనార్టీల విషయంలో కూడా అలాగే ఉండాలని నిర్ణయించింది".ఇది ప్రభుత్వం చెబుతున్న మాట..

కానీ..ఆచరణ అందుకు భిన్నంగా ఉందంటూ ముస్లిం మైనార్టీలు వాపోతున్నారు. తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్‌లో ఇప్పటికే సుమారు 3,60,000మంది స్వయం ఉపాధి లక్ష్యంగా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో చిరువ్యాపారులు, ఆటో, క్యాబ్, మెకానిక్, స్ట్రీట్ వెండర్లు, హాకర్లు తదితర వ్యాపారాల కోసం లబ్దిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించి, అర్హత కలిగిన వారికి తగిన రుణం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. వార్షిక బడ్జెట్లో కేటాయించిన నిధులను అధిక భాగం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు పెట్టాలి. కానీ.. నిధుల కేటాయించిన వాటికి , ఖర్చుకు పొంతన లేకుండా ఉంది. తొమ్మిదేండ్లలో మైనార్టీ సంక్షేమానికి బడ్జెటలో రూ.12,932 కోట్లు కేటాయించగా.. ఇందులో ఖర్చు చేసింది మాత్రం సుమారు రూ.6వేల కోట్లు మాత్రమే. బ్యాంకు సబ్సిడీ లోన్ల కోసం లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 8,500మందికి శాంక్షన్ లెటర్లు ఇవ్వగా, అందులో 4వేల మందికి బ్యాంకులు పెండింగ్‌లో పెట్టాయి. మిగిలిన 4,500మందికి మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కార్పొరేషన్ రుణాలకు చెక్‌పెట్టినట్టేనా?

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో బ్యాంకు సబ్సిడీ రుణాల కోసం లక్షల కొద్ది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని క్లియర్ చేయకుండా తిరిగి మైనార్టీలకు రూ.లక్ష సాయం పథకాన్ని ప్రకటించటంతో లక్షతో సరిపెట్టి ఉపాధి అవకాశాల కోసం గతంలో పెట్టుకున్న దరఖాస్తులను బుట్టదాఖలు చేయనున్నారా? అన్న అనుమానాలు ముస్లీం మైనార్టీలు వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే..ఇక మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెక్ పెట్టినట్టేనని చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. రూ. లక్ష సాయంకోసం ముస్లిం మైనార్టీలు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. గతంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారినే అర్హులుగా ప్రకటించిన నేపథ్యంలో ఇది పలు రకాల చర్చలకు దారితీస్తున్నదని తెలుస్తున్నది.

అర్జీలకు అవకాశం లేక ఇబ్బంది..

ముస్లిం మైనారిటీల విషయంలో రుణాలు కిందటేడు దరఖాస్తులు చేసుకున్నవారికే ఇవ్వనుండడంతో కొత్తవారు దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో కొత్త వారు రూ.లక్షసాయం అందే అవకాశం లేదు. కిందటేడు వివిధ కారణాల వల్ల దరఖాస్తులు చేసుకోని వారు.. తాజాగా అర్జీలు పెట్టుకునేందుకు వీలు కల్పిస్తే అర్హులైన మరికొందరు సాయం అందుకోగల అవకాశం కూడా ఉంటుంది. కానీ..ఆ అవకాశం లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. క్రిస్టియన్ మైనారిటీల విషయంలో కొత్తగా దరఖాస్తులకు అవకాశం ఇచ్చారు. గానీ.. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించేది ఎప్పుడు? సాయం పంపిణీ చేసేది ఎప్పుడు? అని మైనారిటీలు వాపోతున్నారు.

అధికారుల ఆందోళన..

ముస్లింలు ఆర్థిక సాయం కోసం కిందటేడు భారీ సంఖ్యలో దరఖాస్తులు పెట్టుకున్నారు. ప్రస్తుతం క్రిస్టియన్ మైనారిటీలు కూడా అదేస్థాయిలో దరఖాస్తులను దాఖలు చేశారు. ఇచ్చేది కొద్ది మందికి.. దరఖాస్తులేమో వెల్లువలా వచ్చాయి. సాయం పంపిణీ ఎలా చేయాలో తెలియక మైనారిటీశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు కూడా తక్కువే. ఇదివరకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు అందిస్తామన్న ప్రభుత్వం.. కొత్తగా రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించడంతో ఇక బ్యాంకులతో సంబంధం లేకుండా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలోనే పంపిణీ జరుగనున్నది. దీంతో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని మైనారిటీల్లో ఒక పక్క హర్షం వ్యక్తం చేస్తున్నా సాయం అందే విషయంలోనే వారిని పలు సందేహాలు వెంటాడుతున్నాయి.

120 యూనిట్లే..

నియోజకవర్గానికి 120 యూనిట్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో అతి తక్కువ మందికి మాత్రమే అందే అవకాశం ఉంది. దీంతో ఇవి ఏ మాత్రం సరిపోవని మైనారిటీలు వాపోతున్నారు. ఎనిమిదేండ్లుగా మైనార్టీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీ రుణాలు అందలేదు. రుణాలు ఇస్తున్నట్టు ప్రకటనలు చేయడం, దరఖాస్తులు స్వీకరించడం, నిధులు మాత్రం కేటాయించకపోవడంవల్ల అర్హులైన నిరుపేద మైనారిటీ యువత ఎలాంటి ఆర్థిక సాయం పొందలేకపోయారు. ఆయా సందర్భాల్లో కొందరు పొందినా వారి సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్ట వచ్చు. తమ జనాభా ప్రాతిపదికగా చూసినా నియోజకవర్గానికి కనీసం 300 మంది లబ్దిదారులకు సాయం అందించాల్సిన ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

రూ. లక్ష సాయం కోసం ఎదురు చూపు..

మైనార్టీలు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దళితులు దళిత బంధు పథకం కింద రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం పొందుతున్నారు. చేతివృత్తుల కులాలకు సంబంధించి రూ.లక్ష ఆర్థిక సాయం బీసీలు పొందుతున్నారు. ఈ క్రమంలో తమకు ఇంకా రుణ సాయ వితరణ మొదలు కాకపోవడంపై మైనారిటీలు ఆందోళన చెందుతున్నారు. 2023 మార్చి నెలాఖరులోగానే యూనిట్లను కేటాయించాల్సి ఉన్నా జాప్యం జరుగుతోంది.రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 46లక్షల మంది మైనార్టీలున్నారు.ఇందులో ముస్లింలు, బుద్ధిస్టులు, జైనులు, సిక్కులు, పార్శీల తెగలకు చెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. లబ్ధిదారులను ఆయా నియోజక వర్గాల్లో ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారనే దానిపై స్పష్టత లేదు. ఏఏ అంశాలను పరిగణలోకి తీసుకుంటారోననీ, అందులో మా పేర్లు ఉంటాయో, లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిపొందే అభ్యర్థులకు తెల్లరేషన్ కార్డు సహా వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ పరిధిలో రూ.2లక్షలు ఉండాలనేది ప్రాథమిక నిబంధన. అయితే కుల, చేతి వృత్తుల వారికి విధించినట్లుగా ఈ మైనారిటీ సాయంపై అలాంటి నిబంధనలేవి విధించలేదు.కానీ..ఆచరణ కనుచూపు మేరలో లేకపోవడంతో పథకం లక్ష్యం నెరవేరుతుందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు

గిరిజన మహిళపై పోలీసుల దాడి అమానుషం

- ప్రభుత్వం, మహిళా కమిషన్ స్పందించకపోవడం దారుణం : ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి
- బాధితురాలికి పరామర్శ



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళను బెల్టుతో విపరీతంగా కొట్టడం అన్యాయమని, బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణ జ్యోతి, మల్లు లక్ష్మీ, సహాయ కార్యదర్శి శశికళ డిమాండ్ చేశారు. పోలీసుల చేతిలో తీవ్రంగా గాయపడి రంగారెడ్డి జిల్లా కర్మాన్‌ఘాట్‌లోని జీవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత గిరిజన మహిళను శనివారం ఐద్వా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఇంటికి వెళ్తున్న గిరిజన మహిళను అడ్డుకుని ఇద్దరు మగ పోలీసులు అసభ్యకర పదజాలంతో తిడుతూ జీపులో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. మహిళ అని చూడకుండా బెల్టుతో విపరీతంగా కొట్టడం అన్యాయమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధితురాలికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళను తీవ్రంగా కొడితే కనీసం ప్రభుత్వంగానీ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గానీ స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ మహిళకు అన్యాయం జరిగినా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్పందిస్తేనే ఆ కుటుంబానికి భరోసా కలుగుతుందని అన్నారు. ఇప్పటికైనా వెంటనే ఈ ఘటనకు పాల్పడిన పోలీసులపై కేసు నమోదు చేసి విచారించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జనగామలో ముత్తిరెడ్డి అనుచరుల హంగామా

- ఎమ్మెల్సీ పల్లా దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- భారీగా పోలీసుల మోహరింపు



నవతెలంగాణ-జనగామ

జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ టిక్కెట్ రాజకీయం హీటెక్కింది. స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి - పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య రగడ మరింత పెరిగింది. రెండ్రోజుల కిందట పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన అనుచరులు హైదరాబాదులో ఒక హెూటల్లో సమావేశం అయిన విషయం తెలిసిందే. పల్లాకే టికెట్టు ఇవ్వాలని బీఆర్ఎస్ అధిష్టానానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అనుచరులు తమ నాయకునికే టిక్కెట్ ఇవ్వాలని శనివారం జనగామ జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. ప్రధాన రోడ్లగుండా ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ తీశారు. పల్లా వద్దు.. ముత్తిరెడ్డి ముద్దు అంటూ నినాదించారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు భారీగా మోహరించారు. చౌరస్తాలో పల్లా రాజేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని పోలీసులు అడ్డుకోగా.. వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి నేటి వరకు జనగామ ప్రాంత ప్రజల వెంట ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారన్నారు. వారికి ఇవ్వకుండా ఇతరులకు టిక్కెట్ ఇవ్వొద్దన్నారు. గతం కంటే ఇప్పుడు 50 వేల ఓట్ల మెజార్టీతో తమ నాయకున్ని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. పల్లాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడారు. ఈ ఆందోళనలో ముఖ్యమైన నేతలు లేకపోవడం గమనార్హం.

సాగు నీరు విడుదల చేయండి..

- చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంచాలి : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా



నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సాగునీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎన్నెస్పీ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టులో నీరందక పంటపొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురవకపోవడం వల్ల సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రాలేదన్నారు. దీంతో సాగునీటి విడుదలపై సందిగ్ధత నెలకొందన్నారు. సాగునీరు వస్తుందని ఆశతో ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకున్నారని, ఇప్పుడు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఈ సీజన్‌లో ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని దాని ఫలితంగా బోర్లు, బావుల కింద పంట పొలాలు సైతం ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం ఉందని.. అందువల్ల నీరు విడుదల చేయాలని కోరారు. గతంలో 510 అడుగులు ఉంటేనే మొదటి విడత నీరు విడుదల చేశారని, ఫలితంగా భూగర్భ జలాలు పెరిగి పంట పొలాలకు ఉపయోగపడిందని చెప్పారు. ప్రస్తుతం సాగునీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని కోరారు. భవిష్యత్‌లో తాగునీరు సమస్య కూడా ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మండల కార్యదర్శి మూడావత్ రవినాయక్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాగిరెడ్డి మంగారెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, పోలబోయిన వరలక్ష్మి, వినోద్‌నాయక్,నాయకులు పగిడోజు రామ్మూర్తి, చౌగాని వెంకన్న, పాపానాయక్, సైదానాయక్, కోటిరెడ్డి, కోడిరెక్క మల్లయ్య, భిక్షం, సైదులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం పెంచాలి

- రూ.24వేల వేతనం ఇవ్వాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్
- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

జీహెచ్ఎంసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనం రూ.24 వేలకు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. తెలంగాణ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ), గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. 25 ఏండ్లుగా గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు కార్మికులు సమర్థవంతంగా పని చేస్తున్నారని, వారికి వేతనాలు పెరిగి చాలా కాలం అవుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ధరలు, అధిక భారం వల్ల కనీస వేతనాలను రూ.24 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. జాతీయ, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల సంస్థలకు అమ్ముతున్నదని, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదించుకుందని, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వే, రక్షణ, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి బలోపేతం చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు.తెలంగాణ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులుగా సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. వారు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య సేవల్లో ప్రయివేటీకరణ చర్యలను వెంటనే ఉపసంహరించాలని, రాంకీ తదితర ప్రయివేటు కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజర్ పట్టీలో అవకతవకలను అరికట్టాలని, 2022 మే, జూన్ నెలల బకాయిలను చెల్లించాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి, ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రెబ్బా రామారావు, ఉపాధ్యక్షులు నర్సయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అంజాద్, యూనియన్ నేతలు ఇ.అంజయ్య, కె.సూర్య ప్రకాష్, ఎం.శ్రావణ్ కుమార్, సి.మల్లేష్, ఉన్ని కృష్ణన్, కిషన్, ఆర్.వాణి, వి.వి మంగపతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

హాకింపేట స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థుల ఆందోళన

ఓఎస్డీ హరికృష్ణను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



నవ తెలంగాణ-శామీర్ పేట

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న ఓఎస్డీ హరికృష్ణను వారం రోజుల కిందట ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఓఎస్డీ హరికృష్ణ ఎటువంటి తప్పు చేయలేదని.. ఆయనకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విద్యార్థులు స్కూల్ మెయిన్ బిల్డింగ్ నుంచి మెయిన్ గేటు వరకు 'మా సారు మాకు కావాలి' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చి బైటాయించారు. దాంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో స్కూల్‌లోని విద్యార్థులు ఒక్కసారిగా మెయిన్ బిల్డింగ్ నుంచి పరుగులు తీస్తూ రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ముఖ్య ద్వారం వరకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు స్కూల్ వద్దకు చేరుకున్న విద్యార్థులకు నచ్చజెప్పేందుకు యత్నించారు.

అయినా వీ వాంట్ జస్టిస్, మా సార్ మాకు కావాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. శామీర్‌పేట పోలీసులు విద్యార్థులను అడ్డుకుని గేట్‌లోపలికి పంపించారు. అనంతరం విద్యార్థులు నిరసన కొనసాగించారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకూర్చున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లైంగిక వేధింపులకు పాల్పడిన అసలు నిందితుడిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీలది మేకపోతు గాంభీర్యం

- బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - మెదక్

'ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో మళ్లీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారు. కాంగ్రెస్, బీజేపీలది మేకపోతు గాంభీర్యమే..' వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ విజన్, పట్టుదల, మేధస్సుతో తెలంగాణలో దశల వారీగా అభివృద్ధి జరుగుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రెస్‌మీట్‌లు, సోషల్ మీడియాలో తప్ప ప్రజల్లో లేవన్నారు. కాంగ్రెస్‌లో పోటీ చేసేందుకు నాయకులు లేరు కాబట్టే అభ్యర్థుల సీట్లను అమ్ముకుంటున్నట్టు ఆరోపించారు. కర్నాటకలో కాంగ్రెస్ పాలనలో ప్రజల ఇబ్బందులను అందరూ గమనిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకొని కుర్చీల కోసం పాకులాడుతున్నారు తప్ప ప్రజా సంక్షేమంపై యావ లేదని విమర్శించారు. బీజేపీ డిపాజిట్ల కోసం తండ్లాడే పరిస్థితితో ఉందని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రానికి దేశానికే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. పోడు పట్టాలు, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, పంచాయతీ సెక్రటేరీలు, వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో బీజేపీ, కాంగ్రెస్‌కు ఎజెండా అనేది లేకుండా బేజారై పోతున్నారని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్సీలతో సిట్టింగులకు టెన్షన్

- ఎన్నికల్లో టికెట్లకు తీవ్ర పోటీ
- తమ సీటుకే ఎసరు రావడంతో లబోదిబో
- పలు వివాదాల్లో సిట్టింగ్‌లు



నవతెలంగాణ-హనుమకొండ

వరంగల్ ఉమ్మడి జిల్లాలో అధికారిక పార్టీలో ఎమ్మెల్సీలతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టెన్షన్ పట్టుకుంది. ప్రధానంగా జనగామలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు- ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో, భూపాలపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డికి మాజీ శాసనసభాపతి, ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదనాచారితో, మహబూబాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు- ఎమ్మెల్సీ, మంత్రి సత్యవతి రాథోడ్‌తో టికెట్ల పోటీ ఏర్పడింది. వారి వల్ల సిట్టింగ్‌లు తమ సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది.

ఈనెల 21న ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ మొదటి లిస్టును ప్రకటిస్తున్నారని వాటి వివరాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి లేదా పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి, భూపాలపల్లిలో మధుసూదనాచారికి, మహబూబాబాద్‌లో సత్యవతి రాథోడ్ కు టికెట్లు కేటాయించబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో టికెట్ వస్తుందో రాదో అని కేసీఆర్ మొదటి జాబితా ప్రకటించేంతవరకు సిట్టింగులకు నిద్ర పట్టడం లేదు.

వివాదాలే కొంప ముంచుతున్నాయా..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వరంగల్ జిల్లాలో మెజారిటీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకున్నారు. ఈసారి కూడా సిట్టింగులకే టికెట్లు ఇస్తామని, ఒళ్లు దగ్గర పెట్టుకుని వివాదాలకు దూరంగా ఉండి.. ప్రజల మధ్యలో పనిచేయాలని ఎమ్మెల్యేలకు సీఎం కేసీఆర్ పదేపదే చెప్పినా పెడచెవిన పెట్టడం వల్లే వారికి ఈ పరిస్థితి వచ్చిందని పలువురు బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ప్రధానంగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గత ఎన్నికల్లో కూడా చివరి దశలో టికెట్లు దక్కించుకున్నారు. ఈసారి కూడా వారు ప్రమాదంలో పడటానికి కారణం వారి స్వయం కృపరాధమేనని తెలుస్తోంది.

ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూ కబ్జాల్లో కూరుకుపోయారు. ఈసారి స్వయానా ఆయన కూతురే తండ్రికి టికెట్ ఇస్తే తానే నిలబడి ఓడిస్తానని బాహాటంగా ప్రకటించారు. తాటికొండ రాజయ్య దళితబంధు స్కీంలో కమీషన్లు తీసుకుంటున్నారని స్వయానా అధినేత కేసీఆర్ హెచ్చరించినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. నారాయణగిరి సర్పంచ్ నవ్య రూపంలో మరో పెద్ద వివాదంలో చిక్కుకొని చేజేతులా ప్రమాదంలో పడ్డారు.

మహబూబాబాద్‌లో శంకర్‌నాయక్ అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పేరు ఉంది. గతంలో ఒక ఐఏఎస్ మహిళా అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించి వార్తల్లోకెక్కారు. ఇప్పుడు ఒక సమావేశంలో ఎంపీ కవిత మాట్లాడుతుండగా బహిరంగంగానే మైకు గుంజుకొని అధినేత దృష్టిలో పడ్డారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు మీడియాలో వచ్చాయి.

కేసీఆర్ కన్వెన్షన్ షురూ

- ప్రారంభించిన అల్లు అర్జున్
- భారీగా తరలొచ్చిన అభిమానులు



నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం బట్టుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కేసీర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను సినీహీరో అల్లు అర్జున్ శనివారం ప్రారంభించారు. అల్లు అర్జున్ మామ, కేసీఆర్ ఫౌండేషన్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి రూ.1.50 కోట్లతో కేసీఆర్ కన్వెన్షన్ ఫేస్ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12.15గంటలకు ప్రారంభించారు.

అంతకు ముందు అల్లుఅర్జున్ పెద్దవూరకు చేరుకోగానే పెద్దఎత్తున అభిమానులు బైక్‌ర్యాలీ తీశారు. అనంతరం కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి స్వాగత ఉపన్యాసంతో సభ ప్రారంభమైంది. అల్లు అర్జున్ అభిమానులనుద్దేశించి మాట్లాడారు. ఈ సమయంలో పెద్దఎత్తున అభిమానులు స్టేజిపైకి రావడం.. పోలీసులు అడ్డుకున్నా వినకపోవడంతో ఆయన కిందకు దిగి వాహనం ఎక్కారు. ఈ సందర్భంగా అభిమానులు పుష్ప సినిమాలో పాటకు డ్యాన్స్ వేశారు. ఈ కార్యక్రమంలో అల్లుఅర్జున్ అత్త కంచర్ల అరుణ, డాక్టర్ రఘు, ఐపీఎస్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికొకరై అందరొక్కటై కుల మత ప్రాంతీయ భాషా భేదాలకు అతీతంగా ఒకే జాతిగా భారతీయులు ప్రగతి పథాన పురోగమించాలని అలనాటి రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. జరుగుతున్నదేమిటి? ఉమ్మడి భావన బీటలువారుతోంది. సంకుచిత భావజాల ప్రచారం విభేదాలకు, సామాజిక అశాంతికి, చీలికలకు పాలుపోస్తోంది. జన సమూహాల నడుమ కత్తులు దూసుకునే శత్రుత్వాలకు, నెత్తుటేళ్లు పారించే వైషమ్యాలకు అంటుకడుతోంది. ఈ దుష్ప్రచారాన్ని క్షణాల వ్యవధిలో అసంఖ్యాకులకు చేరవేయడంలో సామాజిక మాధ్యమాల యూనివర్సిటీ విద్యార్థులు తల మునకలై ఉన్నారు.



విద్వేషం

సంపాదకీయం

"సామాజిక సౌహార్ధానికి భిన్న వర్గాల మధ్య సామరస్యానికి చిచ్చు పెట్టే క్లిష్ట ప్రసంగాలు సమర్థనీయం కానే కాదు. ఎక్కడికక్కడ కుల, మత, ప్రాంతీయ విభేదాలు రాజేస్తూ ఓట్ల చలి మంటలు కాచుకునే విద్వేష ప్రసంగీకుల్ని అణచివేయని పక్షంలో రాజ్యాంగ విలువలు చచ్చుబడిపోతాయి" అని సర్వోన్నత న్యాయస్థానమే ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయస్థానం భయపడినట్టుగానే నేడు దేశంలో పరిస్థితులు నెలకొన్నాయి. యావత్ దేశాన్ని విద్వేష సునామీ ముంచెత్తుతోంది. నిజాలను వక్రీకరించి, మాటలకు కాలకూట విషం పులిమి మారణహోమం సృష్టిస్తోంది.

"దేశమును ప్రేమించమన్నా మంచియన్నది పెంచుమన్నా" అని అప్పటి భారతీయులకు తెలుగు కవి ఇచ్చిన కొత్త పిలుపు. "సుజలాం సుఫలాం మలయజ శీతలాం" అనే దేశభక్తికి భిన్నంగా "దేశమంటే మనుషులు" అని కొత్త అర్థం చెప్పిన కవిత ఇది. ఇప్పటికీ దేశభక్తి చర్చనీయాంశంగా ఉంది. మనుషుల్ని కులం పేరిట, మతం పేరిట, ఆహారం పేరిట ఇంకా సవాలక్ష మౌఢ్యాలతో హింసిస్తూ దేశభక్తుల ముసుగులో తిరగడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అసలైన దేశభక్తి మనుషులను ప్రేమించడంలో ఉందని గురజాడ చెప్పిన మాటలు ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. అందుకే ఈ మహావాక్యానికి ఇంకా ప్రాసంగికత ఉంది. మనుషుల్ని ప్రేమించడం, మానవ శ్రమతో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవడం, స్వయం సమృద్ధిని సాధించడం, కులమత మౌఢ్యాల నుంచి విముక్తమై దేశ ప్రజలంతా ఒక తల్లీబిడ్డలుగా బతకడం గురజాడ దృష్టిలో దేశభక్తి. కానీ, దేశంలో అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి.

దేశంలో సంగీతం విద్వేషాన్ని వ్యాపింపజేసే ప్రమాదకర మాధ్యమంగా మారిపోతోంది. దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని ఎగజిమ్మే పాటలు సోషల్ మీడియాలో కుప్పలుతెప్పలుగా వైరల్ అవుతున్నాయి. హిందూ రైట్ వింగ్ భావజాల సమర్థకులే వీటి కర్త కర్మ క్రియలు. ఈ పాటల్లో వాడుతున్న భాష అవమానకరంగా, బెదిరింపులతో కూడుకుని ఉంటోంది. మరోవైపు... చరిత్ర పుటలను మతం రంగు పులిమిన కళ్లద్దాలతో చూసేవాళ్లు... ఉత్తుత్త పుకార్లను చరిత్రగా నమ్మేవాళ్లు... చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారు. బడిలో "భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు" ప్రతిజ్ఞ చేశాం. ఇప్పుడా ప్రతిజ్ఞకు తిలోదకాలిచ్చి ఒకరినొకరు చంపుకునే దుస్థితికి దిగజారిపోయాం.

విద్వేష భావజాలం వెళ్ళగక్కి సౌభ్రాతృత్వాన్ని చావుదెబ్బ తీసేవాళ్లపై ఫిర్యాదుల కోసం వేచి చూడకుండా 'సుమోటో'గా కేసులు పెట్టాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. కేసుల నమోదులో ఏమాత్రం జాప్యం జరిగినా అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని కూడా హెచ్చరించింది. అదే జరిగి ఉంటే నేడు ఇలా అగ్నిగుండంలా మారుతుందా?

ఒకరికొకరై అందరొక్కటై కుల మత ప్రాంతీయ భాషా భేదాలకు అతీతంగా ఒకే జాతిగా భారతీయులు ప్రగతి పథాన పురోగమించాలని అలనాటి రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. జరుగుతున్నదేమిటి? ఉమ్మడి భావన బీటలువారుతోంది. సంకుచిత భావజాల ప్రచారం విభేదాలకు, సామాజిక అశాంతికి, చీలికలకు పాలుపోస్తోంది. జన సమూహాల నడుమ కత్తులు దూసుకునే శత్రుత్వాలకు, నెత్తుటేళ్లు పారించే వైషమ్యాలకు అంటుకడుతోంది. ఈ దుష్ప్రచారాన్ని క్షణాల వ్యవధిలో అసంఖ్యాకులకు చేరవేయడంలో సామాజిక మాధ్యమాల యూనివర్సిటీ విద్యార్థులు తల మునకలై ఉన్నారు. అశ్లీల, అసభ్య సమాచార వాహికలుగా భ్రష్టుపట్టి పరువు మోస్తున్న సామాజిక మాధ్యమాలు విద్వేష వ్యాఖ్యల పంపిణీ ఏజెన్సీలుగా దిగజారి కలుషిత సాగరాల్ని తలపిస్తున్నాయి. తద్వారా వాటిల్లే విపరీత నష్టాల తీవ్రతను ముందుగానే ఊహించి కావచ్చు. అయిదేండ్ల క్రితమే తెహసీన్ పూనావాలా! కేసులో న్యాయపాలిక ఘాటుగా స్పందించింది. అసహనం, భావజాలపరమైన ఆధిపత్యం, దురభిప్రాయాల కుదుళ్ల నుంచి పుట్టుకొచ్చే విద్వేష నేరాలను ఏమాత్రం సహించరాదని అప్పట్లోనే సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించింది. అందుకనుగుణంగా వ్యవస్థాగత సన్నద్ధత కొరవడిన పర్యవసానంగా విద్వేష దావానలం పోనుపోను ప్రజ్వరిల్లుతోంది. ఇది స్వార్థపర శక్తులు తమ ప్రయోజనార్థం సృష్టిస్తోన్న అగాథాల జ్వాల. విధ్వంసాల హేల. యువత దీన్ని గుర్తెరిగి ఎదుర్కోవాల్సి ఉంది. అన్ని వ్యవస్థలకూ ఇది పాకుతోంది. ద్వేషం మనిషిని అమానవీయంగా మారుస్తుంది. దేశం ముందుకు పోవాలంటే విద్వేషాలను కాల్చేయాల్సిందే.

అభాసుపాలైన అంతర్జాతీయ అభాండం

మీడియాలో, సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు, విమర్శలు చేసేవారిపై నరేంద్రమోడీ ప్రభుత్వం దాడులు, నిర్బంధాలు కొత్తకాదు. గానీ ఇటీవలి కాలంలో అందుకోసం అనుసరిస్తున్న పద్ధతులే మరీ ఘోరంగా తయారైనాయి. దేశభక్తి తమ స్వంతమైనట్టు మిగిలినవారంతా దేశద్రోహులైనట్టు చిత్రిస్తూ అబద్ధాలు ప్రచారం చేయడం ఒక వ్యూహంగా మారింది. ఇటీవలి రోజులలో న్యూస్‌క్లిక్ పోర్టల్‌పై దారుణ దుష్ప్రచారం అందులో తాజా అధ్యాయం. ఈ దాడిలో అంతర్జాతీయ మీడియా కూడా భాగస్వామి కావడం చూస్తే కుట్రలు ఎంత పకడ్బందీగా నడుస్తాయో అర్థమవుతుంది. ఈ మాయాజాలంలోకి నెమ్మదిగా సీపీఐ(ఎం) నేతలనూ, తర్వాత కాంగ్రెస్‌నూ కూడా కలుపుతూ కేంద్రమంత్రులే రభసచేయడం, మీడియా దానికి విపరీత ప్రచారం ఇవ్వడం రాజ్యసభలో హక్కుల నోటీసు ఇచ్చాక చప్పున ఇప్పటికీ సర్దుకోవడం గమనించవచ్చు. అయినా వివిధ మీడియాలలో సంఘ్ పరివార్‌కూ సామ్రాజ్యవాదానికి అనుకూలమైన వేదికలలో వాటినీ అటూ ఇటూ తిప్పి తిప్పి చూపెడుతూ కొత్త విషయంలా ప్రచారం నడిపిస్తున్నారు. అందుకు దీనిపై నిజానిజాలు చెప్పుకోవలసిన అవసరమేర్పడుతున్నది. ఇంతా చేస్తే వడ్లగింజల్లో బియ్యం గింజలా అందులో ఉన్నది అచ్చంగా అదే కథ. ఎన్నిసార్లు రాసినా ఎంత చెప్పినా అదే రొద. 2021లో ఇదే న్యూస్‌క్లిక్ ఆఫీసుపై దాడిచేసి దిగ్బంధనంతో సిబ్బందిని నిర్బంధం చేసి ఏదో కనిపెట్టినట్టు కథలు వదిలారు. అయితే తర్వాత ఢిల్లీ హైకోర్టు వాటిని నిలిపేసింది. మళ్లీ ఇప్పుడు దేశమంతా మణిపూర్ విషయమై ఆందోళన చెందుతున్నప్పుడు ఈ కథ పునఃప్రారంభమైంది. అమెరికా పత్రిక న్యూయార్క్ టైమ్స్ ఏదో కథనం ప్రచురించడం ఇందుకు ఆధారమైంది. పోనీ ఆ కథలో అక్రమాలు లేదా చట్ట విరుద్ధమైన దేశ వ్యతిరేకమైన ఆరోపణల ఉదాహరణలు ఏవైనా పేర్కొన్నారా అంటే అదీలేదు. న్యూస్‌క్లిక్ యజమాని, ప్రధాన సంపాదకుడు అయిన ప్రజావైజ్ఞానిక మేధావి ప్రబీర్ పురకాయస్థకు అమెరికాలో సంపన్నుడైన నవెల్లి రాయ్ సింగంకు మధ్య సంబంధాలున్నాయనే అరోపణపైనే ఆ కథనం నడిచింది. వారిద్దరూ మాట్లాడుకున్న వాట్సప్‌చాట్లు ఉదహరించబడ్డాయి. అదే



తెలకపల్లి రవి

> ఒక కార్పొరేట్ సంస్థగా సింగం నెట్‌వర్క్ న్యూస్‌క్లిక్‌కు తోడ్పాటునివ్వడం కూడా చట్టబద్ధమే. తమకు ఏ దేశ ప్రభుత్వంతో గానీ, పార్టీతో గాని సంబంధం లేదని, ఎవరి నిధులు తీసుకోవడం జరగలేదని అటు సింగం, ఇటు న్యూస్ క్లిక్ సంపాదకుడు ప్రబీర్ అధికారులకు స్పష్టంగా చెప్పేశారు. 'మా అభిప్రాయాలు పంచుకునే వారికి సహాయం చేసినా ఎక్కడా నేను వాటిని అదుపు చేయడం లేదని' సింగం స్పష్టం చేశారు. 'నా వయసు నాకున్న అవకాశాల దృష్ట్యా విస్తృతంగా సహాయపడాలని నిర్ణయించుకున్నాను' అని ప్రకటించారు.

సింగంతో పీపుల్స్‌డెమోక్రసీ సంపాదకుడైన ప్రకాశ్‌కరత్ సందేశాలుండటం అపరాధమైనట్టు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం సాగింది. దీన్ని న్యూస్‌క్లిక్, ప్రబీర్, ప్రకాశ్‌కరత్, సీపీఐ(ఎం) కూడా ఖండించినా పార్లమెంటులో కూడా ఇదే కథ ఆధారంగా ఆరోపణలు చేసి నాలుక కర్చుకున్నారు. ప్రజానుకూల ప్రత్యామ్నాయ కథనాలతో, పరిశోధనాత్మక సమాచారంతో న్యూస్‌క్లిక్ సుపరిచితం.

అంతాచట్టబద్ధమే

ఇంతకూ న్యూయార్క్ టైమ్స్ రాసిందేమిటి? నోకోల్డ్ వార్(ప్రచ్ఛన్న యుద్ధం వద్దు) గ్రూప్ లండన్‌లో చేసిన ప్రదర్శనతో ఈ కథనం మొదలవుతుంది. అమెరికా పౌరుడైన నవెల్లి రాయ్ సింగం మానవహక్కుల ఉద్యమాలకు, వామపక్ష పోరాటాలకు సహాయం చేస్తుంటాడని పేర్కొంది. ఈయన తండ్రి కూడా ప్రొఫెసర్‌గా ఉంటూ ప్రజాస్వామిక వాదులకు సహాయం చేసేవాడు. ఈయన భార్య ఇవెన్ కోడ్‌పింక్ పేరిట సామాజిక శక్తులకు సహాయపడుతుంటారు. ఆఫ్రికాలోనూ, బ్రెజిల్, ఇండియాలలోనూ ఉద్యమాలకూ వార్తా సంస్థలకు ఈయన తోడ్పడుతుంటారని టైమ్స్ రాసింది. ఈ విరాళాలు ఇవ్వడం అమెరికా చట్టాల ప్రకారం తప్పు కాదని కూడా ఆకథనంలోనే ఉంది. సింగం షాంఘైలో కార్యాలయం కలిగివున్నారని, ఆ భవనంలోనే చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రచార విభాగం కూడా ఉందని తెల్పింది. చైనాలోనూ, విదేశాలలోనూ కూడా ఆయన మీడియా వ్యాపారంలో ఉన్నాడని చెబుతూనే ఇది చైనా కమ్యూనిస్టుపార్టీ చెప్పినట్టు నడుస్తున్నట్టు ఆరోపించింది. అందుకోసం ఎలాంటి నిర్దిష్టమైన ఆధారాలు చూపిందా అంటే లేదు. ఆయన మరో ఇద్దరు చైనా యూనివర్సిటీతో కలసి వీడియోలు చేస్తుంటారని, వాటికి పెట్టుబడిలో కొంత భాగం చైనాపార్టీ సమకూరుస్తుందని మాత్రమే రాశారు. అంటే అది కూడా పూర్తిగా కాదు. ఈ సందర్భంగా జరిగిన ఒక వర్క్‌షాప్‌లో సింగం పాల్గొనడం కూడా తప్పులాగా చూపింది. ఎన్నెన్నో పనులు ఔట్‌సోర్సింగ్‌కు కాంట్రాక్టులకు ఇచ్చే ఈ కాలంలో ఒక యూనివర్సిటీ, ఓ విదేశీ మీడియా సంస్థకు వీడియోల తయారీ ఇస్తే అది రాజకీయ సంబంధమైపోతుందా? కొంత పెట్టుబడి చైనాపార్టీ సమకూర్చిందని తాడూ బొంగరం లేని రాత రాస్తే విలువెంత? ఇక వారు చూపించే సందేశాలు కూడా వార్తా ప్రసారాలకు సంబంధించినవే. చైనాలో కరోనాను ఎదుర్కొన్న తీరు గురించి మూడు పరిశోధనాత్మక కథనాలు రాసే విషయమై ప్రబీర్ పురకాయస్థ, ప్రకాశ్ కరత్‌లతో సింగం సమాచారం పంచుకోవడమే పెద్ద ఆధారంగా ఆ పత్రిక కథనం ప్రచారంలో పెట్టింది. అవైనా ఎంత నిజమనేది చూడవలసిన విషయమే.



పరస్పర ఆధార ప్రహసనం

ఇంతకూ ఇక్కడో ట్విస్టు ఉంది. న్యూయార్క్‌టైమ్స్ రాసిన కథనాన్ని మనదేశంలో బడా మీడియా వాడుకుంటే ఆ పత్రిక మాత్రం మోడీ ప్రభుత్వం న్యూస్‌క్లిక్‌పై జరిపిన దాడిని సోదాలను ఆధారాలుగా ప్రస్తావించింది. వాస్తవంగా రాసినభాష ఇది "భారతీయ అధికారులు పత్రికలపై దాడిలో భాగంగా సింగంతో ముడిపడిన ఒక వార్తాసంస్థపై దాడి చేశారు. దానికి చైనా ప్రభుత్వంతో సంబంధాలున్నాయని ఆరోపించారు గాని ఎలాంటి సాక్ష్యాధారాలు చూపలేకపోయారు." తాను మొదటిసారిగా ఈ కార్యకలాపాలకు చైనా కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలకు ఆధారాలు సంపాదించినట్టు న్యూయార్క్ టైమ్స్ చెప్పుకుంది. అయితే అవన్నీ తాడూ బొంగరం లేనివే. శాంతి, మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలకు తాను సాయంచేస్తానని సింగం బహిరంగంగానే ప్రకటించుకున్నారు. అది కూడా అమెరికా చట్టం నిబంధనలకు లోబడిమాత్రమే. ఆ వివరాలు అందుబాటులోనే ఉన్నాయి. ఉదాహరణకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిజానికి మద్దతుగా వీడియోలు పుస్తకాలు ప్రచురించే ట్రైకాంటినెంటల్ బాధ్యుడైన విజయప్రసాద్ భారీ సాఫ్ట్‌వేర్ కంపెనీ గల ఒక దాత సహకరిస్తుంటారని ట్విటర్‌లోనే పేర్కొన్నారు. కనుక ఇందులో రహస్యం గానీ, పరిశోధించితేల్చింది గానీ ఏమీ లేదు. ఒక కార్పొరేట్ సంస్థగా సింగం నెట్‌వర్క్ న్యూస్‌క్లిక్‌కు తోడ్పాటునివ్వడం కూడా చట్టబద్ధమే. తమకు ఏ దేశ ప్రభుత్వంతో గానీ, పార్టీతో గాని సంబంధం లేదని, ఎవరి నిధులు తీసుకోవడం జరగలేదని అటు సింగం, ఇటు న్యూస్ క్లిక్ సంపాడకుడు ప్రబీర్ అధికారులకు స్పష్టంగా చెప్పేశారు. 'మా అభిప్రాయాలు పంచుకునే వారికి సహాయం చేసినా ఎక్కడా నేను వాటిని అదుపు చేయడం లేదని' సింగం స్పష్టం చేశారు. 'నా వయసు నాకున్న అవకాశాల దృష్ట్యా విస్తృతంగా సహాయపడాలని నిర్ణయించుకున్నాను' అని ప్రకటించారు. అందులో భాగంగానే తన కంపెనీ థాట్‌వర్క్స్‌ను కూడా అమ్మేశారు. ఆ పత్రాలు లెక్కలు అన్నీ అందుబాటులోనే ఉన్నాయి. ఇక్కడ మీడియావారు చేసిందల్లా అవేవో రహస్య విషయాలుగా చూపడమూ కథనం రాసిన న్యూయార్క్ టైమ్స్ దృష్టిలో శాంతి, సోషలిజాల కోసం పనిచేయడం సహకరించడం మహాపరాధం. ఉదాహరణకు చైనా కమ్యూనిస్టుపార్టీ శ్రామిక వర్గ విప్లవం ఇప్పటికీ ప్రపంచాన్ని ఉత్తేజపరుస్తూనే ఉందని న్యూస్‌క్లిక్‌లో రాయడం కూడా చైనా అనుకూలత అట. మనదేశంలోనే గాక ప్రపంచ వ్యాపితంగా రష్యా, చైనా, వియత్నాం విప్లవాలను అభినందించడం మనకు తెలుసు. అలాగే కరోనాకు తొలుత గురైన దేశంగా చైనా ఎలా ఎదుర్కొన్నదనే విషయం చాలా పత్రికలు రాశాయి. చైనా నుంచే కరోనా వైరస్ వచ్చిందనే కట్టుకథలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సాధికారికంగా ధృవీకరించలేదు. (ఆ మాటకొస్తే ఢిల్లీలోని తబ్లీగే జమాయిత్‌లో ముస్లింలు కావాలని దీన్ని పెంచారని సాగిన కవ్వింపు ప్రచారాలను తర్వాత కాలంలో సుప్రీం కోర్టు తీవ్రంగా ఖండించింది.)

అబద్ధాలు అభాసుపాలు

అమెరికా మార్క్ కమ్యూనిస్టు వ్యతిరేకతతో వండివార్చిన ఈ కథనమే పెద్దసాకుగా తలపోశారు బీజేపీ పాలకులు. అంతేగాని ఇక్కడ వారు పరిశోధనాత్మక జర్నలిజంతో కనిపెట్టింది శూన్యం. దుష్ప్రచారమే కనిపెట్టారు. బీజేపీ ఎంపి నిశికాంత్ దూబే, మంత్రులు అనురాగ్ ఠాగూర్, పీయుష్ గోయెల్‌లు పార్లమెంటులోనూ బయటా కూడా తలాతోక లేని ఈ కథనం బట్టుకుని సీపీఐ(ఎం)పైన, కాంగ్రెస్‌పైన విషంకక్కారు. (ఒకప్పుడు తమ హయాంలో సీపీఐ(ఎం) ఏర్పడుతన్న దశలోనే చైనా అనుకూల ముద్రవేసి వేలమందిని అరెస్టులు చేసిన కాంగ్రెస్‌కు కూడా అదే అనుభవంలోకి వచ్చి ఉండాలి) ఈ దేశద్రోహ ప్రచారంపై పార్లమెంటులో తీవ్ర నిరసనతో పాటు సభా హక్కుల నోటీసు కూడా ఇచ్చాక పియూష్ గోయెల్ వంటివారు తోకముడిచారు. ప్రకాశ్‌కరత్‌పై అభాండాలను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. సభలో సభ్యుడు కాని వారిపై ఆరోపణలు చేయరాదనే ప్రాథమిక మర్యాదను సంప్రదాయాన్ని కూడా బీజేపీ మంటకలిపిందని పేర్కొంది. తన హిందూత్వ మతోన్మాద రాజకీయాలపై వామపక్షాలు గట్టిగా పోరాడుతున్నాయి గనకే ఈ విధమైన అసత్య ప్రచారాలకు దిగినట్టు స్పష్టం చేసింది. న్యూస్‌క్లిక్ తరపున ప్రబీర్ పురకాయస్త కూడా సూటిగా సమాధానమిచ్చారు. కొందరు రాజకీయ పాత్రధారులు, కొన్ని మీడియా సంస్థలు ఎలాంటి వాస్తవాలు చట్టబద్ధత లేకుండా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని తెలిపారు. తమ మలివిడత దుష్ప్రచారం తేలిపోవడంతో ఇప్పుడు మరోసారి ఈడీని రంగంలోకి దించి ప్రబీర్ ఇంటిని స్వాధీనం చేసుకున్నట్టు వార్తలు వదులుతున్నారు. వాటిపై ఆ సంస్థ పోరాటం సాగిస్తున్నది కూడా. ఇందుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిందేనని కోర్టు ఆదేశించినట్టు కూడా అదేపనిగా వార్తలు ఇస్తున్నారు. చట్ట పరిధిలో అవసరమైన ప్రశ్నలకు జవాబు చెప్పడానికి వారు ఎన్నడూ నిరాకరించింది లేదు. ఆ అవసరం అంతకన్నా ఉండదు. ఎటొచ్చి జాతీయంగా, అంతర్జాతీయంగా దుర్మార్గ రాజకీయాలనూ, దుస్తంత్రాలను నిక్కచ్చిగా ఎదుర్కొనే వారిపై పాలకుల దాడి కొత్త కాదు. వైర్, న్యూస్‌క్లిక్ వంటివి అందుకు పదునైన ఆయుధాలుగా ఉన్నాయి గనకే ఈ దాడి సాగదీస్తున్నారు. తీస్తా సెతల్వాద్‌నూ అలాగే వేటాడటం చూస్తున్నాం. ఆమెతో పాటు గౌతమ్ నౌలఖే వంటివారి వివిధ సేవలకు ఈ ఖాతాల నుంచి మొత్తాలు జమపడితే అందులో ఏదో అక్రమం జరిగినట్టు చూపేందుకు అవస్థలు పడుతున్నారు. దేశ సంపదనూ, విశాఖ ఉక్కు వంటి మహాసంస్థలనే అదానీలకు అప్పగిస్తూ వారిపై ప్రపంచ స్థాయిలో వచ్చిన తీవ్ర ఆరోపణలను, కుంభకోణాలను కప్పిపుచ్చుతున్న మోడీ సర్కారు ప్రజల కోసం పోరాడే ప్రజాస్వామిక వాదులపైన, సంస్థలపైన అభాండాలు వేస్తూ అణచివేయాలనుకోవడం హాస్యాస్పదం. పలు మీడియా సంస్థలూ, మేధావులు న్యూస్‌క్లిక్‌పై దాడిని ఖండిస్తూ ముందుకు రావడం హర్షనీయం. ■

> ప్రకాశ్‌కరత్‌పై అభాండాలను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. సభలో సభ్యుడు కాని వారిపై ఆరోపణలు చేయరాదనే ప్రాథమిక మర్యాదను సంప్రదాయాన్ని కూడా బీజేపీ మంటకలిపిందని పేర్కొంది. తన హిందూత్వ మతోన్మాద రాజకీయాలపై వామపక్షాలు గట్టిగా పోరాడుతున్నాయి గనకే ఈ విధమైన అసత్య ప్రచారాలకు దిగినట్టు స్పష్టం చేసింది. న్యూస్‌క్లిక్ తరపున ప్రబీర్ పురకాయస్త కూడా సూటిగా సమాధానమిచ్చారు. కొందరు రాజకీయ పాత్రధారులు, కొన్ని మీడియా సంస్థలు ఎలాంటి వాస్తవాలు చట్టబద్ధత లేకుండా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని తెలిపారు.

"ఫ్లయింగ్ కిస్"

"ఛీ! ఛీ! ఇదేం పాడుబుద్ధి!" అన్నది అసహ్యంగా మెహంపెట్టుకుని సరళ.

"ఏం పాడుబుద్ధి? ఎవరిది?" ఆసక్తిగా అడిగింది శ్రీలక్ష్మి.

"ఇంత అన్యాయమా? నిండు సభలో ఇట్లా చేయవచ్చా? ఇదేనా మన సంస్కృతి? అయినా బయటివారికి భారతీయ సంస్కృతి ఏం తెలుస్తుందిలే?" మరింత చిరాగ్గా అన్నది సరళ.

"ఇంతకూ నీవు ఎవర్ని గురించి అంటున్నావు! నన్నేనా?" గద్దించింది శ్రీలక్ష్మి.

"అయ్యో! వదినా నిన్నెలా అంటారు! మొన్న లోక్‌సభలో ఫ్లయింగ్ కిస్ ఇచ్చాడే ఆః పెద్దమనిషిని అంటున్నా!" అన్నది సరళ.

"ఓహో అదా! ఆః పెద్ద మనిషి నిజంగానే ఫ్లయింగ్ కిస్ ఇచ్చాడంటావా? నాకైతే డౌటే!" అన్నది శ్రీలక్ష్మి.

"ఓహో అయితే నీవు కూడా ఖాన్ /గేస్ అన్న మాట!" అంటూ మూతి విరిచింది సరళ.

"డౌటు కూడా పడొద్దా! డౌటు పడితే కాంగ్రెస్‌లో ఉన్నట్లా" ఇదెక్కడి చోద్యం?" అంటూ నోరు నొక్కుకుంది శ్రీలక్ష్మి.

"నిండు సభలో ఫ్లయింగ్ కిస్ ఇచ్చేవారిని, దీన్ని సమర్థించిన వారిని పీకపిసికి చంపెయ్యాలి. రోడ్డు మీద పండబెట్టి రోలర్ నడిపించాలి. బుల్డోజర్‌తో ఏకీలుకు ఆ కీలు పీకించెయ్యాలి. శూలదండను విధించాలి! క్రిమి భోజనం కావించాలి... ఆవేశంగా చెప్పుకునిపోతోంది సరళ.

"ఆగాగు వదినా! గరుడ పురాణంలో లేని శిక్షలు విధించుతున్నావు!" అంటూ ఆపింది శ్రీలక్ష్మి.

"గరుడ పురాణమే కాదు, కాకి పురాణం, పిచ్చుక పురాణం అన్ని పురాణాల్లోని శిక్షలు విధించాల్సిందే!" ఢంకా బజాయించింది సరళ.

"కాకి పురాణం, పిచ్చుక పురాణాలు లేవనుకుంటా!" అనుమానంగా అన్నది శ్రీలక్ష్మి అనుమానంగా.

"లేకపోతేనేం! వాట్సప్‌లో వెదికితే అవే దొరుకుతాయి! దొరక్కపోతే కాకి పురాణం, పిచ్చుక పురాణాల్లో ఫ్లయింగ్ కిస్సులకి ఇవే శిక్షలంటూ వాట్సప్‌లో పేర్లు లేకుండా మనమే పోస్టు చేద్దాం!" అన్నది మరింత ఆవేశంగా సరళ.

"ఫ్లయింగ్ కిస్సులకే ఇన్ని శిక్షలుంటే, నిజంగా ముద్దు పెట్టుకుంటే ఇంకెన్ని శిక్షలు వేయాలో?" సాలోచనగా అన్నది శ్రీలక్ష్మి.

"ఆడపిల్లని ఇష్టం లేకుండా ముట్టుకుంటే చేతులు విరిచేయాలి. ముద్దు పెట్టుకుంటే పెదాలు, నాలుక కోసేయాలి..." సరళకి ఆవేశం తగ్గటం లేదు.

"ఈ శిక్షలు ఆ ఒక్కాయనకేనా అందరికీ వేయవచ్చా?" అనుమానంగా అడిగింది శ్రీలక్ష్మి.

"ఆడపిల్లలంటే ఎవరనుకున్నావు సాక్షాత్ భరతమాత స్వరూపం! అందుకే ఆ ఒక్కడికే కాదు, ఎవరికైనా అవే శిక్షలు విధించాలి. ద్రౌపదిని తొడల మీద కూర్చోమని సైగచేసినందుకే ధుర్యోధనుడి తొడలు తన గదాదండంతో భీముడు విరగొట్టాడు. అదే సరైన శాస్తి! అదే మన సంస్కృతి" ఆవేశపడుతూనే అన్నది సరళ.

"అవునవును! ఫ్లయింగ్ కిస్సులు, ముద్దుల తర్వాత మానభంగమే కదా! దానికెలాంటి శిక్ష విధించాలి!" అడిగింది శ్రీలక్ష్మి.

"మానభంగం చేసిన వారికి మరణదండనే సరైన శిక్ష" అన్నది సరళ.



"మరి మణిపూర్‌లో ఎంత మందికి మరణదండన విధించారు?" సూటిగా ప్రశ్నించింది శ్రీలక్ష్మి.

సరళకి ఒక్కసారిగా ఆవేశం తగ్గింది! ఏం మాట్లాడాలో తోచలేదు. ఎఫ్ఐఆర్ బుక్ చేశారు కదా!" అన్నది కాసేపటికి.

"ఇప్పటిదాకా ఉరిశిక్ష అంటివి, ఇప్పుడేమో ఎఫ్ఐఆర్‌తో సరిపెడుతున్నావు! ఇదెక్కడి న్యాయం వదినా? అడిగింది శ్రీలక్ష్మి.

"అంటేః ఆ తర్వాత కేసు పెడతారు కదా!" అన్నది సరళ.

"ఎఫ్ఐఆర్ బుక్ చేయటానికి 40రోజులు పట్టింది. అది కూడా ఒక అమ్మాయి నగ్నంగా ఊరేగించే వీడియో వైరల్ అయ్యిన తర్వాత ఎఫ్ఐఆర్ గురించి మాట్లాడుతున్నారు! మణిపూర్ మనదేశంలో లేదా? లేక ఆ అమ్మాయి చైనా అమ్మాయా? ఆ అమ్మాయి మీద సామూహిక అత్యాచారం చేసి, అడ్డం వచ్చిన తమ్ముడిని, తండ్రిని కిరాతకంగా హత్యచేసి వారిని నగ్నంగా ఊరేగించిన వాళ్ళకి ఇప్పటిదాకా ఎలాంటి శిక్షలు వేశారు?" ప్రశ్నించింది శ్రీలక్ష్మి.

నజర్

"చట్టం తన పని తాను చేసుకుని పోతుంది!" అన్నది సరళ గొంతు పెగల్చుకుని.

"మణిపూర్ ముఖ్యమంత్రి చెప్పిందే నీవు చెబుతున్నావు. ఇలాంటివి వందల కొద్దీ జరిగాయని ఆయన అన్నాడు. ఒక్కదాంట్లో కూడా శిక్ష విధించలేని దద్దమ్మకు ముఖ్యమంత్రి పదవి ఎందుకు?" తీవ్రంగా ప్రశ్నించింది శ్రీలక్ష్మి.

"మణిపూర్ మహిళల వెనక దేశమే ఉంది!" అన్నది సరళ తడారిపోయిన గొంతుతో.

"అవును! వారి వెనక దేశమే ఉంది! కాని మీరు లేరు, మీ పార్టీ లేదు! మీ డబుల్ ఇంజన్ సర్కారు లేదు! ఇందుకు మీరు సిగ్గుపడటం లేదు! పైగా ఫ్లయింగ్ కిస్సుల మీద రాద్ధాంతం చేస్తారు? మణిపూర్ ఒక్కరోజు, ఒక్క నిమిషం కూడా స్పందించని మహానుభావురాలు. ఈ దేశ సంస్కృతికి బ్రాండ్ అంబాసిడర్‌లా మాట్లాడే అర్హత ఉందా? సాటి మహిళల గురించి మాట్లాడని ఆ మనిషి ఆడమనిషేనా? కనీసం మనిషేనా?" ఆగ్రహంగా అన్నది శ్రీలక్ష్మి.

సరళ బిత్తర చూపులు చూస్తున్నది.

"చట్టం గురించి మాట్లాడటానికి మీకు నోరెలా వచ్చింది! అత్యాచారం చేసినట్లు రుజువై చట్టం జైలుశిక్ష విధించితే మీ సర్కార్ ఆ దోషులలో సత్ప్రవర్తనను వెదుక్కుని శిక్ష తగ్గించి విడుదల చేసింది. విడుదలైనా ఆ దుర్మార్గులను సన్మానించారు మీ పార్టీవారు! ఆ సన్మానానికి గంగవెర్రులెత్తి మరో అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడ్డాడు మీరు విడుదల చేసిన కీచకుడు. ఇదేనా మీ సంస్కృతి? ఇదేనా మీ సంప్రదాయం?" మరింత కోపంగా అన్నది శ్రీలక్ష్మి.

సరళకి నోరు పెగలటం లేదు!

"మీ డబుల్ ఇంజన్ సర్కారు స్పందించవచ్చు. ఈ అకృత్యాలను అడ్డుకోవచ్చు. కాని మీకు ఆ సోయ లేదు. ఎందుకంటే మీది కీచక సంస్కృతి, కౌరవ సంస్కృతి! రాబోయే కాలంలో నిజమైన భారతీయ సంస్కృతి అంటే ఏమిటో చూస్తారు!" అంటూ ముగించింది శ్రీలక్ష్మి.

- ఉషాకిరణ్

వెయిట్ అండ్ సీ...

రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయం మస్తు రంజుగుంది. 'రాజకీయమంటే ఏటనుకున్నవ్... కడుపులో కత్తులు పెట్టుకుని... ఏమీ తెలియదన్నట్టు కౌగిలించుకోవాల...' అని నటవిరాట్ రావుగోపాలరావు డైలాగ్ కొట్టినట్టు ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ లీడర్లు ఇప్పుడు కడుపుల తలకాయ పెట్టి మరీ రాజకీయాలు నడుపుతున్నారు. ఇప్పటిదాకా ఒక పార్టీని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన నాయకుడు... ఇప్పుడు అదే పార్టీలో టిక్కెట్ కోసం నానా పాట్లు పడుతున్నాడు. ఈరోజు వరకూ సొంత పార్టీలో ఉండి... అక్కడి అధినేతను ఆహా ఓహో అంటూ పొడిగి, తీరా టిక్కెట్ రాదని తెలిసే సరికి... అదే అధినేతకు వ్యతిరేకంగా రోడ్డెక్కి నిరసన గళాలు విప్పుతున్నారు మరికొందరు లీడర్లు. మరోవైపు సంప్రదింపులు, బుజ్జగింపులు, సమాలోచనలు, చర్చలు, మంతనాలు జోరందుకున్నాయి. వీటి కోసం హైదరాబాద్‌కు వచ్చే ఎమ్మెల్యేలు, ఆశావహులు, చోటా మోటా నేతలతో హైదరాబాద్‌లోని హోటళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నాయకుల సంప్రదింపుల క్రమంలో ఏడుపులు, పెడబొబ్బలు, అసహనాలు, కోపాలు, తాపాలు ఏక్కువై పోతున్నాయని అక్కడి నుంచి వచ్చిన నేతలు వాపోతున్నారు. టిక్కెట్ల జాబితాలు ప్రకటించకముందే, ఇంకా అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే సీను ఇలాగుంటే... అవి ఖరారయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో తలుచుకోవటానికే భయంగా ఉందంటూ అధికార పార్టీకి చెందిన ఓ నేత వాపోయారు. ఆయన అలా వాపోవటంలో ఎంతో అర్థముంది. ఎందుకంటే... ఇలాంటి సీన్లు మున్ముందు వెండితెరపై మస్తుగుంటయ్... వెయిట్ అండ్ సీ...

-బి.వి.యన్.పద్మరాజు

రిపోర్టర్స్ డైరీ

మద్యం లొల్లి... కిక్కే కిక్కు...

అర్జీ... ఆబ్కారీ... ఆదాయం... రాజకీయం! గిదేందనుకుంటున్నారా? గదే మద్యం దరఖాస్తుల సంఖ్య గురించే. కొత్త లిక్కర్ షాపులకు అక్షరాల లచ్చపైనే అప్లికేషన్లు వొచ్చాయి. కిక్కే... కిక్కే. కిక్కు మత్తెక్కిస్తుంది. గీ మత్తే మస్తు ఆదాయం తెచ్చిపెట్టింది. గీ ఆదాయంపై చేతి గుర్తు, కమలంపువ్వు గుర్తు పార్టీ లీడర్లు లొల్లి లొల్లి చేస్తుంద్రు. మూడునెలలకు ముందే దరఖాస్తులెందుకు స్వీకరిస్తున్నారని ఇమర్శలు చేస్తుండ్రు. ఇగ రేవంతన్న ఏకంగా అధికారంలోకి రావడం ఖాయమని, మేం మల్లా అర్జీలు తీసుకుంటామని ప్రకటించడంతో అర్జీ పెట్టుకున్నోళ్లకు భయం పట్టుకుందంట! గిప్పటికే ఒకాయన ఏకంగా దరఖాస్తులకే రూ.20 కోట్లు పెట్టిండు. మల్లా దరఖాస్తులంటే ఏం సేయాలో సమజైతలేదంట! మద్యం లాటరీపై గిట్ల ప్రచారం జరుగుతున్నది. ఇంకో దిక్కు పువ్వు గుర్తు బండెన్న లిక్కర్ షాపుల టెండర్లపై ఎకసెకలాడుతుండు. తెలంగాణలో ఊరురా... బెల్టు షాపులు బెంబేలెత్తిస్తున్నవి. వయసు పొరలు తాగి ఆగమైతుంద్రు. ఎన్నో సంసారాలు సట్టుబండలలై మాట్లాడని గీ చేయిగుర్తు, పువ్వు గుర్తు లీడరన్నలు టెండర్లపై మాట్లాడుదేందోనంటూ రచ్చబండలకాడా ఉచ్చరిస్తుంద్రు!

- నిరంజన్ కొప్పు

జగ్గన్న... మీది నాలుకనా లేక!

నరంలేని నాలుక ఏమైనా మాట్లాడుతుంది అనేది నానుడి. కారెక్కాలా... దిగాలా? అంటూ రహస్యంగా మీరే చర్చలు జరుపుతారు. కాపు కాసి ఏటేస్తానన్నట్టు చేయి విడిచి గులాబీ కండువా కప్పుకుందామా? అని మీరే మాట్లాడుకుంటారు. మీరే మీడియాకు లీకులిస్తారు. తీరా బేరం కుదరకపోయేసరికి మీడియాపై రుసరుసలాడుతారేందుకు? మీపై ఉన్న గౌరవాన్ని మీరే మంటగలుపుతున్నారు. జగ్గన్న నాలుకనా లేక ఇంకేమైనానా? పార్టీకి మీరే దూరంగా ఉంటారు. నన్ను పిలువలేదని ఆవేదన చెందుతారు. నన్ను దూరం పెడుతున్నారని బాధపడుతారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉన్న మీరు... అప్పగించిన బాధ్యతను నెరవేర్చారా? అంటూ మీ పార్టీ నాయకులే అడుగుతున్నారు. అవసరమున్నా... లేకపోయినా మీడియా ప్రతినిధులను హోటల్‌కు ఆహ్వానించి మీకు తోచింది మాట్లాడుతారు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుతా... అంటూనే లేనిది కూడా మీడియాకు చెబుతారు. వీటన్నింటికి సమాధానం చెప్పకుండా సోషల్ మీడియా, రెండు, మూడు పత్రికలంటూ చిర్రుబుర్రులాడుతున్నారు. తప్పుడు రాతలు రాస్తే బట్టలుడదీసి కొడతా అంటున్నారు. ఊసరవెల్లిలా ఊగిసలాడుతూ... ఎప్పుడేం మాట్లాడావో మీకే తెలియదు అంటూ మీ పార్టీ నేతలు అంటుంటారు. కానీ మీరు మాత్రం నిక్కచ్చికే నిలుటద్దం అన్నట్టు చెబుతారు. మీరు చెప్పింది రాస్తే మీడియా మంచిదికాదా? అని ప్రశ్నిస్తున్నారు.

- గుడిగ రఘు



ట్రైలర్ మాత్రమే చూసింద్రు.. ఇకపై సినిమా చూపిస్తాం

- ప్రతిపక్షాలపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు
  స్టీల్‌బ్రిడ్జిను ప్రారంభించిన మంత్రి
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఇందిరాపార్క్, ట్యాంక్‌బండ్ అభివృద్ధి


నవతెలంగాణ-సిటీబ్యూరో.. అంబర్‌పేట, అడిక్ మేట్

ఇప్పటిదాకా చూసింది ట్రైలర్ మాత్రమే.. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించి ప్రతిపక్ష పార్టీలకు సినిమా చూపిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో రూ.450 కోట్లతో ఇందిరాపార్క్ నుంచి వీఎస్టీ చౌరస్తా వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జి (నాయిని నరసింహారెడ్డి ఫ్లై ఓవర్)ని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పనిచేసే, పనికొచ్చే ముఖ్యమంత్రి కేసీఆర్ అని, హ్యాట్రిక్ విజయం సాధించేలా ఆశీర్వదించండని ప్రజలను కోరారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సినిమా చూడటం కాదు ప్రతిపక్షాల కోసం సినిమా చూపెట్టండి అని విజ్ఞప్తి చేశారు. 2023లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించి ప్రతిపక్షాలకు సినిమా చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలంటే కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి సాగాలని, అందుకోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నూతన సచివాలయం, అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, స్టీల్ బ్రిడ్జి వంటి అనేక కార్యక్రమాలతో సెంట్రల్ హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇలాంటి సందర్భంలో మతాల మధ్య చిచ్చుపెట్టే వాళ్లు, చిల్లర పార్టీల వారి మోసాలకు గురైతే మరో వందేండ్లు ఈ నగరం వెనక్కి పోతుందన్నారు. ఈ ప్రాంతంతో ఆత్మీయ సంబంధాలు ఉన్న దివంగత నాయిని నర్సింహారెడ్డి అనుబంధాన్ని, ఆయన ఇక్కడి ప్రజలకు, కార్మికులకు చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జిగా నామకరణం చేశామని చెప్పారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.తెలంగాణ వచ్చాక సిగ్నల్ ఫ్రీ హైదరాబాద్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ కార్యక్రమం ప్రారంభించి రోడ్డు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఇప్పటిదాకా 36 పనులను పూర్తి చేశామని తెలిపారు. పది సంవత్సరాల్లో రాష్ట్రం మత కల్లోలాలు, గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నదన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇందిరాపార్కును అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యత తమదని, లోయర్ ట్యాంక్ బండ్, అప్పర్ ట్యాంక్ బండ్‌ను టూరిస్ట్ ప్రాంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్, బేతి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంఎంఎన్ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, నాయిని నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

లద్దాక్‌లో ఘోర ప్రమాదం..

- లోయలో పడ్డ ఆర్మీ వ్యాన్..తొమ్మిది సైనికుల మృతి



లద్దాక్ : లద్దాక్ లేహ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఆర్మీ సైనికులు వెళ్తున్న వాహనం ప్రమాదవశాత్తు లోయలోకి దూసు కెళ్లింది. ఈ ఘటనలో తొమ్మిది మంది సైనికులు చనిపోయారని ఆర్మీ అధికారులు తెలిపారు. అయితే, దక్షిణ లద్దాక్‌లోని నియోమాలోని ఖేరి వద్ద శనివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో ఎనిమిది మంది సైనికులతో పాటు ఓ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ ఉన్నారు. ట్రక్కు కరూ నుంచి గ్యారీసన్ నుంచి లేహ్ సమీపంలోకి క్యారీకి వెళ్తున్న సమయంలో లోయలో పడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 34 మంది వరకు సిబ్బంది ఉన్నట్టు తెలుస్తున్నది. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నా..కేంద్రరక్షణ శాఖ వారిని హెలికాప్టర్ల తరలించటంలేదని ఆర్మీ అధికారులు చెబుతున్నారు.ఇలా తరలించకపోవటం వల్లే ఆర్మీ వాహనాలు లోయల్లో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారత నాస్తిక సమాజం నుంచి బైరి నరేష్ బహిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత నాస్తిక సమాజం నుంచి జాతీయ కమిటీ సభ్యులు బైరి నరేష్‌ను బహిష్కరిస్తున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక చైర్‌పర్సన్ జయగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బైరి నరేష్ నాస్తిక సమాజం నిబంధనావళి, సిద్ధాంతం, మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నందున ఈ క్రమశిక్షణా చర్య తీసుకుంటున్నామన్నారు. భారత నాస్తి క సమాజం, దాని అనుబంధ సంఘాలతో ఇకపై బైరి నరేష్‌కు ఎలాంటి సం బంధాలు ఉండవనీ, ఎవరూ ఎలాంటి ఆర్థిక సహాయం చేయరాదని కోరారు.

అసమ్మతిని అణిచేస్తున్నారు : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : జీ-20కి సంబంధించిన ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించేందుకు ఇక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సెమినార్ కమ్ వర్క్‌షాప్‌ను ఆపేందుకు ఢిల్లీ పోలీసులు యత్నించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. అసమ్మతి గళాలను నొక్కేసే ఇలాంటి యత్నాలు ఎంత మాత్రమూ సమర్థనీయం కాదు, అవాంఛనీయం కూడా అని పొలిట్‌బ్యూరో శనివారం నాడిక్కడ విడుదలజేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సీపీఐ(ఎం)కు చెందిన సూర్జిత్ భవనంలో సెమినార్లతోపాటు వివిధ కార్యకలాపాలను పార్టీ నిర్వహిస్తూ వుంటుంది. త్వరలో జరగబోయే జీ-20 సదస్సులో లేవనెత్తాల్సిన అంశాలపై 'వి 20' పేరిట వివిధ పౌర సమాజ సంస్థలు సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. దానికి పోలీసు అనుమతి లేదనే కారణంతో ఆ సమావేశాన్ని ఆపాలని పోలీసులు భావించారు. ప్రైవేటు భవనాల్లో ఇటువంటి సమావేశాలు లేదా సెమినార్లు జరుపుకోవడానికి ఏ పోలీసు అనుమతి అవసరం లేదని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఢిల్లీ పోలీసుల నిరంకుశ చర్యను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది.





ఒకే బీ-ఫామ్.. ఒక్కరే అభ్యర్థి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో సిట్టింగుల సీటుకు ఎసరొస్తుందనే కారణంతో నిరసనలకు దిగిన అసంతృప్తులకు మంత్రి కేటీఆర్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సీట్ల సిగపట్లతోపాటు వాటి కోసం పైరవీలు చేయొద్దంటూ నేతలకు హితవు పలికారు. అందుకు భిన్నంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. 'ఏ నియోజకవర్గానికైనా ఒకటే బీ-ఫామ్, ఒక్కరే అభ్యర్థి ఉంటారు. అతడి గెలుపుకోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలి...' అంటూ ఆయన ఆదేశించారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నేతృత్వంలో ఆ నియోజవర్గానికి చెందిన వుప్పల వెంకటేశ్ తదితరులు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ భవన్‌లో వారికి గులాబీ కండువా కప్పిన కేటీఆర్... ఆ సందర్భంగా అసంతృప్తులకు చురకలంటించారు. కాంగ్రెస్, బీజేపీలపై విరుచుకుపడ్డారు. వెంకటేశ్‌కు భవిష్యత్తులో పెద్ద పదవినిస్తామని చెప్పారు. మరోవైపు సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసే అవకాశమున్న నేపథ్యంలో ఇప్పటికే రగులుతున్న అసంతృప్తులు, అలకలకు దూరంగా ఉండాలని కేటీఆర్ నిర్ణయించుకున్నారు. టికెట్ దక్కని నేతలు, చివరి ప్రయత్నంగా హైదరాబాద్‌కు వచ్చి తనను కలిసి మొరపెట్టుకునే అవకాశమున్న క్రమంలో ఒకరిని ఎక్కువ చేసి, ఒకరిని తక్కువ చేస్తే లేని పోని తలనొప్పులు ఎదురయ్యే అవకాశముందని ఆయన భావించినట్టు సమాచారం. అందుకే ఆయన వారం రోజులపాటు అమెరికాలో ఉండేందుకు వీలుగా శనివారం సాయంత్రమే విమానమెక్కారు. ఈలోగా పరిస్థితి చక్కబడుతుంది కాబట్టి, అప్పుడు వచ్చినా ఇబ్బంది ఉండబోదనే అంచనాతో ఆయన ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

కాగా 'మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటన కోసం శనివారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. సుమారు వారం రోజులపాటు కొనసాగే ఈ పర్యటనలో పలు పెట్టుబడి సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను, బ్యాక్‌గ్రౌండ్ వర్క్‌ను ఇప్పటికే పరిశ్రమలు, ఐటీ శాఖ అధికారులు ఖరారు చేశారు. ఇందులో భాగంగా న్యూయార్క్, చికాగో వంటి పలు నగరాల్లో మంత్రి కేటీఆర్ వివిధ రంగాలకు సంబంధించిన కంపెనీలతో సమావేశం అవుతారు. ఆయనతోపాటు ఐటీ, పరిశ్రమల శాఖకు సంబంధించిన పలు విభాగాల డైరెక్టర్లు కూడా ఈ పర్యటనలో భాగస్వాములు కానున్నారు. ఒకవైపు తన పర్యటన తొలి అంకంలో విస్తతంగా పెట్టుబడి సమావేశాలకు హాజరు కావడంతోపాటు పర్యటన చివరి అంకంలో తన కుమారుడు హిమాన్షు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ప్రవేశానికి సంబంధించిన కార్యక్రమానికి కూడా మంత్రి హాజరవుతారు. ఇప్పటికే హిమాన్షుకు అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీలో ప్రవేశం ఖరారు అయింది. ఇందుకు సంబంధించిన కోర్సు జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ కుటుంబం హాజరు కానున్నది...' అని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆ రెండు పార్టీలకు అధికారమిస్తే గులాంగిరే...

మరోవైపు కల్వకుర్తి నేతల చేరికల సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు అయింది. ఇన్నేండ్లలో గత ప్రభుత్వాలు ఇంటింటికి నీళ్లు, రైతు బంధు ఎందుకు ఇవ్వలేదు..?' అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికలొస్తున్నాయి కాబట్టి... ప్రతిపక్ష నేతలు నోటికొచ్చిన హామీలను గుప్పిస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకూ ఆయా పార్టీలు రూ.4 వేల పింఛన్‌ను, 24 గంటల కరెంటును ఎందుకివ్వలేకపోయాయని ఎద్దేవా చేశారు.

ఒకాయనేమో ఒక్క ఛాన్స్ ఇవ్వడంటూ అడుక్కుంటున్నాడు.. ఇంకో బీజేపీ నాయకుడేమో తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ పథకాలను కూడా అమలు చేస్తామని చెబుతున్నాడు...కేసీఆర్ పథకాలను అమలు చేయటానికైతే మీరెందుకు అధికారంలోకి రావాలంటూ విమర్శించారు. సంపదను పెంచాలి, పేదలకు పంచాలనేది తమ పార్టీ విధానమని తెలిపారు. అందుకు భిన్నంగా సంపద పెంచుకుని.. వెనకేసుకోవాలనేది విపక్షాల తీరని విమర్శించారు. 'గతంలో సంచులు మోసిన వాడు కూడా ఇప్పుడు నీతులు చెబుతున్నాడు...' అంటూ పీసీసీ చీఫ్ రేవంత్‌ను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్ష పీఠం అనేది ఒక పదవా..? అదేదో ప్రధానమంత్రి పదవైనట్టు ఆయన బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే అందరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామంటూ నమ్మబలికిన ప్రధాని మోడీ ఆ హామీని తుంగలో తొక్కారని కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టటమే బీజేపీ విధానమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీకి చెందిన ఓ ఎంపీ గతంలో కేసీఆర్‌ను జైలుకు పంపుతామంటూ కేకలేసి... ఇప్పుడు తానే షెడ్డు లోకి పోయారని బండి సంజయ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌గానీ, బీజేపీగానీ గెలిస్తే ఢిల్లీకి గులాంగిరీ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించి అక్కున చేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను తెలంగాణ ఆత్మగౌరవానికి, ఢిల్లీ గులాంగిరీకి మధ్య జరగబోయే ఎన్నికలుగా ఆయన అభివర్ణించారు.

హరికిషన్‌సింగ్ సూర్జీత్ భవన్‌పై ఖాకీల దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)

వివరణలు ఇచ్చారు. రెండోరోజు సెషన్ శనివారం ఉదయం 10.30 గంటలకు ఇక్కడే ప్రారంభమైంది. 11 గంటల సమయంలో భారీ సంఖ్యలో పోలీసులు, భద్రతా బలగాలు హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌ను చుట్టుముట్టారు. ప్రధాన గేటుకు తాళం వేశారు. సదస్సు రద్దయ్యిందని బోర్డు పెట్టారు. భవనం చుట్టూ రహదారుల్ని దిగ్బంధించి, బారికేడ్లు పెట్టారు. సమ్మిట్ నిర్వహణకు ఎలాంటి అనుమతి లేదంటూ హంగామా సృష్టించారు. అంద రూ అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. లేకుంటే ప్రాంగణానికి సీల్ వేస్తామని బెదిరించారు. పోలీసుల ఈ చర్యపై సదస్సుకు హాజరైన సభికులు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. తాము అక్కడి నుంచి కదిలేది లేదని తేల్చిచెప్పారు. సదస్సు నాలుగు గోడల మధ్య జరుగుతుంటే అనుమతి ఎందుకంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదే భవనంలో గతంలోనూ వందల సదస్సులు జరిగాయనీ, అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని పోలీసుల్ని నిలదీశారు. ఈ చర్యపై రాజకీయపార్టీలు భగ్గుమన్నాయి. ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మేధావులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు దేనికి భయపడుతున్నదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇది కచ్చితంగా 'అప్రకటిత ఎమర్జెన్సీ'నే అని నినదించారు. ఈ సందర్భంగా పోలీసులకు నిర్వా హకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. సదస్సు నిర్వ హణను నిలిపేయాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నా యంటూ ఓ ఢిల్లీ పోలీస్ అధికారి చెప్పారు. ఆ కాపీని చూపించాలని నిర్వహకులు కోరారు. దానికి పోలీసులు నిరాకరించారు. సూర్జీత్ భవన్‌లో అనేక కార్యక్రమాలు జరిగాయనీ, ఒక ఈవెంట్‌ను 'సీల్ ఆఫ్' చేయడం ఇదే మొదటిసారి అని నిర్వహకులు తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన తొలిరోజు సమ్మిట్ ఆడిటోరియంలో ప్రశాంతంగా జరిగిందనీ, కొన్ని వందల మంది హాజరయ్యారని, ఎలాంటి అంతరాయం కలగలేదని స్పష్టం చేశారు. అలాంట ప్పుడు రెండో రోజు సదస్సును ఎందుకు అడ్డుకుంటు న్నారని ప్రశ్నించారు. పోలీసులు భవన్‌పై దాడి చేసే సమయంలో అంతకుముందే సదస్సులో పాల్గొనేందుకు ప్రముఖ న్యాయవాది వందన శివ, మేధా పాట్కర్, నందినీ సుందర్, కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్, జేడీయూ ఎంపీ అనిల్ హెగ్డే, అంజలి భరద్వాజ్, నిఖిల్ డే, థామస్ ఫ్రాంకో, శక్తిమాన్ ఘోష్ తదితరులు లోపలే ఉన్నారు. "వాళ్ళందర్నీ బయటకు వెళ్లమని పోలీసులు హెచ్చరించారు. సమ్మిట్ ఇండోర్ హాల్‌లో జరుగుతుంది. దీనికి అనుమతి అవసరం లేదు' అని ఈవెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రచయిత కవితా కబీర్ చెప్పారు.

అసాధారణం : జైరాం రమేష్

'సీపీఐ(ఎం)కు చెందిన హరికిషన్‌సింగ్ సుర్జీత్ భవనంలో ఏర్పాటుచేసిన వి20 సమావేశానికి హాజరుకాకుండా ప్రజలను ఢిల్లీ పోలీసులు ఆపడం అసాధారణం. సమావేశం సంపూర్ణ శాంతియుతంగా జరిగింది. వీధి నిరసనలు, ఆందోళనలు వంటివి లేనేలేవు. అలాంటప్పుడు సదస్సును ఎలా అడ్డుకుం టారు. మోడీ హయాంలో ప్రజాస్వామ్యం ఎలా ఉందో ఈ సంఘటన స్పష్టం చేస్తుంది' అని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ అన్నారు. ఇదేం ప్రజాస్వామ్యం అంటూ హర్ష్ మందర్ విమర్శించారు. 'వ్యవస్థ దేనికి భయపడుతోంది? వారు ఇండోర్ హాల్‌లో ప్రజా స్వామ్యయుతంగా సమావేశాలు నిర్వహించు కుంటుంటే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటి?' అని మేధా పాట్కర్ ప్రశ్నించారు.

ఇదీ నేపథ్యం..

సెప్టెంబరు మొదట్లో న్యూఢిల్లీలో జరగనున్న 18వ జీ20 లీడర్స్ సమ్మిట్‌కు ముందు ప్రజల సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించాలనే ఉద్దేశ్యంతో 70కి పైగా కార్మిక, ప్రజా, పౌర సంఘాలు 'జీ20లో వీ20- పీపుల్స్ సమ్మిట్'ను నిర్వ హించాయి. వ్యవసాయం, వాతావరణ సంక్షోభం, ఇంధన పరివర్తన, అంతర్జాతీయ వాణిజ్యం, బ్యాం కింగ్, కార్మికులు, సామాజిక న్యాయం, కుంచించు కుపోతున్న ప్రజాస్వామ్య ప్రదేశాలు, పెరుగుతున్న అసమానతలు, సమాచార హక్కు, డేటా, డిజిటల్ నిఘా, పట్టణ జీవితం, ప్రభుత్వ సేవల ప్రయివేటీ కరణ, సంస్కృతి వంటి కీలక అంశాలపై తొమ్మిది వర్క్‌షాప్‌లు జరగను న్నాయి. ఈ సమ్మిట్‌లో దేశవ్యాప్తంగా 500 మందికి పైగా ఆర్థికవేత్తలు, కార్యకర్తలు, పాత్రికేయులు, రాజకీయ నాయకులు పాల్గొంటున్నారు. పై అంశాలపై ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఈ సమ్మిట్‌లో చర్చిస్తున్నారు.

ఇంత దుర్మార్గమా? ఎందుకంత భయం?

'దేశంలోని పరిస్థితుల్ని ఈ చర్య ప్రస్ఫుటి స్తోంది. ఇంత దుర్మార్గంగా వ్యవహరించా ల్సిన అవసరం ఏముంది? కేవలం కొందరు వ్యక్తులు గుమికూడితేనే ప్రధాని మోడీ ఎందుకు భయ పడుతున్నారు' అని సమ్మిట్‌ను నిర్వహి స్తున్న రాజకీయ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రశ్నిం చారు. ఈ దుశ్చర్య తర్వాత వారు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సదస్సును భగ్నం చేయమని మోడీ ప్రభుత్వం పోలీసులకు ఎందుకు ఆదేశాలు ఇచ్చిందని అడిగారు. దేశంలో ప్రాథమిక మాన వ హక్కులు, పర్యా వరణం, జీవవైవిధ్యం, గోప్యత సహా అన్ని రక్షణ చట్టాలకు అర్థం లేకుండా పోయిందని పేర్కొ న్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్ని ంచే సాహసం చేస్తే కఠిన మైన చట్టాల కింద కల్పిత కేసులు పెట్టి, క్రిమి నల్ విచారణల్లో ఇరికిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

హాజరైంది వీరే...

జీ-20 దేశాల ప్రజావ్యతిరేక విధానాలను ఎత్తిచూపేందుకు ఆగస్టు 18 (శుక్రవారం) ప్రారంభమైన మూడు రోజుల శిఖరాగ్ర సదస్సు ప్రారంభ రోజున తీస్తా సెతల్వాడ్, మేధా పాట్కర్, ప్రొఫెసర్ జయతీ ఘోష్, మనోజ్ ఝా, హర్ష్ మందర్, ప్రొఫెసర్ అరుణ్ కుమార్, బృందాకరత్, హన్నన్ మొల్లా, రాజీవ్ గౌడ తదితరులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నగరాల సుందరీకరణ అంశంపై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ మాట్లాడారు. జీ20 సదస్సు నిర్వహణ పేరుతో కేంద్ర ప్రభుత్వం పేదల్ని, పేదల ఇండ్లనూ బుల్డోజర్లతో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నదని తెలిపారు. ఈ సమ్మిట్‌కు పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, రాజస్థాన్ సహా దేశంలోని పలు ప్రాంతాల నుండి వందలాది మంది హాజరుకావడం గమనార్హం.

లిక్కర్ దరఖాస్తులు 1,31,490

- ఖజానాకు రూ.2,629.80 కోట్ల ఆదాయం
- అధికారికంగా వెల్లడించిన ఆబ్కారీ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆశావహులు ఈ ఏడాది పోటీపడ్డారు. దరఖాస్తుల చివరి రోజైన శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయాలు కిటకిటలాడాయి. 2,620 దుకాణాలకుగాను 1,31,490 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం చివరి రోజు కావడంతో 56,980 దరఖాస్తులు, గురువారం 30,469 దరఖాస్తులతో కలిపి రెండురోజుల్లోనే 87వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయంటే పోటి ఏ స్థాయిలో ఉందో చెప్పనక్కర్లేదు.

1,31,490 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.2,629.80కోట్ల ఆదాయం వచ్చింది.దరఖాస్తుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరడంతో దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు 1,31,490 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. ఒక్కో మద్యం దుకాణానికి దాదాపు 50 మంది వరకు పోటీపడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సరూర్‌నగర్ లో 10,908 దరఖాస్తులు, శంషాబాద్‌లో 10,811 దరఖాస్తులు వచ్చాయి. ఇక అత్యల్పంగా కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 967, ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 979 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 21న లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించనున్నారు.



ఓట్ ఫర్ ష్యూర్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్, అధికారులు, విద్యార్థులు

ఉపకారవేతనాల కోసం 19 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాజా ఉపకారవేతనాలతో పాటు రెన్యూవల్ కోసం ఈ నెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించినట్టు తెలిపారు.

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, శారీరక వికలాంగులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపకారవేతనాల కోసం కాలేజీలు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

స్తంభించిన ఖాతాలకు రుణమాఫీ

ఆందోళన వద్దు : రైతులకు మంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్తంభించిన రైతుల బ్యాంకు ఖాతాలకు కూడా రుణమాఫీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. రైతులు ఆందోళన చెందవద్దని ఈమేరకు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2018 డిసెంబర్ 11 నాటికి ప్రతి కుటుంబానికి రూ.లక్ష వరకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం 16,65,656 మంది రైతుల ఖాతాలకు రూ.8089.74 కోట్లను విడుదల చేసిందని తెలిపారు. బ్యాంకుల విలీన ప్రక్రియ మూలంగా ఈ విషయంలో రైతుల ఖాతాల వివరాలు మారడం లేదని తెలిపారు.



బైక్‌పై రాహుల్ రయ్..రయ్

- లద్దాక్‌లో తన తండ్రిని గుర్తు చేసుకున్న తనయుడు

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీకి బైక్ రైడ్ అంటే ఎంత ఇష్టమో.. తరచుగా వింటూనే ఉంటాం. ఇటీవల ఢిల్లీలోని బైక్ మెకానిక్ దుకాణంలో కనిపించారు. కొన్నిసార్లు అతను రోడ్లపై బైక్ నడుపుతుంటారు. అయితే ఈసారి లడఖ్‌లోని పాంగోంగ్ సరస్సు వైపు బైక్ రైడ్ చేశారు.

ఆగస్టు 20 రాహుల్ తండ్రి , దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కావటంతో.. రాహుల్ గాంధీ పాంగోంగ్ సరస్సుకు వెళ్లి తన తండ్రికి నివాళు లర్పించడానికి వెళ్లారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో తన బైక్ రైడ్ చిత్రాలను పంచుకుంటూ, రాహుల్ గాంధీ తన తండ్రిని గుర్తుచేసుకుంటూ, తన క్యాప్షన్‌లో ఇలా రాశారు. "పాంగాంగ్ సరస్సుకు వెళ్లే మార్గం... ప్రపంచంలోని అత్యంత అందమైన ప్రదేశాలలో ఒకటిగా మా నాన్న చెప్పేవారు." అని పేర్కొన్నారు.

హెల్మెట్, గ్లౌజులు, రైడింగ్ బూట్లు , జాకెట్ ధరించి, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ మొదట ఫుల్ బైకర్ స్టైల్‌లో కనిపించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా భారత్ జోడో యాత్రలో మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో బైక్‌పై ప్రయాణించిన విషయం విదితమే.

నవంబర్ 10న ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 1,931 ఎంపీహెచ్ఏ (ఫిమేల్) పోస్టుల భర్తీ కోసం నవంబర్ 10న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు వైద్యారోగ్య సేవల నియామక మండలి శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పోస్టుల్లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో 1,666 పోస్టులుండగా, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 265 పోస్టులున్నాయి.

ఎల్‌బీనగర్ ఎస్ఐపై బదిలీ వేటు

- గిరిజన మహిళపై పోలీసుల దాడి ఘటనలో..

నవతెలంగాణ-హాయత్ నగర్

హైదరాబాద్ ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐపై బదిలీ వేటు పడింది. మీర్‌పేటలో నివాసం ఉంటున్న ఓ గిరిజన మహిళను ఈనెల 15న అర్ధరాత్రి పోలీస్ స్టేషన్ లాకప్‌లో వేసి తీవ్రంగా కొట్టిన ఘటనకు సంబంధించిన హెడ్ కానిస్టేబుల్ శివ శంకర్, మహిళా కానిస్టేబుల్ సుమలతను ఇంతకు ముందే రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. శనివారం ఎస్ఐ రవికుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేసినట్టు సీపీ వెల్లడించారు.

అంగన్వాడీల సమ్మె వాయిదా




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి, కొన్ని నిర్దిష్ట హామీలు ఇచ్చినందన, నిరవధిక సమ్మె ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రకటించింది. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిరంతరం పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ఆగస్టు 5న హైదరాబాదులో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ఇతర సంఘాలను కూడా కలుపుకొని నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు ఆగస్టు 12న జాయింట్ మీటింగ్ జరిగిందని వివరించారు. ఆగస్టు 18న ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ అన్ని అంగన్వాడీ సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టడం సీఐటీయూ పోరాటాల ఒత్తిడి చేసిన ఫలితమేనని అన్నారు. ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యలపై నిర్దిష్ట హామీలు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందనీ, భవిష్యత్తులో వాటి అమలు కోసం మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడుతూ సెక్రటేరియట్‌లో ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్‌తో జరిగిన సమావేశ వివరాలను తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగులకు గతం కంటే ఎక్కువ పీఆర్సీ పెంచుతామనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షలు, ఆయాలకు ఒక లక్ష, ఆసరా పెన్షన్ వర్తింప చేస్తామనీ, రెండు లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని, మినీ సెంటర్స్ అన్నింటినీ ఎలాంటి షరతులు లేకుండా మెయిన్ సెంటర్స్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామనీ, ఆన్‌లైన్‌లో ఒకటే యాప్ ఉంచి, మిగిలినవి రద్దు చేస్తామని, అంగన్వాడీ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా సర్క్యులర్ జారీ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రతి నెల 14న వేతనాలు చెల్లించే విధంగా నిర్ణయం చేశామని, మట్టి ఖర్చులు రూ.20 వేలు వచ్చేలా కృషి చేస్తామని, గ్రోత్ మానిటరింగ్ మెటీరియల్స్ నాలుగు సప్లయ్ చేస్తామన్నారని తెలిపారు. మిగిలిన డిమాండ్స్‌లో... మే నెలలో ఒక నెల అంతా ఎండాకాలం సెలవులు, టిఏ, డిఏ లు ఇతర సమస్యలు పరిశీలిస్తామని మంత్రి చెప్పారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యలపై నిర్దిష్టమైన హామీలు ఇచ్చినందున అంగన్వాడీ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేయాలనుకున్న నిరవధిక సమ్మె ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. సమావేశంలో అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కోశాధికారి పీ మంగ, ఉపాధ్యక్షులు వెంకటమ్మ ఈమెలమ్మ, జ్యోతి, సహాయ కార్యదర్శులు జీ పద్మ, నర్సమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'వృత్తిదారుల' పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వృత్తిదారులకు ఆర్థిక సహాయం పథకాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ వత్తిదారుల భవనంలో రాష్ట్రస్థాయి వృత్తి సంఘాల బాధ్యుల సమావేశం లెల్లేల బాలకష్ణ అధ్యక్షతన జరిగింది. దీనికి చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులవృత్తులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.1లక్ష ఆర్థిక సహాయం పథకానికి ఆన్‌లైన్ ద్వారా 5 లక్షల 10 వేల మంది దరఖాస్తు చేశారని తెలిపారు. దరఖాస్తుల గడువు పూర్తయి రెండు నెలలు అవుతున్నా, ఆర్థిక సహకారానికి ప్రభుత్వం తగిన బడ్జెట్ నిధులు కేటాయించకపోవడంతో కాలయాపన జరుగుతుందని చెప్పారు. అనేక నియోజకవర్గాల్లో వెరిఫికేషన్ కూడా చేయడం లేదనీ, అది పూర్తయిన చోట వృత్తిదారులకు కాకుండా అధికార పార్టీ కార్యకర్తల్లో కొందరికే రూ. లక్ష ఆర్థిక సహకారం అందించి చేతులు దులుపుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయ న్నారు. చేతి వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ గణాంకాలను చేపట్టి విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచి వెనుకబడిన తరగతులకు ఉన్నత విద్య అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వృత్తి సంఘాల నాయకులు పైళ్ళ ఆశయ్య, ఉడత రవీందర్, బడుగు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శారద నగర్‌లో కార్పొరేటర్ కళ్లెం పర్యటన



నవతెలంగాణ -వనస్థలిపురం
హయత్ నగర్ డివిజన్‌లోని శారదా నగర్‌లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారులతో సమీక్షించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో డీఈ దామోదర్ రావు, ఏఈ నరేంద్ర తేజ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నరసింహారావు, యాదగిరి కాలనీ వాసులు పాల్గొన్నారు.

బిళ్లకంటి రవీందర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ - హయత్ నగర్
హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న బిళ్ళకంటి రవీందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీని పొందినట్టు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళల సాంఘిక, ఆర్థిక సాధికారత - నల్లగొండ జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం- ఒక పరిశీలన' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం అర్థ శాస్త్ర విభాగం పూర్వ అధ్యక్షుడు, రిటైర్డ్ అధ్యాపకులు ప్రొఫెసర్ వైపి నకులారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్న ప్రభ, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ బిళ్ళకంటి రవీందర్‌ను అభినందించారు.

'బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో మహిళలకు రక్షణ లేదు'



నవతెలంగాణ- బడంగ్ పేట్
బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనలో మహిళలకు రక్షణ కరువైందని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. ఈ నెల 15న పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిని.. కర్మన్ ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళ లక్ష్మిని శనివారం మాజీ రాజ్యసభ సభ్యులు వి. హన్మంత రావుతో కలిసి అమరేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నేటికీ మహిళలపై జరుగుతున్న దాడులు ప్రభుత్వాల వైఫల్యాలే నిదర్శనమని మండి పడ్డారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఏసీపీ వెంకన్న, సీఐ రవిలకు ఘన సన్మానం





నవతెలంగాణ- సంతోష్ నగర్
సైదాబాద్ ఏసీపీ డి.వెంకన్న నాయక్, సీఐ రవిలు నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శనివారం యాకుత్ పురా నియోజకవర్గం ఇంచార్జి సామ సుందర్ రెడ్డి..స్థానిక నాయకులతో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఏసీపీ వెంకన్న, సీఐ రవిలకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆమెనా మక్బూల్‌కు డాక్టరేట్

- ప్రముఖ ఉర్దూ జర్నలిస్టు ఫాజిల్ హుసేన్ పర్వేజ్ పాత్రికేయ సేవలపై పరిశోధన





నవతెలంగాణ - ధూల్ పేట్
గవా ఉర్దూ వీక్లీ ఎడిటర్ డాక్టర్ ఫాజిల్ హుసేన్ పర్వేజ్ 'పాత్రికేయ సేవల'పై పరిశోధించి ఆమెనా మక్బూల్ పీహెచ్ డీ సాధించారు. ఆమె చేసిన పరిశోధనపై తెలంగాణ యూనివర్శిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉర్దూ విభాగాధిపతిగా గతంలో పనిచేసిన ప్రొఫెసర్ అతహర్ సుల్తానా పర్యవేక్షణలో ఆమె ఈ పరిశోధన పూర్తి చేశారు. 2023, ఆగస్టు 11న తెలంగాణ యూనివర్శిటీలో జరిగిన సమావేశంలో పీహెచ్ డీ ప్రదానోత్సవం జరిగింది. ఈ సమావేశంలో ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్.ఎ.షకూర్ అడిగిన ప్రశ్నలకు ఆమె తడుముకోకుండా సమాధానమిచ్చారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ కనకయ్య ఈ సందర్భంగా పీహెచ్ డీ పట్టాసాధించిన ఆమెనాను అభినందించారు. తెలంగాణ యూనివర్శిటీ ప్రోగ్రామ్ కో చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖవీ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. డాక్టర్ మూసా ఖురైషీ, డాక్టర్ గుల్ రాణా, ఇతర రీసెర్చ్ స్టూడెంట్స్ ఆమెనాకు శుభాకాంక్షలు తెలిపారు. గత 43ఏళ్లుగా డాక్టర్ సయ్యద్ ఫాజిల్ హుసైన్ ఉర్దూ పత్రికా రంగంలో సేవలందిస్తున్నారు. ఆయన ఉర్దూ మీడియాపై రాసిన ఉర్దూ పుస్తకాలు రెండు యూనివర్శిటీల్లో ఎం.ఎం. విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధిస్తు న్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపున ఎక్స్ లెన్సీ అవార్డు సాధించిన మొట్టమొదటి ఉర్దూ జర్నలిస్టుగా నిలిచారు. కింగ్ సల్మాన్ ఆహ్వానం మేరకు 2023లో ఆయన హజ్ యాత్ర చేసిన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు.

అతి దారుణంగా మేనత్తను చంపిన అల్లుడు





నవతెలంగాణ-వనస్థలిపురం
చెడు అలవాట్లకు బానిసైన ఓ వ్యక్తి తన సొంత మేనత్తను అతి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూలు జిల్లా, తాండూరు మండలం, గ్రామానికి చెందిన ఆంజనేయులు. వృత్తిరీత్యా వంటలు చేస్తూ ఉంటాడు. గతంలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పాత నేరస్థుడు. అప్పుడప్పుడు బాలాపూర్ మండలం ఇండో అమెరికన్ స్కూల్ చందానగర్ కాలనీకి చెందిన తన మేనత్త భోజమ్మ(58) దగ్గరికి వస్తూ పోతూ ఉండేవాడు. చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురుద్దేశంతో సొంత మేనత్త ఒంటి పై ఉన్న 60 తులాల వెండి కాళ్ళ కడ్డీలు, ఎనిమిది తులాల బంగారు పుస్తెల తాడుపై కన్ను వేశాడు. పథకం ప్రకారం మేనత్త ఇంటికి వచ్చి సుత్తితో మూడుసార్లు తలపై కొట్టి అతి దారుణంగా హత్య చేశాడు. ఎలాగైనా తప్పించుకోవాలనే ఉద్దేశంతో మృతదేహానికి నిప్పంటించాడు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 20 శాతం తగలబడిన మృతదేహం వాచ్‌మెన్ లక్ష్మయ్య భార్యదని గుర్తించారు.ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కి తరలించారు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటనా స్థలంలో దొరికిన ఆధారాల ప్రకారం, స్థానికుల సమాచారం మేరకు సందేహంతో తాండూర్‌లో ఉన్న ఆంజనేయులను అరెస్టు చేసి విచారించగా...అసలు విషయం బయటపడింది. నిందితుడి వద్ద నుంచి 60 తులాల వెండి, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన మీర్‌పేట పోలీస్ స్టేషన్ సీఐ కిరణ్ కుమార్, డిటెక్టివ్ సీఐ గౌరీ నాయుడు లను ఏసీపీ అభినందించారు.

ఎన్ని విమర్శలు చేసినా అభివృద్ధిలో రాజీ పడేదిలేదు

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి
- రూ.12కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ - హయత్ నగర్
ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడేది లేదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మొత్తం రూ.12కోట్లతో వ్యయంతో వాటర్ డ్రైన్ నిర్మాణం, సీసీ రోడ్లు, ఫస్ట్ ఫ్లోర్ కమ్యూనిటీ హాల్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఇలా పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నా మని అన్నారు. ముందుగా తాగునీరు, డ్రయినేజీ, రోడ్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో మిగతా పనులు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, డివిజన్ బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, మల్లీశ్వరి, రాం కోటి, రుద్ర యాదగిరి, బాల రాజు గౌడ్, డివిజన్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఎల్బీనగర్ :
ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ అన్నారు. 'ఐ ఓటు ఫర్ ష్యూర్' నినాదంతో 5కే రన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జీహెచ్ఎంసీ అధికారులు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నుంచి చింతలకుంట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అర్హత గల వారందరినీ ఓటరుగా నమోదు చేయడంతోపాటు, తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు.. తప్పుల సవరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 25 ఏండ్లుగా ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో కేవలం 40%-49% నమోదు అయిందని..వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిళ్ళ డిప్యూటీ కమిషనర్లు రవీందర్ కుమార్, దశరథ, అరుణ, ఎల్బీనగర్ ఏసీపీ జానకి రెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎం.ఆర్.ఓ.లు, జీ.హెచ్.ఎం.సీ అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధిపై సమావేశం



నవతెలంగాణ - హస్తినాపురం
హస్తినాపురం డివిజన్ అభివృద్ధిపై జీహెచ్ఎంసీ ఎలక్ట్రిసిటీ విభాగం అధికారులతో స్థానిక వార్డ్ కార్యాలయంలో శనివారం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల అవసరం మేరకు వీధి దీపాల అమరికతో పాటు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ అధికారులు కాలనీలలో పర్యటించే క్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజానీకం అందుబాటులో ఉండాలన్నారు. కాలనీలో ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉందని తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం చేరవేసి..పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ జగన్నాథం, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మికి మెరుగైన వైద్యం అందించాలి



సుధాకర్ మాదిగ

నవతెలంగాణ-ఎల్బీనగర్
ఎల్బీనగర్ పోలీసుల చేతుల్లో తీవ్ర గాయాలపాలైన బాధిత మహిళ లక్ష్మికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మార్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గం ఇంచార్జి సుధాకర్ మాదిగ కోరారు. చంపాపేట్ డివిజన్ లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మిని శనివారం ఆయన పరామర్శించినారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ ఆగస్టు 15న ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో నైట్ డ్యూటీలో ఉన్న వారి అందర్నీ ఉద్యోగం నుండి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు మెరుగైన వైద్యం కోసం కిమ్స్, యశోద, అపోలో వంటి కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజు, రవి, చిరంజీవి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృదేవోభవ ఆశ్రమంలో అన్నదానం

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి



నవతెలంగాణ-బడంగ్ పేట్
మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ -కువైట్ వారి ఆధ్వర్యంలో బలగం రమేష్-కుమారిల కుమారుడు బలగం వినయ్ కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా శనివారం అన్నదానం చేసినట్లు మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఎంతో మంది రక్త సంబంధాలను తెంచుకొని కన్నవారికి పిడికెడు అన్నం పెట్టకుండా వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని మా ఆశ్రమం చేరదీస్తుందని తెలిపారు. ఇలాంటి వారి ఆదుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. మానవతా విలువలు కలిగిన వారు, సంపన్నులు, మానవ సేవే మాధవ సేవగా భావించే వారు అనాథలను ఆదుకోవడానికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ భృతి ఇవ్వాలని సరూర్ నగర్ తహసీల్దార్‌కు యువ మోర్చా నాయకులు సిలివేరు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు.
నవతెలంగాణ - ఎల్బీనగర్

కూతురిని హతమార్చిన తండ్రి





నవతెలంగాణ-వనస్థలిపురం
కట్టుకున్న భార్యపై ద్వేషంతో కూతురిని అతి దారుణంగా తండ్రి హతమార్చిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు శనివారం వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...అజిత్ సింగ్ నగర్ విజయవాడకు చెందిన చంద్రశేఖర్‌కు 2011లో హిమబిందుతో వివాహం జరిగింది. వారు హైదరాబాద్ నగరంలోని బీహెచ్ఈఎల్‌లో నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్‌కు ఉద్యోగం పోయి భార్యతో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో భార్య అయిన హిమబిందు బీహెచ్ఈఎల్‌లోని పుట్టింట్లో తన కూతురుతో కలిసి ఉంటుంది. వారి కుమార్తె మోక్షజ(8) స్థానిక పాఠశాల జ్యోతి విద్యాలయంలో చదువుతోంది. ఈ క్రమంలో చంద్రశేఖర్ భార్యపై ద్వేషం పెంచుకున్నాడు. పథకం ప్రకారం చంద్రశేఖర్ తన కూతురు మోక్షజను స్కూల్ నుంచి కారులో ఎక్కించుకుని షార్ప్ పెన్సిల్ కట్టర్‌తో కూతురి మెడను కోసి హత్య చేశారు. తర్వాత మోక్షజ మృతదేహాన్ని దూరంగా పడేయాలనే క్రమంలో ఔటర్ రింగ్ రోడ్ నుంచి కారులో ప్రయాణం చేస్తూ కోదాడ ప్రాంతంలోని రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టాడు. వెంటనే స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో 8 ఏండ్ల బాలిక మృతదేహం కనపడటంతో చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అప్పుడు అసలు విషయం బయటపడిందని వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడు వద్ద నుంచి ఒక ఫోను, షార్ప్ పెన్సిల్ కట్టర్‌ను, కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో కేసును ఛేదించిన అబ్దుల్లాపూర్ మీట్ సీఐ మన్మోహన్, కే.వెంకట్ రెడ్డి, బి. కృష్ణలను ఏసీపీ అభినందించారు.

ఎల్బీనగర్ నుండి జేబీఎస్ వరకు నాన్ స్టాప్ బస్సులు



నవతెలంగాణ- నాగోల్/ హయత్‌నగర్
ఎల్బీనగర్ నుండి జూబ్లీ బస్ స్టేషన్ వరకు నాన్ స్టాప్ బస్సులను రీజినల్ మేనేజర్ వరప్రసాద్ ఆదేశాల మేరకు నాన్ స్టాప్ బస్సులు నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ , హయత్ నగర్ 2 డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థమై ఎల్బీనగర్ నుండి జూబ్లీ బస్ స్టేషన్ వరకు తేదీ 21-08-2023 (సోమవారం) నుండి నాన్ స్టాప్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వారు తెలిపారు. బండ్లగూడ మరియు హయత్ నగర్ -2 డిపోలు మొదటి దఫాలో 6 మెట్రో బస్సులను రద్దీ సమయాల్లో అనగా ఎల్బీనగర్ నుండి జేబీఎస్ కు ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు..జేబీఎస్ నుండి ఎల్బీనగర్ వరకు 8:45 నుండి 10 గంటల వరకు, సాయంత్రం ఎల్బీనగర్ నుండి 5:10 నిమిషాలు నుండి 6:30 అలాగే జేబీఎస్ నుండి 4:25 నిమిషాల నుండి 6:15 గంటల వరకు ప్రతి 15 నిమిషాల వ్యవధిలో 90L రూట్లో 40/- రూపాయల ఫ్లాట్ ధరతో బండ్లగూడ మరియు హయత్ నగర్ -2 డిపోలు నడపనున్నాయి. ఇందులో ఎటువంటి పాస్ హోల్డర్స్ కు అనుమతి లేదు అనే విషయాన్ని ప్రయాణికులు గమనించాలని వారు కోరారు. కావున ప్రయాణికులు ఈ 90L రూట్ నాన్ స్టాప్ సర్వీస్‌లను వినియోగించుకొని టీఎస్ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

ఈ క్రింద పొందుపరిచిన సమయ సూచిక

ఎల్బీనగర్ నుండి ఉదయం 8:00, 8:15, 8:30, 8:45 ,9:00, 9:15 ,9:30 ,9:45, 10:00 సాయంత్రం 5:10, 5:25 ,5:40,5:55, 6:15 , 6:30

జేబీఎస్ నుండి ఉదయం 8:45, 9:00 , 9:15, 9:30 ,9:45, 10:00..సాయంత్రం 4:25 , 4:40 , 4:55 , 5:10 , 5:30 , 5:45 ,6:00 ,6.15 బస్సులు బయలుదేరే వేళలను వారు వివరించారు.

వనస్థలిపురం పనామా చౌరస్తాకు

ఎన్టీఆర్ చౌరస్తాగా నామకరణం





నవతెలంగాణ- వనస్థలిపురం
వనస్థలిపురం పనామా చౌరస్తాకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చౌరస్తాగా నామకరణం చేయడం హర్షణీయమని గడ్డి అన్నారం మార్కెట్ మాజీ చైర్మన్ కర్నాటి అనిల్ చౌదరి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ చౌరస్తా నామకరణం విషయంలో ఇచ్చిన మాటను మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిలు నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా జీవో ఎంఎస్. నెంబర్.163 తేదీ 17/08/2023న నామకరణం చేశారని అన్నారు. అనంతరం వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

'కార్మికులతో పెట్టుకుంటేే కాలగర్భంలో కల్సిపోవాల్సిందే'



నవతెలంగాణ - ఎల్బీనగర్
కార్మికులు, కర్షకులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వమైనా కాలగర్భంలో కల్సిపోవాల్సిందే అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్ జీహెచ్ ఎం సీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన ధర్నాకు శనివారం రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి, కంటెస్టెంట్ ఎమ్మెల్యే కొత్త మనోహర్ రెడ్డిలతో కలిసి భాస్కర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను పర్మినెంట్ చేసినట్లుగా పారిశుద్ధ్య కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ భూముల కోసం ప్రభుత్వంలో కలుపుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుళ్ళ శివ ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధు సూదన్ రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజు గౌడ్, తలాటి రమేష్ నేత, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

'కార్మికులకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర సర్కార్'



పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. పారిశుధ్య కార్మికులు రెండు రోజులుగా తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ చేస్తున్న ధర్నాకు శనివారం ప్రభాకర్ రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అనేక సందర్భాల్లో స్వయంగా సీఎం కేసీఆర్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాట తప్పడం సరికాదన్నారు. కార్మికులకు, కర్షకులకు సరైన న్యాయం చేసింది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'జీహెచ్ఎంసీ కార్మికులది న్యాయమైన పోరాటం'



జీహెచ్ఎంసీ కార్మికులది న్యాయమైన పోరాటం అని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ సీఐటీయూ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్యలు అన్నారు. శాంతియుతంగా కార్మికులు చేస్తున్న ధర్నాకు సీఐటీయూ నాయకులు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల విషయంలో ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.వీరయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు సిహెచ్ వెంకన్న, సిహెచ్ మల్లేశం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంధం మనోహర్, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కాలనీని అభివృద్ధి చేస్తా

- కార్పొరేటర్ సుజాతా నాయక్



నవతెలంగాణ-హస్తినాపురం
హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ సుజాతా నాయక్ అన్నారు. అగ్రికల్చర్ కాలనీలో రూ. 1.2 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ ఏఈహేము నాయక్ తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అగ్రికల్చర్ కాలనీలో పూర్తి స్థాయిలో రహదారుల నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్పొరేటర్ వెంట కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర మహిపాల్ రెడ్డి, పీఎస్ ఆర్ శర్మ, బాలకృష్ణారెడ్డి, మెగా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి బీఎల్‌ఆర్ ట్రస్ట్ రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్‌లోని సాయిబాబానగర్‌లో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి రూ.లక్ష చెక్కును రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. బీఎల్‌ఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డిని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, దామోదర్ గౌడ్, రాము ముదిరాజ్, భాస్కర్ యాదవ్, సాయి, విష్ణు గౌడ్, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28 మందికి కారుణ్య నియామకాల పత్రాలు పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో
కారుణ్య నియామకాల ద్వారా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 28 మందికి నియమక పత్రాలను అందజేసినట్టు జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కారుణ్య నియామకాల ద్వారా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 28 మందికి వివిధ శాఖల్లో నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

● కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి ● కార్మికుల ధర్నాకు మద్దతు తెలిపిన పత్తి కుమార్



నవతెలంగాణ-కాప్రా
జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల కార్మికులను పర్మినెంట్ చేయాలని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట కార్మికుల చేపట్టిన ధర్నాకు సంఘీభావం ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణంలోనే వంటా వార్పు చేసి కార్మికులతో సహా పంక్తి భోజనం చేశారు. అనంతరం కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ .. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి పర్మినెంట్ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. దశాబ్ద కాలంగా కార్మికుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటుందని విమర్శించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎన్నిసార్లు ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా దళిత విభాగం చైర్మెన్ పత్తి కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ల నాయకులు కె. శివ కృష్ణ, సునీల్ మనోహర్, రామ రాజేశ్వర్, యాక స్వామి, కురుమన్న, సుజాత, మంజుల, అంజలి, శ్యామల, శివయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఎదగాలంటే లక్ష్యం ఉండాలి

● ప్రముఖ సినీ నటుడు కేవీ. ప్రదీప్ ● కేజీఆర్ కళాశాలలో విద్యార్థి అభివృద్ధిపై సమావేశం



నవతెలంగాణ-కీసర
విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే ఒక లక్ష్యం పెట్టుకుని పని చేస్తేనే గొప్ప వ్యక్తులు అవుతారని ప్రముఖ సినీ నటుడు కేవీ. ప్రదీప్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాల్టీ,రాంపల్లి గ్రామంలోని కేజీఆర్ కళాశాలలో విద్యార్థి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవ వనరుల అభివృద్ధి, సినిమా రంగానికి చెందిన కేవీ. ప్రదీప్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. "ఇష్టపడు పంచుకొని ధ్రువీకరించుకో" అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి విజయాలు సాధించి ఇతరులతో పంచుకోవాలన్నారు. ఎంతో ఎత్తుకు ఎదిగిన మహాను భావులంతా ఒంటరిగానే ప్రయాణాన్ని సాగించారని తెలిపారు. విజయం పొందిన తర్వాత ప్రతి విద్యార్థి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. విమర్శించే వ్యక్తులను వదిలేసి బలమైన వ్యక్తిత్వంతో సాగితే విజయాలు సాధిస్తామని చెప్పారు. కళాశాల డైరెక్టర్ పీవీ.రమణారావు మాట్లాడుతూ.. ప్రతినెలా నిష్ణాతులైన వ్యక్తులతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్త్రీల రక్షణ, డ్రగ్స్‌రహిత సమాజంపై గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ కే. గోవింద్ రెడ్డి, కళాశాల సెక్రెటరీ కే. నితిన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



నవతెలంగాణ-బోడుప్పల్
కేంద్ర ప్రభుత్వం విద్యా కాషాయీకరణకు పూనుకున్నదని, దానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యవర్గ సమావేశం ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టలక్ష్మన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని వాపోయారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. 2018 ఎన్నికల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని నేటికీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ యూనివర్సిటీలకు నిధులు కేటాయించడం లేదని తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకుండా బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లోని ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి ప్రభుత్వమే రెడ్ కార్పెట్ వేస్తుందని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమామహేష్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్ లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

జిల్లా నూతన కమిటీ..

అనంతరం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నబాబు, కార్యదర్శిగా ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులుగా హరీష్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ నాగ జ్యోతి, నాయకులు అరవింద్, కార్తీక్, శశి, గణేష్ , సాయి తరుణ్ , శివ సాయి , వినయ్ , దుర్గ ప్రసాద్ , అజయ్ , చరణ్ , అనిల్ కుమార్ , చేతన్ పాల్గొన్నారు.

కాప్రా చెరువును సందర్శించాలని వినతి



నవతెలంగాణ-కాప్రా
కాప్రా చెరువును సందర్శించాలని కోలోనీస్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సంజీవరెడ్డి తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ సముద్రాల వేణుగోపాలచారికి శనివారం వినతి పత్రం అందజేశారు. కాప్రా చెరువు తూములకు అడ్డు కట్ట వేయకపోవడంతో చెరువులో నీరు నిలవడం లేదని తెలిపారు. నలభై ఏళ్లుగా చెరువు ఎలా ఉందో అలాగే ఉన్నదని పేర్కొన్నారు. చెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.9 కోట్లు కేటాయించినా ఇరిగేషన్ శాఖ అధికారులు అభివృద్ధి చేయడంలో విఫలం అయ్యారని తెలిపారు. అరకొరగా చేసిన పనులు కూడా కనుమరుగు అయ్యాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు.

ఘనంగా ఒమేగా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-కాప్రా
మహేష్ నగర్‌లోని ఒమేగా బాలికల డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం చక్రీపురంలోని సిరి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెగా అండ్ ఒమేగా గ్రూప్ ఆఫ్ సంస్థల వైస్ చైర్‌పర్సన్ కసిరెడ్డి మాలతీరెడ్డి, కరస్పాండెంట్ నన్నూరు సీతారాంరెడ్డి, డైరెక్టర్ ఎన్. మంజురెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలనే అంశాలను విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. శివభవాని, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజనారాయణరెడ్డి, అధ్యాపకులు గంగాధర్, వాసుదేవ, గిరి, రాధ, ప్రణీతాకుమారి, మంజుల, మౌనిక, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుంది : ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-ఘట్కేసర్
వచ్చే ఎన్నికలతో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని పోచారం మున్సిపాల్టీ బీఆర్ఎస్ నాయకుడు వల్లమల్ల ప్రవీణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చాడని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా తన వంతు సహకారంగా సామాజిక, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ఆదరించి గెలిపించాలని కోరారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మంత్రి మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే

ప్రగతి భవన్ ముట్టడిస్తాం

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ● ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి ● గురుకులాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉప్పల్
రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టీ. నాగరాజు అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు సంక్షేమ వసతి గృహాల సమస్య పరిష్కారానికై చేపట్టిన అధ్యయన యాత్ర శనివారం రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. మేడ్చల్ మల్కాజిగిరి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ పరిరక్షణకు అధ్యయన యాత్ర చేయడం చాలా మంచిదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో కనీస మౌలిక సదుపాయాలు లేవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్స్, లెక్చరర్స్, వార్డెన్స్, ఎంఈవో, ఇతర పోస్టుల ఖాళీలు ఉన్న ప్రభుత్వ భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గురుకుల పాఠశాలలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో అక్కడ వసతులు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒకే గురుకుల బిల్డింగ్‌లో నాలుగు గురుకులాలు పెట్టి 1200 మంది విద్యార్థులకు ఒక్క ప్రిన్సిపాల్, 6 మంది టీచర్స్, ఇంకొంతమంది కాంట్రాక్ట్ టీచర్స్ ఉన్నారని తెలిపారు. సబ్జెక్టులకు సరిపడా టీచర్స్ లేని దుస్థితి ఉందన్నారు. గురుకులాలు పెట్టామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మన్న ట్రస్ట్ నుంచి కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనాలు పంపిస్తున్నారని చెప్పారు. ఆ భోజనాన్ని విద్యార్థులు తినలేేదని తెలిపారు. కర్రీస్, భోజనం నాణ్యతో లేదని విద్యార్థులు తినడమే మానేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మన్న ట్రస్ట్ నుంచి వచ్చే భోజనాలను రద్దు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులను పెట్టి భోజనం వడ్డించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులే క్లాస్ రూమ్స్, గ్రౌండ్స్ శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి బంగారు తెలంగాణలో కొనసాగుతుందన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలను, రాజకీయ నాయకులను రానీయొద్దని విద్యాధికారుల ప్రకటనలు ఇచ్చే బదులు వసతుల కల్పనపై దృష్టి పెడితే బాగుంటుందని ఎద్దేవా చేశారు. సంక్షేమ హాస్టల్స్‌లో పెరిగిన మెస్ చార్జీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నెలలు గడుస్తున్నా కాస్మోటిక్ చార్జీలు ఒక్క రూపాయి చెల్లించని చేతగాని ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో చలో ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు సుమంత్, మణికండు, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, వంశీ, జిల్లా కమిటీ సభ్యులు భగత్,శివ, కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్వర్, ఆదిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్
అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు అందజేస్తున్న రూ.లక్ష సాయం పొందిన లబ్ధిదారులతో కలిసి వార్డు కార్యాలయం వద్ద కేసీఆర్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు అందరికీ లక్ష రూపాయల చెక్కును అందజేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక రుణాలను అందిస్తూ అందరి సంక్షేమ అభివృద్ధికై కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలో అన్ని వర్గాల, మతాలను అభ్యున్నతికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అబ్బూభాయ్, ఎండీ మహమూద్, ఎండీ షఫీ, గౌస్, ఎస్కే షఫీ, ఇస్మాయిల్, ఇబ్రహీం, షేహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

అపోలో డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

చిల్కానగర్ డివిజన్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను కార్పొరేటర్ బన్నాల గీత ప్రారంభించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చులతో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, నాగేశ్వరరావు, మేకల హన్మంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామానుజన్, ప్రతాప్ రెడ్డి, యాదగిరి,పోచయ్య, సదానంద చారి, సుందర్, శ్యామ్ యాజమాన్యం ప్రదీప్, ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్ ప్రారంభం



● టైటిల్ ఫేవరెట్‌గా తెలంగాణ జట్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో
అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్ 2023 పోటీలను హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లోశనివారం ఘనంగా ప్రారంభించారు. దీనికి ఎల్ఐసీలో దేశంలోనే నెం.1 చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ (సీఎల్ఐఏ), భారత జట్టు బ్రాండ్ అంబాసిడర్ కౌటికె విఠల్ హాజరయ్యారు. ఈసారి టైటిల్ ఫేవరెట్లలో తెలంగాణ జట్టు కూడా ఉంది. ఇప్పటికే ఇది కేరళ, హర్యానా జట్లను గ్రూప్ మ్యాచ్‌లలో ఓడించి, గ్రూపులో అగ్రస్థానానికి చేరుకుంది. మొత్తం 12 పురుషుల జట్లు, 8 మహిళల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. నేషనల్స్‌లో వారి ఆటతీరును బట్టి భారత జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేస్తారు. అలా ఎంపికైనవారు అక్టోబర్‌లో మలేషియాలో జరిగే ఏషియన్ ఓషియానిక్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ఆడతారు. భారత జట్టు గతంలో 2018, 2021లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొంది. అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అంతర్జాతీయ ఫెడరేషన్ అమెరికన్ ఫుట్‌బాల్, భారత ఒలింపిక్ సంఘాల గుర్తింపు ఉంది.

జట్లు ఇలా..

పురుషుల జట్లు : తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా.మహిళల జట్లు : రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, చండీగఢ్.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఉపయోగం

●రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర
పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామంలోని టీపీఎస్ కృష్ణ నగర్ కాలనీకి చెందిన వెంకట్ అఖిల్ కొద్ది రోజుల క్రితం హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందారు. ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.32,500 చెక్కును కీసర మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు వంగేటి పర్వత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ కృష్ణ నగర్ కాలనీ అధ్యక్షులు ఏసీ రెడ్డి సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాల్ మార్క్ , ఉపాధ్యక్షులు వెంకన్న యాదవ్, నగేష్ యాదవ్ , ఆర్గనైజేషన్ సెక్రటరీ భారతి, సాయి గౌడ్, శ్రీకాంత్, సత్యనారాయణ, హనుమంత్ పాల్గొన్నారు.

సీపీఐ మండల కన్వీనర్‌గా దుబ్బ కోటి ఆంజనేయులు



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మండల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం పట్టణంలోని నారెడ్డి గౌతమ్ రెడ్డి భవనంలో మండల కార్యదర్శి ఎన్ శశిధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో దుబ్బ కోటి ఆంజనేయులును మండల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డిజీ సాయిలుగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీపీఐ ప్రజా సంఘలను బలోపేతం చేయాలని సూచించారు. నూతన్‌కల్‌లో 472లో సర్వేనెంబర్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం అయ్యే వరకు రైతులకు అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో 50మంది రైతులు సభ్యత్వం తీసుకున్నట్లుగా వెల్లడించారు. కార్యక్రమంలో రైతు జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహా,డి జంగయ్య,ఎర్రోళ్ల అశోక్, కనకయ్య,నవీన్ కుమార్ పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'



నవతెలంగాణ-బోడుప్పల్
కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి పర్మినెంట్ చేయాలని నగర ఔట్ సోర్సింగ్ సిబ్బంది అధ్యక్షుడు డి.సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం బోడుప్పల్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక ఔట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేసి అందరిని పర్మినెంట్ చేస్తానని 2012లో కేసీఆర్ అన్నారని తెలిపారు. సీఎం మాటలు ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో తమ కోరికలు తీరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, వీఆర్‌వోలు, వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించి మున్సిపల్ సిబ్బంది పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో వివిధ విభాగాలలో పౌరుగు సేవలపై పని చేస్తున వారు చాలీ చాలని జీతాలతో బతుకీడుస్తున్నామన్నారు. పెరుతున్న ఖర్చులను కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మున్సిపల్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్‌గౌడ్, గౌరవ సలహాదారులు అంజయ్య, ముఖ్య సలహాదారులు సాయిరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు బాలనర్సింహ్మా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మల్లారెడ్డి, సీహెచ్ జ్ఞానేశ్వర్, కోశాధికారి శేఖర్, సహయ కోశాధికారి అశోక్ తదితరులున్నారు.

రాష్ట్రానికే తలమానికంగా ..

మేడ్చల్ అభివృద్ధి : మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట
మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్ పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో మంత్రి మల్లారెడ్డి శనివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా తుర్కపల్లి తండాలోని సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లకు, పెండింగ్ ఆలయాలను తన సొంత నిధులతో పూర్తిగా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పనులు రేపటి నుంచే ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం ఎంపీసీ వారి ఆధ్వర్యంలో తుర్కపల్లిలోని భవన నిర్మాణ కార్మిక భవనంలో మహిళాలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, కో ఆప్షన్ జహీర్, ఎంపీపీ ఎల్లుబాయి బాబు, జెడ్పీటీసీ అనిత, శామీర్ పేట్ బీఆర్ఎస్ అధ్యక్షులు విలాసాగరం సుదర్శ న్, వైస్ ఎంపీపీ సుజాత, తుర్కపల్లి సర్పంచ్ కవితా వేణుగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ యూసుఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో బ్యాటరీ వాహనాలు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో
హాస్పిటల్‌కు వచ్చే రోగుల సౌకర్యార్థం నిమ్స్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిమ్స్ బ్రాంచ్ వారి సౌజన్యంతో నాలుగు బ్యాటరీ కార్లను శనివారం హాస్పిటల్ డైరెక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. నిమ్స్ రోగుల రద్దీ పెరుగుతుండటంతో హాస్పిటల్ ప్రాంగణంలో ట్రాఫిక్ సమస్య, శబ్ద, వాయు కాలుష్యంతో రోగులు అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిమ్స్ యజమాన్యం నాలుగు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అవసరమైతే మరిన్ని వాహనాలను సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డీన్ లిజా రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్‌లు కెవి కష్టారెడ్డి, లక్ష్మీ భాస్కర్, నెఫ్రాలజీ ప్రొఫెసర్ స్వర్ణలత, డాక్టర్ సాయిబాబా, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, మీడియా ఇన్‌చార్జి సత్య గౌడ్, రాజ్ కుమార్, రాము, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో వాహనాల తనిఖీ

నవతెలంగాణ-బోడుప్పల్
ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి అన్నారు. శనివారం బోడుప్పల్ పరిధిలోని వివిధ కాలనీల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో వాహనాల తనిఖీ చేశామన్నారు. నెంబరు ప్లేట్ లేకుండా, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో మేడిపల్లి ఎస్ఐ కిష్టయ్య ప్రభాకర్‌రెడ్డి, అనీల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మెన్



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మండల నూతన తహశీల్దార్‌గా ఇటీవల నియమకమైన శైలజను శనివారం మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత

● కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ సమ ప్రాధాన్యత ఇస్తున్నారని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారీలకు మంజూరు చేసిన రూ. 1 లక్ష ఆర్థిక సహాయం చెక్కును శనివారం ఆమె రాజీవ్ గాంధీ నగర్ ఇంద్రానగర్‌కు చెందిన షేక్ గౌస్ పాషాకు అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను సమానంగా చూస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. దీనిని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొబైల్ హెల్త్ క్యాంపును ఉపయోగించుకోండి : కార్పొరేటర్

నవతెలంగాణ-మల్కాజిగిరి



ప్రభుత్వం సీనియర్ సిటిజన్‌ల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్యాంపును అందరు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కోసం ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్యాంపును డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ స్టాఫ్ సరితా, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, కాలని అధ్యక్షుడు బ్రమ్మయ్య, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం స్మశాన వాటిక స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్, సోనియా గాంధీ నగర్‌లో గల ముస్లిం సోదరుల స్మశాన వాటిక స్థలంపై నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ స్థానికులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాడుకలో ఉన్న ముస్లిం స్మశాన వాటిక స్థలం అటవీశాఖతో ఉన్న సమస్యను కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రటరీ సిద్ధిక్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, మఖ్సూద్ అలీ, బషీ రుద్దీన్, దొడ్ల ఆంజనేయులు, ఖలీల్, ఇర్ఫాన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి వాగ్మీకరావు ఫౌండేషన్ చేయూత ..



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పేద విద్యార్థినికి వాగ్మిక రావు ఫౌండేషన్ చేయూత నిచ్చింది. నిరుపేద కుటుంబానికి చెందిన సాయిప్రియ ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. ఆమె దీన స్థితిని తెలుసుకున్న వాగ్మీకరావు ఫౌండేషన్ తరపున సీఈఓ వెన్నమనేని విష్ణురావు, సాత్విక్ రావు సహాయంతో శనివారం 133 డివిజన్ కార్పొరేటర్ రాజ్, జీతేందర్‌నాథ్ చేతుల మీదుగా సాయిప్రియ తల్లి బి.రాణికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి



● ప్రగతి నగర్ మూడు కోతుల బొమ్మల సెంటర్లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి
● సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి.వెంకట రామయ్య

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు సుమారు 25 వేల మంది నిరుపేద లబ్ధిదారులు ఇండ్ల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని పలువులు అధికారులు వెంటనే వెరిఫికేషన్ జరిపి, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య తెలిపారు. ఈ మేరకు నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కి సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు అగ్రకుల పేదలు మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఆటో రంగంలో పనిచేస్తున్న డ్రైవర్సు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు చిన్నచిన్న పరిశ్రమలో చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికులు వీరికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి మన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నిజమైన అరులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పారదర్శకంగా కేటాయింపులు జరిపి ఇండ్లు పంపిణీ చేయాలని తెలిపారు తెలిపారు. పేద ప్రజలు ప్రతినెల అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ,రాష్ట్ర ప్రభుత్వం సూచనల ఆదేశాల మేరకు ఇప్పటికైనా లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే అనేక సంవత్సరాల క్రితం నుండి ప్రగతి నగర్ మూడు కోతుల బొమ్మల సెంటర్లో బస్ షెల్టర్ సౌకర్యంగా ప్రజలందరికీ ఉండేదని ఇటీవల కార్పొరేషన్ అనంతరం ఇక్కడి బస్టాప్‌ను రోడ్డు వెడల్పు సాకుతో తొలగించారని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తిరిగి బస్ షెల్టర్‌ను వెంటనే పునర్ నిర్మించాలని ప్రజల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ(ఎం) పార్టీ బాచుపల్లి మండల కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ(ఎం) నాయకులు బాల వెంకటేశ్వరరావు, ఎన్.బాలపీరు వెంకటరాజ్యం మల్లికార్జున్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి కోసం ఆసక్తిగల రంగాన్ని ఎంచుకోవాలి

● పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-సిటీబ్యూరో



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్ పరిధిలోని గూడ్స్ షెడ్ రోడ్డులో డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జోజమ్మ, ఉదయరాజు దంపతులు రవిసాగర్ ఇండస్ట్రీస్‌ని శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ యవత, నిరుద్యోగులు ఆసక్తి, అనుభవం గల రంగాలలో తమ కుటుంబాన్ని పోషించుకోడానికి జీవనోపాధిని ఎంచుకుని స్థిరపడాలని, అంతేకాకుండా మరికొందరికి ఉపాధి కల్పించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సత్యం శ్రీరంగం సూచించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, కృష్ణ రాజ్‌పుత్, ఫణి, రజిత, జిబిన్, నయీమ్, శేఖర్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్‌లో రూ.50 లక్షలతో బాక్స్ డ్రైన్ పనులను శనివారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ.లౌక్య ఏఈ. దివ్య జ్యోతి, సీనియర్ నాయకుడు మేకల రామూయాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలి

● ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



విద్యార్థులు చిన్ననాటి నుండే పట్టుదలతో చదివితే భవిష్యత్తులో లక్ష్యాన్ని తప్పక చేరుకుంటారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సూచించారు. శనివారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గిరినగర్ ప్రాంతానికి చెందిన సాఫ్టేర్ ఉద్యోగి, సామాజిక కార్యకర్త,గంజి ఉదయ్ సేవియా ఫౌండేషన్ వారి సహకారంతో సుమారు రూ.4 లక్షలు వెచ్చించి పాఠశాల భవనాన్ని పునర్నిర్మానించిన సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ బి .విజయ్ శేఖర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఆడుకునేందుకు ఆట వస్తువులను, బ్యాగులను, షులను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత హెూదాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సామాజిక విలువలు ,వ్యక్తిత్వ విలువలు, తెలవడంతోపాటు ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధిస్తున్నారన్నారు. పాఠశాలను దత్తత తీసుకుని పునర్నిర్మాణంలో భాగస్వామిగా ముందుకు వచ్చిన దాత గంజి ఉదయ్ సేవియాను పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని తెలిపారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. దాత గంజి ఉదయ్ సేవియా మాట్లాడుతూ తాను కూడా పేద కుటుంబంలోని జన్మించానని కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎదుగుతున్నాన న్నారు. సామాజిక సేవ చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వచ్చానన్నారు. భవిష్యత్తులో కూడా తన టీం సభ్యులతో కలిసి సేవలు విస్తృతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రాములు, టీం సభ్యులు సరస్వతి గిరిధర్ రాజు, అరవింద్, క్రాంతి, సాయి, రాజశేఖర్, ఏర్వ .శంకరయ్య, ఉపాధ్యాయులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట : కార్పొరేటర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్ కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, మోహన్ రావు, జీఎన్ రాజు, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ బాబు, శంకర్ రావు, పుల్లారావు, రాధాకృష్ణ, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.

కుప్పకూలిన ఇంటిపై కప్పు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్‌లో శనివారం 60 గజాల ఇంటి పైకప్పు కుప్పకూలింది. అదృష్టవశత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పట్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కట్టిన ఇండ్లు, శిథిల వ్యవస్థకు చేరుకోవడంతో ఇండ్లు వర్షానికి పూర్తిగా నానిపోయి కూలిపోయింది. అంతకు ముందు రోజు ఆ ఇంట్లో నివాసముంటున్న గర్భిణీ పుట్టింటికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అ కాలనీలో ఇలాంటి శిథిల వ్యవస్థకు చేరిన ఇండ్లు అనేకం ఉన్నాయి. ఇండ్ల పైకప్పు పెచ్చులు లేవడంతో భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు తమకు ఇండ్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా భూకబ్జాదారులు ప్రభుత్వ భూములపై పాగవేసి కబ్జాలకు పాల్పడుతున్నారని అమాయక ప్రజలను బలి చేసి లక్షలు దండుకుంటున్నారని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్ తెలిపారు. ఈ మేరకు గాజుల రామారం సర్కిల్ దేవేందర్ నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 348/1 జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీ, రాజీవ్ గృహకల్ప కాలనీ చర్చి ప్రాంగణంలో గతంలో కబ్జాల పర్వం కొనసాగుతుందని మండల తహసిల్దార్ హెచ్చరిక బోర్డు పెట్టారని ఇవేమీ ఖాతరు చేయకుండా కబ్జాదారుడు యదేచ్ఛగా రాత్రికి రాత్రే ఆ ప్రాంతంలో సూచిక బోర్డును తొలగించి బేస్మెంట్ నిర్మాణం చేపట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అధికారులు తక్షణమే ప్రభుత్వ స్థలాలు కాపాడాలని భూకబ్జాదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరైనా భూకబ్జాలకు పాల్పడితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సూచిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ అండ్ మటన్ మార్కెట్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ బస్ స్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏఆర్ న్యూ ఫైన్ చికెన్, అండ్ మటన్ మార్కెట్‌ను మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాప్ నిర్వాహకులు మొహమ్మద్ కలీం, ఇమ్రాన్, ఫైజాన్, అద్నాన్,, బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం వేరొకరి జీవితాలకు ప్రాణదానం



నవతెలంగాణ-దుండిగల్

రక్తదానం చేయడం కంటే పుణ్యం మరొకటి ఉండదని, అలాంటి ఈ కార్యక్రమం చిరంజీవి జన్మదిన సందర్భంగా చిరంజీవి యువత నిర్వహించడం ఎంతో అభినందనీయమని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రముఖ సినీ నటులు మెగాస్టార్ చిరంజీవి, జన్మదిన సందర్భంగా చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ,సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథు లుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ,ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన చిరంజీవి యువత అభిమానులకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకు లు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక వాసులు, ఆయా కాలనీ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కఠిన తీసుకోవాలి

● కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కమిటీ డిమాండ్

నవతెలంగాణ-దుండిగల్



స్వాతంత్ర దినోత్సవం రోజు బస్ కోసం ఎల్బీనగర్ చౌరస్తాలో నిలబడి ఉన్న గిరిజన మహిళ వడిత్యా లక్ష్మిని పోలీసులు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి రాత్రంతా చిత్రహింసలు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించడాన్ని కుల, వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఆ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. కృపా సాగర్ , నాగనిగళ్ళ బాలపీరులు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడుతూ గిరిజన మహిళపై విచక్షణ రహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి దాడి చేయడం అమానుషం అన్నారు. రాత్రంతా స్టేషన్‌లోనే ఉంచి ఆమె వద్ద వున్నా డబ్బులు, సొమ్మును గుంజుకొని ఆమె పై థర్డ్ డిగ్రీ ప్రయోగించి విపరీతంగా కొట్టారన్నారు. తన కూతురు పెళ్లి ఉందని పెళ్లి పత్రిక చూపించిన వినకుండా గిరిజన మహిళను కొట్టి హింసించిడాన్ని కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధ్యులైన ఇద్దరు పోలీసులను ఉద్యోగం నుండి తొలగించాలని, వాళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. అదే విధంగా బాధితురాలికి నష్ట పరిహారంగా ఎక్స్ గ్రేషియే 50 లక్షలు రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలన్నారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ మధురానగర్ లోగల శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల పూజల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా 26వ డివిజన్ మధురా నగర్‌లో శ్రీ అష్ట లక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం పనుల పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాఘవేంద్రరావుతో, ప్రజాప్రతినిధుల,స్థానిక వాసులతో కలిసి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతి నిధులు,స్థానిక కాలనీ వాసులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

సెయింట్ పీటర్స్ కళాశాలలో 13వ గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మైసమ్మగూడ, లోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 13వ గ్రాడ్యుయేషన్ డేను కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంల ముఖ్యఅతిథి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ ,జేఎన్టీయూహెచ్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో చదువుతోపాటు ఉద్యోగానికి ఎలా ప్లాన్ చేసుకోవాలి అనే ప్రణాళిక ఉండాలన్నారు. జీవిత ప్రయాణంలో ప్రతి విషయాన్ని నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం గెస్ట్ ఆఫ్ ఆనర్ రవి రెడ్డి, డైరెక్టర్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మాట్లాడుతూ టీచర్స్‌తో తల్లిదండ్రులతో చాలా విధేయతతో ఉండాలని, వృత్తిపరంగా ఉన్న నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఉద్యోగంలో జవాబుదారీతనం కావాలని లేదంటే మీరు ఉద్యోగంలో విజయం సాధించలేరని తెలిపారు. అనంతరం కళాశాల సెక్రెటరీ టి.వి.రెడ్డి మాట్లాడుతూ నిజమైన జీవితం ఇప్పుడే స్టార్ట్ అవుతుందని ప్రతి రోజు కొత్త విషయాలను తెలుసుకోవాలని వాటిని ఆచరణలోకి తీసుకురావాలని తెలిపారు. మీరు ఇక్కడ విద్యార్థులుగా మంచి ఉద్యోగాలు సంపాదించి మీ జూనియర్స్‌కు, ముందు తరాలకు ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రయత్నించాలని కోరారు. ప్రిన్సిపాల్ డా.కె. శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరాయంగా విద్యార్థులుగానే ఉండాలని ఈ బ్యాచుకు సంబంధించి పాండమిక్ ఉన్నప్పటికీ ఆన్లైన్ ద్వారా క్లాసులు నిర్వహించి విద్యార్థులు విద్యను అభ్యసించారని తెలిపారు. ఈ సందర్భంగా అందరు ఫ్యాకల్టీని అభినందించారు. కరోనాకు ముందు ఆన్లైన్లో క్లాసులు గురించి అవగాహన లేదు, అయినా తెలుసుకుని బాగా క్లాసులు నిర్వహించారని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రాడ్యుయేషన్ అనేది మీరు సాధించిన విజయం తద్వారా మీ ఉద్యోగాల్లో మంచి అవకాశాలు సాధించవచ్చు అని తెలిపారు. మీలో కొందరు ఉన్నత విద్యకు వెళ్తే మరొకరు ఎంటర్ప్రెనుర్‌గా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రుల యొక్క ప్రాముఖ్యత తెలుసుకొని జీవితంలో పై స్థాయికి ఎదగాలని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ స్నేహానికి విలువ ఇస్తు ఉద్యోగాన్ని, బిజినెస్ కొనసాగించాలని తెలిపారు. గ్రాడ్యుయేషన్ పట్టాలతో విద్యార్థుల ఆనందోత్సాహాలతో కళాశాల ఆహ్లాదకరంగా మారింది. ఈ కార్యక్రమంలో చైర్మెన్ టి.బాల రెడ్డి, సెక్రెటరీ టి.వి. రెడ్డి, ప్రిన్సిపాల్ , డా .కె. శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి , అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి , ఉప్పల రాజేశ్వర్, పిఆర్ఓ రవి సుధాకర్, టిపిఓ డాక్టర్ ఎన్ శ్రీకాంత్, పిడి రత్నాకర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్ రెడ్డిని కలిసిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలను గోపాల్ రెడ్డిని శనివారం బాచుపల్లి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీ ప్రజల సమాధుల తోట స్థలం కేటాయింపునకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ..అదే విధంగా ఆ స్థలంలో అభివృద్ధికి కృషి చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంగయ్య చౌదరీ, బొర్రా చందు ముదిరాజ్, యుపిడబ్ల్యూఏ ప్రెసిడెంట్ పుచ్చకాయల జాషువా, పాస్టర్స్ అబ్రహం,యో హెూష్వ,జేమ్స్, పుల్లారావు, ఇతర ముఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బడుగు బలహీన వర్గాలకు, వెనుక బడిన తరగతులకు సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. రిపబ్లిక్ పార్టీ అఫ్ ఇండియా (ఆర్పిఐ) కుత్బుల్లాపూర్ శాఖకు చెందిన నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారంలోని బీజేపీ కార్యాలయంలో కలిసి తమ మద్దతును తెలియజేశారు. జాతీయ స్థాయిలో రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా పార్టీ ఎన్డీఏ లో భాగస్వామ్యమైన నేపథ్యంలో, ఆ పార్టీ జాతీయ నాయకుడు, కేంద్ర సహాయ మంత్రి రామ్ దాస్ అథవాలే



సూచనల మేరకు కుత్బుల్లాపూర్‌లో కూన శ్రీశైలం గౌడ్‌కి తమ మద్దతును తెలుపుతున్నట్లు ఆ పార్టీ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు బాన్సోడ్ సాంబ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరిట బీసీ, ఎస్సీ, ఎస్టీలను మోసం చేస్తూ మంత్రి కేసీఆర్ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, రాజేశ్వర్ రావ్, పత్తి సతీష్, సాయినాథ్, పున్నా రెడ్డి, పరుష వేణు, పులి బలరాం తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ సమక్షంలో తెలుగుదేశం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కరుటూరి అనిల్ ప్రధాన కార్యదర్శి అనంతయ్య, వెంకటేష్ , సత్యనారాయణ, వారణాసి రాము, చంద్రహాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని బాలానగర్ సర్కిల్ - 1 కు ఏసీఎస్ఓగా బాధ్యతలు తీసుకున్న గంప శ్రీనివాస్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ దుండిగల్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శనివారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, ఆనంద్, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖమ్మం జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో చనిపోయిన ఆశా వర్కర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు పని ప్రదేశాల్లో మరణిస్తున్నారని తెలిపారు. పనిభారం పెరిగి మానసిక ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలతో చనిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, మరణాం తర ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇండ్లు మరమ్మతులు చేయాలి

నవతెలంగాణ-చాంద్రయాణగుట్ట

జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటికి మరమ్మతులు ప్లాస్టరింగ్ చేయించాలని, పై కప్పు కూలిపోయే పరిస్థితిలో ఉందని, వీటికి సంబంధించి శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీంద్ర నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ...కాలనీలో గత 18 ఏండ్ల క్రితం నిర్మించిన 32 ఇండ్లు జేఎన్ఎన్‌యూఆర్ఎం స్కీం కింద కట్టించిన ఇండ్లు అని, ఇప్పటివరకు ప్లాస్టింగ్ చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలివేశారన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో కొన్ని ఇండ్లు పై కప్పు కూలిపోయి ఉంది అన్నారు. కొన్ని ఇల్లు కూలిపోయి పరిస్థితిలో ఉందని చెప్పారు. గతంలో మరమ్మత్తు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేని పరిస్థితి అని... ప్రస్తుతం అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటికైనా 32 పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. బడ్జెట్ రాగానే బిల్డింగ్ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు కిషన్, శ్రీను, సూర్య నాయక్, కృష్ణ ,ముత్యాలు బుజ్జి సక్రి ,పిప్లి, బాయి, తారి బాయి, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రే ముగింపు.. సమస్యల పై పోరాటం కాదు



- అమ్మాయిలకు రక్షణ కల్పించాలి
- పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజ్ రియాంబర్స్ మెంట్స్ విడుదల చేయాలి
- హైదరాబాద్‌లో సంక్షేమ హాస్టల్స్ సంఖ్య పెంచాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి మహాపాదయాత్ర ముగింపు సభ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, అభివృద్ధి చేసి ప్రభుత్వ విద్యారంగాని పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ సిటి కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థలలో 3 రోజుల పాటు జరిగిన మహా పాదయాత్రలో భాగంగా గవ్నమెంట్ హాస్టల్స్ గవ్నమెంట్ పాఠశాలలు కళాశాలల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం సికింద్రాబాద్ మహీంద్రా హిల్స్ బాయ్స్ హాస్టల్ నుంచి జూబ్లీహిల్స్ నట్కో స్కూల్ నుంచి బొరండ గురుకుల బాయ్స్ జూనియర్ కాలేజి సందర్శించి తదనంతరం గురుకుల మహిళా జూనియర్ కాలేజిలో మహా పాదయాత్ర ముగింపు సభ నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా అధ్యక్షతన జరిగిన సభలో నాగరాజు మాట్లడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్ స్కాలర్ షిప్స్ రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయలేదని, 4 ఏండ్ల నుంచి ఈ సమస్యలు పరిష్కారం చేయకపోవడం మూలంగా ఎంతోమంది విద్యార్థులు తీవ్రంగా చదువులు నష్టపోతున్నారన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, కళాశాలలో పాత భవనాల్లో నడుస్తున్నాయని ఇరుకు గదుల్లో చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉంటే ఒక్క కళాశాలలో కూడ పాఠ్యపుస్తకాలు ఇప్పటికీ పంపిణి చేయలేదని,యూనిఫామ్ ఇవ్వలేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న కనీసం హెల్త్ చెకప్ కూడా నిర్వహించడం లేదన్నారు. హైదరాబాద్ లాంటి మహా నగరంలో హస్టల్స్ అవసరం ఎక్కువ ఉన్నా వాటిని ఇవ్వడం లేదు, ఉన్న బిల్డింగ్స్‌లో సమస్యలు తారాస్థాయికి చేరాయన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కారం చేసి నిధులను ఇచ్చి ప్రభుత్వ విద్యారంగాని పరిరక్షించాలని కోరారు.

హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా మాట్లడుతూ హైదరాబాద్ ఉమెన్ యూనివర్శిటీకి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, యూనివర్శిటీ ప్రకటించిన నిధులు ఇవ్వలేదన్నారు. తక్షణమే రూ. 100 కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్డినరీ బస్సు పాసులను కూడా మెట్రో బస్సులలో అనుమతించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా గర్ల్స్ కమిటి మెంబర్ కవిత మాట్లడుతూ పాదయాత్ర ముగిసిందని ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్, యాత్ర రథ సారథి అశోక్ రెడ్డి, యాత్రబృందం నాయకులు జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, నాయకులు పవిత్ర, కవిత, చరణ్ శ్రీ , సంధ్య, నాగేందర్, స్టాలిన్, సునీల్, ప్రశాంత్,సచిన్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



26 నుంచి జాతీయ సంగీత నాట్య పోటీలు



నవతెలంగాణ-కల్చరల్

గత 47 సంవత్సరలుగా నవ్య నాటక సమితి నిర్వహణ లో జాతీయ సంగీత నృత్య పోటీలు హైదరాబాద్ నగరం లో నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో నే 48వ పోటీలు ఈ నెల 26 నుంచి ఆరంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు మాసబ్ టాంక్ వద్దనున్న ప్రభుత్వసలహాదారు డాక్టర్ కే.వీ.రమణ నివాస కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో ముఖ్య భాగమైన నాట్యం సంగీతం లను పరిపుష్టం చేసేందుకు యువ తరాన్ని కళల వైపు ప్రోత్సహించేందుకు నవ్య నాటక సమితి స్థాపించి వేమరాజు నరసింహారావు జాతీయ స్థాయిలో సంగీత నృత్య పోటీలు ఆరంభించారన్నారు. ఆ పరంపరను ఆయన కుమారుడు విజయ కుమార్ కొనసాగించటం అభినందనీయం అన్నారు. నవ్య నాటక సమితి ప్రతినిధులు వసుంధర, సుధామాలలు మాట్లాడుతూ సంగీతం లో వాయిద్య సంగీతం, హిందూస్తానీ, కర్ణాటక గాత్ర సంగీతం, నాట్యం విభాగం లో కూచిపూడి, భరతనాట్యం, కథక్ లలో సబ్ జూనియర్ జూనియర్ సీనియర్ తరగతుల వారీగా పోటీలకు దరఖాస్తులు వచ్చాయని మొత్తం దేశం లోని పలు రాష్ట్రాల నుంచి మొత్తం 400 మంది పాల్గొంటున్నారని తెలిపారు.సంస్థ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ పోటీల ప్రారంభ కార్యక్రమం తెలంగాణా సారస్వత పరిషత్ లో విఖ్యాత నాట్య కళాకారిణి పద్మ భూషణ్.స్వప్న సుందరి చే ఆరంభ మవుతాయని తెలిపారు నృత్య పోటీలు సారస్వత పరిషత్ లోనూ సంగీత పోటీలు సుల్తాన్ బజార్ లోని శ్రీ కృష్ణ దేవరాయ తెలుగుభాషా నిలయంలో జరుగుతాయన్నారు. సమావేశం లో నాట్య గురువులు మధుమతి, లక్ష్మీ మానస,స్నేహ, రాజ కుమార్ పాల్గొన్నారు

'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు'పై చర్చ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరానికి చెందిన మెడికవర్ హాస్పిటల్స్ వారు శనివారం నగరంలో ఫైర్ సైడ్ చాట్ ఈవెంట్‌ను నిర్వహించింది. "పని స్థలంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013" అనే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాటాడారు. ఈ చట్టానికి సంబంధించిన సవాళ్లపై వారి ఆలోచనలు, అనుభవాలను పంచుకున్నారు. అతిథులు చట్టం ప్రభావం, ఈ కాలంలో తెచ్చిన సానుకూల ఫలితాల గురించి సుదీర్ఘంగా చర్చించారు, వివిధ కారణాలపై, విభిన్న పరిస్థితులపై చట్టం అమలుకు సంబంధించిన సంక్లిష్టతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే లక్ష్యంతో ఈ చట్టం 2013లో అమల్లోకి వచ్చింది. మహిళలు మరింత ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో, సురక్షితంగా భావించి కార్యాలయంలో తమ విధులను నిర్వర్తించాలనే అంతిమ లక్ష్యంతో, బలమైన రక్షణలు, ఫిర్యాదుల పరిష్కారాలను చేర్చాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి మాట్లాడుతూ లింగ వివక్ష నిర్మూలన చట్టం లక్ష్యాల్లో ఒకటన్నారు. "విశాఖ, అదర్స్ వర్సెస్ రాజస్థాన్ రాష్ట్రం లాగే తీర్పు తర్వాత మాత్రమే చట్టాలు, మార్గదర్శకాలు రూపొందించబడ్డాయి' అని తెలిపారు. చట్టం సానుకూల అంశం సమానంగా సమతుల్యంగా ఉంటుందని, తప్పుడు ఆరోపణకు గురైన వ్యక్తుల ప్రయోజనాల కోసం రక్షణలను కలిగి ఉంటుంది. చట్టం సమగ్రంగా ఉన్నప్పటికీ ఇంకా కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశంపై కూడా ఆయన మాట్లాడారు. "పట్టణ ప్రాంతాల్లో, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల్లో, క్విడ్ ప్రోకో సాధారణం. ఏదేమైనప్పటికీ, గ్రామీణ ప్రకృతి దృశ్యం వ్యవసాయ రంగంలో ప్రతికూల వాతావరణం భద్రతా సమస్యలను సృష్టించగలదు, అవి తొలగించబడే అవకాశం ఉంది, ఎందుకంటే స్థానిక సమ్మతి కమిటీలు ఉనికిలో లేవు. చాలా అసంఘటిత రంగాల్లో, ఒక రంగం అనధికారిక స్వభావం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది, ఎందుకంటే బాధితులు ఉద్యోగ నష్టం, ప్రతికూల వాతావరణానికి భయపడి ఫిర్యాదులు చేయడానికి విముఖత చూపుతారు" అని తెలిపారు.

తక్షణమే శంకర్ వర్మపై చర్యల తీసుకోవాలి



- డాక్టర్ ముజీబ్
- రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా

నవతెలంగాణ- సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్) నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు. అసెంబ్లీ బిల్డింగ్స్ డివిజన్ ఉద్యోగులను, మరి ముఖ్యంగా మహిళా ఉద్యోగులను వేధిస్తున్న శంకర్ వర్మ అనే సూపరింటెండెంట్ పై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శంకర్ వర్మ వేరే డివిజన్ లో ఉద్యోగిగా ఉండి అక్కడ పని చేయకుండా అసెంబ్లీ డివిజన్ లో కూర్చుంటూ మహిళా ఉద్యోగులతో అసభ్యంగా మాట్లాడుతున్నాడని, మిగితా ఉద్యోగులను వేధిస్తున్నాడని కార్యాలయ విషయాలలో తలదూరుస్తూ అతనికి సంబంధం లేని ఫైల్స్ లో తనకు కావలసిన విధముగా మార్పులు చేయిస్తున్నాడని, ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసారు. అనంతరం జిల్లా కార్యవర్గం తో కలసి పర్యవేక్షక ఇంజనీర్ హఫీజుద్దీన్‌ను కలిసి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. తక్షణమే శంకర్ వర్మ పై చర్యలు తీసుకోనట్టయితే జిల్లా సంఘం పక్షాన తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ విషయములో వెనుకకు తగ్గేది లేదని స్పష్టం చేశారు. అందుకు హఫీజుద్దీన్ మాట్లాడుతూ శంకర్ వర్మ పై గతంలో తనకు ఫిర్యాదులు అందాయని, ఇప్పుడు కూడా తీవ్రమైన అభియోగాలు అందాయన్నారు. ఈ విషయంలో శాఖాపరమైన విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, కోశాధికారి బాలరాజ్ , సహాధ్యక్షుడు కే ఆర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు వైదిక్ శస్త్ర, బొల్లిగిద్ద శంకర్, శ్రీధర్, ముఖీమ్, ఫోరమ్ అధ్యక్షా కార్యదర్శులు జనార్దన్, పూర్ణ చందర్, యూనిట్ అధ్యక్షురాలు లలిత రాణి, కార్యదర్శి మురారిచ సహాధ్యక్షుడు సలీం, వివిధ యూనిట్ అధ్యక్షా కార్యదర్శులు ఇబ్రహీం, జలీల్, తూముకుంట రాజు, సుధీర్, ఉల్లా పాల్, రామరాజు తదితరులు పాల్గొన్నారు

అధికారులకు పారిశుధ్య సమస్య పట్టదా..?

- మాజీ కార్పొరేటర్ సహదేవ యాదవ్



నవతెలంగాణ-సంతోష్ నగర్

యాకుత్ పురా నియోజకవర్గం కుర్మాగూడ డివిజన్ పరిధిలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద పారిశుధ్యం అధ్వానంగా మారిందని, నిత్యం అంతర్గత అక్కడక్కడ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని డివిజన్ మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ అన్నారు. ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మోహన్ కృష్ణ, ఏతఃఅన్సారి తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తుంటే మరో పక్క డివిజన్ల పరిధిలో అందుకు భిన్నంగా మురుగు, చెత్త రహదారులపై దర్శనమిస్తున్నాయన్నారు.. మురుగు ప్రవాహం వల్ల దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు వ్యాధుల బారి నపడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.. అధికారులు పర్యవేక్షణ లేక డ్రయినేజీ లోని పూడిక ను పారిశుధ్య సిబ్బంది సరైన సమయంలో తొలగించం "పోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు, పారిశుధ్య సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

మ్యాన్ హోల్లలో చెత్తా చెదారం సకాలంలో తొలగించకపోవడం వల్ల తరచూ మురుగు లీకై రోడ్లపై అధికంగా ప్రవహిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. వ్యర్థాలను తీసి రోడ్లపై కుప్పలుగా వేసి తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీసిన సిల్ట్ను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దోమల నివారణకు బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ నిర్వహించడంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి కాలనీలో ఎక్కడైతే చెట్లు ఉన్నాయి ఎక్కడైతే గడ్డి పెరిగింది అక్కడ ఓ 10 నిమిషాలు ఆగి ఫాగింగ్ చేస్తే బాగుంటుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫాగింగ్ నిర్వహణ సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

శివాజీ జయంతి ఉత్సవ కమిటీ దేశ పర్యటన



నవతెలంగాణ-బేగంపేట్

దేశవ్యాప్తంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మరాఠా మండల్ అధ్యక్షుడు ప్రకాష్ పాటి ల్ అబి ప్రాయపడ్డారు. శివాజీ జయంతి ఉత్సవ సమితి అధ్యక్షుడు, ముంబయి జీఎస్టీ సహాయ కమీషనర్ సునీల్ జగ్దాలే నేతృత్వంలో 240 మంది సభ్యులు దేశ పర్యటనలో భాగంగా నగరానికి వచ్చినట్లు తెలిపారు. సికింద్రా బాద్‌లో వారికి అభినందన సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ పర్యటించిన ప్రాంతాలలో శివాజీ జయంతి ఉత్సవ కమిటీ పర్యటిస్తుందని, ఆ పర్యటనలో భాగంగా వచ్చిన వారికి హృద యపూర్వక స్వాగతం పలికారు. సికింద్రాబాద్ గోల్డ్ రిఫైనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ పాటీల్, శివాజీ జయంతి ఉత్సవ సమితి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఉన్మేష్ జాదవ్, కార్యదర్శి మంగేష్ సాయిల్ కోశాధికారి హేమంత్ కేదారి తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రతి ఒక్క పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఆ హక్కులను పొందాలంటే ఓటు హక్కును వినియోగించుకోవాలని శనివారం కేబీఆర్ పార్కు ప్రధాన రహదారి వద్ద ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ దత్తాత్రేయ ఐఏఎస్ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేబీఆర్ పార్కు ప్రధాన రహదారి నుండి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు కొనసాగింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతి యువకుడు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని రాజ్యాంగం ఇచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకోవడానికి ఉన్న ఏకైక మార్గం ఓటు హక్కును అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ అన్ని శాఖల అధికారులు కేబీఆర్ పార్క్ అధికారులు ఎన్నికల ప్రక్రియ కొనసాగిస్తున్న అధికారులు తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- యునైటెడ్ మెడికల్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నగర అధ్యక్షులు కుమారస్వామి



నవతెలంగాణ-అడక్‌మెట్

రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ధర్నాలు, నిరసనలు చేస్తుంటే మరో పక్క ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్షలు రాసి రెగ్యులర్ ఉద్యోగంలోకి తీసుకోవాలని చూడటం అన్యాయమని యునైటెడ్ మెడికల్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నగర అధ్యక్షులు కుమారస్వామి అన్నారు.గత 5రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్క్ వద్ద ఏఎన్ఎంలు మోకాళ్ళ మీద నిరసన తెలియజేశారు. ఈ ధర్నాకు హాజరైన యూనియన్ నగర అధ్యక్షులు కుమారస్వామి హాజరైఊ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ వీరిని రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, కొత్తగా నోటిఫికేషన్ రద్దుచేసి కాంట్రాక్టు ఏఎన్ఎం లను వెంటనే ప్రభుత్వం బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు.రాష్ట్రంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలు సమ్మె ద్వారా తమ నిరసన తెలుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రభుత్వ కార్యక్రమాలు వైద్యారోగ్య శాఖలో పలు సేవలు నిలిచిపోయినట్లు, ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతున్నామన్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీ యూ) నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నగర నాయ కులు రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజీ, విజయ, ప్రణయశీల తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్‌తో ఏఎన్ఎంల చర్చలు విఫలం



- డీహెచ్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా
- సమస్య తీరే దాకా సమ్మె విరమించేది లేదు
- ఏఐటియుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు ప్రకటన

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలందరిని భేషరతుగా రెగ్యులర్ చేయాలని గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏఎన్ఎంల ప్రతినిధి బృందంతో తెలంగాణ ప్రజాఆరోగ్య సంచాలకులు (డీహెచ్) డాక్టర్ శ్రీనివాసరావుతో జరిగిన చర్చలు నిర్వహించినట్లు, అవి విఫలమైనట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు వెల్లడించారు. బేషరతుగా రెగ్యులర్ చేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తుండగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు వారి డిమాండ్లన్నిటిని అలసత్వం చేస్తున్నారన్నారు. నోటిఫికేషన్ వద్దని రెగ్యురేషన్ కావాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తుంటే నోటిఫికేషన్‌లో కొన్ని సవరణలు చేసి మళ్లీ విడుదల చేస్తామని అనడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో జీవో నెంబర్ 16 అనుసరించి ఎంతోమంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ మాట్లాడుతూ.. నోటిఫికేషన్ విషయంలో ఏఎన్ఎంలకు అభ్యంతరాలు ఉన్నాయన్నారు. గతంలో జరిగిన పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు వారు గుర్తించారని అందువల్లే వారు గట్టిగా నోటిఫికేషను రద్దు కోసం పోరాటం చేస్తున్నారన్నారు. హైకోర్టు వద్దని ఆదేశాలు జారీ చేసిన రాత్రికి రాత్రే నియామక పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం ఏఎన్ఎంలకు కూడా అదేవిధంగా నియామక పత్రాలను ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని యెడల రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్య దర్శి గాండ్ల మధురిమా, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్ విజయకుమారి, రాష్ట్ర నాయకురాలు జక్కుల పద్మ, అరుణ, సువర్ణ, కే తిరుపతమ్మ, ఏ గుణవతి, కే లలిత, పెర్సీ, నాగమని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు వినియోగించుకోవాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బేగంపేట్ ప్రకాష్ నగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర



నవతెలంగాణ-బేగంపేట్

ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలు ఉపయోగించుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా శనివారం బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో కలిసి ఆయన పర్యటించారు. బస్తీలు, కాలనీలు తిరుగుతూ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కించాలని ఆదేశించారు. పలు చోట్ల వర్షం నీరు రోడ్డుపైనే నిలు స్తుందని, డ్రయినేజీ మురుగు దుర్వాసన వస్తుందని ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదు చేయగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత కొద్ది సంవత్సరాలుగా నివాసముంటున్న ప్రకాష్‌నగర్ ఎక్స్టె న్షన్‌లో నివసిస్తున్న నివాసితులకు త్వరలో రిజిస్ట్రేషన్ అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్, సెక్రెటరీ నరేష్, బీఆర్ఎస్ నాయకులు అరిఫ్, విశాల్ సూదం,పద్మా రెడ్డి,తాళ్ల రాజయ్య,పాటిగడ్డ గిరి, శ్రీనివాస్, పాండు, గోవింద్, సత్యనారాయణ, సురేష్, యాదయ్యా, కరుణాకర్, రాజేందర్ ముదిరాజ్, సాయిలు,కేవిఆర్ రాజు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం : మర్రి ఆదిత్యరెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ ప్రజల సమస్యలు పరిష్కరించడమే ఏకైక లక్ష్యమని ఎంసీఆర్ఎఫ్ ఛైర్మెన్, టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. పద్మారావు నగర్ పరిధిలోని హామాలీబస్తీలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. చిన్నారులకు కావాల్సిన పుస్తకాలు, కుర్చీలు, ఇతర సామాగ్రిని రాజకీయాలకు అతీతంగా ఫౌండేషన్ తరపున అందజేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుడైన ఓ విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందిం చేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

కేటీఆర్‌కి సెల్ఫీ సవాల్ : హమాలీ బస్తీలో డబుల్ బెడ్రూం ఇళ్ల కట్టిస్తామని కేటీఆర్ ప్రజలను మోసం చేశాడని ఆదిత్యరెడ్డి అన్నారు. 2015లో మంత్రి తలసానితో కలిసి ప్రారంభించిన శిలా ఫలకం వద్ద సెల్ఫీ తీసుకొని సవాల్ విసిరారు. పేదలకు ఇండ్లు కట్టిస్తామని మాయమాటలు చెప్పిన బీఆర్ఎస్‌కి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బసవరాజు, రాజు, ఎన్.విఠల్, వేద్ ప్రకాశ్, శివలాల్, వెంకటేశ్,కృష్ణా, నరేశ్, నర్సింగ్ రావు, ప్రసన్న, నరేశ్, శ్రీను, కాశీ పాల్గొన్నారు.

శవ రాజకీయాలు వద్దు

- అసత్య ప్రచారాలు మానుకోవాలి
- ఎంపీపీ కొండ శంకర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మంథని మధుకర్ మరణంపై రాజకీయాలు మానుకోవాలని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎన్నికలు రాగానే అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలి కారు. మంథిని మధుకర్ మాదిగ బిడ్డ కావడం వల్లే 7 సంవత్సరాలైనా ఇంతవరకు న్యాయం జరగడం లేదని, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఈ ఘటన వెనుక ఉన్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోసేమంతుల ఓదులు,శంకర్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తరగం శంకర్‌లాల్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లోజు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో మూల్యాంకన సంస్కరణలు



నవతెలంగాణ-ఓయూ

విశ్వవిద్యాలయ మూల్యాంకన పద్ధతుల్లో సంస్కరణలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సమాయాత్తమవుతోందని, ఇందు కోసం యూనివర్శిటీ క్యాంపస్, అనుబంధ కళాశాలల అధ్యా పకులతో సంప్రదింపులు జరుపుతోందని వీసీ.ప్రొ.రవీందర్ తెలిపారు. నూతన మూల్యాంకనా పద్ధతులకు అవసరమైన సూచనలు, సలహాలను స్వీకరిస్తోందని, ఇప్పటికే సైన్స్ కళాశాలలోని వివిధ విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు పూర్తయ్యాయని, తాజాగా ఆర్ట్స్ కళాశాలలో ఆర్ట్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్ మెంట్ ఫ్యాకల్టీలకు చెందిన ప్రొఫెసర్లతో మేధోమధన సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్యలో మూల్యాంకన లోపాలను సరిదిద్దేందుకు అధ్యాపకులు అవసరమైన ఆలోచనలను పంచుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యవస్థలను పటిష్టం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మూల్యాంకన సంస్కరణలపై సమగ్ర సమీక్ష అవసరమని అభిప్రాయపడ్డారు. మూల్యాంకన ప్రక్రియను సవరించడానికి 2019 యూజీసీ నిబంధనల సిఫార్సులను ఆచరణలో పెట్టా ల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

మూల్యాంకన సంస్కరణలకు అధ్యాపకులు సహకరించాలని, సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో మూల్యాంకన వ్యవస్థపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అభ్యర్థన మేరకు హైదరాబాద్ ఎస్ఐబీ ఇచ్చిన నివేదికను ప్రొ.రవిందర్ ప్రస్తావించారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం మన విద్యా వ్యవస్థ 4.0 నుంచి 5.0కు మారాలని, ఇందుకోసం అధ్యా పకుల వైఖరి కూడా అందుకు అనుగుణంగా, విద్యారంగంలో ఫ్లెక్సి బిలిడి, యాక్సెస్, ఈక్విటీలు కూడా ఎన్ఈపీ సూత్రాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఉపాధ్యాయ- కంద్రీకృత విధానం నుండి విద్యా ర్థి-కేంద్రీకృత విధానానికి మార్పు జరగబోతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వ్యవస్థ ఆవిష్కరణలు, ఆచరణాత్మక నైపుణ్యాలకు ప్రతిబంధకంగా ఉందని అభిప్రాయపడ్డారు. సామాజిక శాస్త్రాల విభాగం డీన్ ప్రొఫెసర్ కె. స్టీవెన్సన్, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ఈఎంఆర్సీ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.మృణాళిని, ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రవీంద్ర నాథ్ కె. మూర్తి, విద్యాశాఖ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఎం.గంగాధర్, మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వెంక టయ్యలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఆయా విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మారేడుపల్లి మండలం మెట్టుగూడ డివిజన్‌కి చెందిన మను సాహు లబ్దిదారునికి, మహమూద్ గూడా ప్రాంతానికి చాందిన జాహీట్ ఉన్నిస బేగం కళ్యాణ లక్ష్మి షాదీముబారాక్ చెక్కులను శనివారం సితాఫలమండీలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు.ఈకార్యక్రమంలో కార్పొరేటర్ కుమారి సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొలువుదీరిన టీఎఎస్ నూతన కార్యవర్గం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఎఎస్), నూతన కార్య వర్గం బాధ్యతల శనివారం స్వీక రిం చారు. అధ్యక్షుడుగా మాజీ సీసీఎంబీ డైరెక్టర్ డా.సిహెచ్.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఓయూ మాజీ వీసీ ప్రొ.ఎస్. సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా డా.జి.భానుప్రకాష్‌రెడ్డి, ప్రొ.సంజీవ రెడ్డి, సెక్రటరీగా ప్రొ.వి. రవీందర్, జాయింట్ సెక్రటరీగా ప్రొ.ఎస్.యం.రెడ్డి, గౌరవ ట్రెజరర్‌గా ప్రొ.ఎ.రామ చంద్రయ్యతో పాటుగా ఈసీ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అధ్య క్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రొ.సత్యనారాయణ మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్రంలో సైన్సెస్ ఉన్నతికి కృషి చేస్తామని, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలో చనలు పెంపొందించి పరిశోధన జరపడానికి తోడ్పాటు ఇస్తామన్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత

- నాంపల్లి రైల్వే ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో శని వారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిం చారు. దీనిలో భాగంగా అనుమా నస్పందంగా ఉన్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 50 కిలోల గంజాయి ఉన్నట్లు దానిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ తెలిపారు. శనివారం రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ షేక్ సలీ మా ఐపీఎస్ ఆదేశాల మేరకు నాంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో రైలను తనిఖీ నిర్వహిస్తుండగా లింగంపల్లి వద్ద భువనేశ్వర్ టు ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు భోగి నెంబర్ ఎస్-7 కోచ్‌లో తనిఖీ చేస్తుండగా ఓవ్యక్తి తనిఖీ చేసినట్లుగా ఆ వ్యక్తి దగ్గర రెండు సూట్ కేసుల్లో అ గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుని అరెస్ట్‌చేసి, రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు తదితరులు పాల్గొన్నారు

పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

-ఆర్‌బీఎస్ కే డాక్టర్ రవికాంత్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పానీపూర క్లస్టర్ టీం వన్ ఆర్‌బీఎస్ కే.డాక్టర్ రవి కాంత్ అన్నారు. శనివారం బేగంబజార్‌లో ఆయన మాట్లాడుతూ పానీపూర క్లస్టర్ పరిలోని ప్రభుత్వ స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు స్క్రీనింగ్ టెస్ట్, అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామన్నారు. పిల్లలకు బలమైన ఆహారం అందించాలని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం మందులను అందిస్తున్నామన్నారు. పిల్లలకు గుండె జబ్బులు ఇతర వ్యాధులు ఉన్న మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యం ఉండేలా ప్రయత్నం చేస్తున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మసిర, ఫార్మసిస్ట్ సునంద, ఏఎన్ఎం రేబెకా తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ డబ్బా ఓపెన్ చేస్తుండగా పేలుడు

- సిరాజుద్దీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు పరిస్థితి విషమం



నవతెలంగాణ-అడక్‌మెట్

కెమికల్ డబ్బా ఓపెన్ చేస్తు ండగా భారీ పేలుడు సంభవించ డంతో స్క్రాప్ బిజినెస్ చేస్తున్న సిరాజుద్దీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయా లైన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీబీ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోలక్ పూర్ డివిజన్ అంజుమన్ సొసైటీలో సిరాజుద్దీన్ అనే వ్యక్తి మూడు నెలలుగా స్క్రాబ్ వ్యాపారం చేస్తు న్నాడు. రోజు విధంగానే స్క్రాబ్ షాప్‌లో మెలబెడి నమ్ అనే చిన్న కెమికల్ డబ్బా ఓపెన్ చేస్తుండగా భారీ పేలుడు సంభ వించింది. దీనితో సిరాజుద్దీన్ శరీరం పూర్తిగా కాలి గాలపాలయ్యాడు. పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సిరాజుద్దీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అంజుమన్ సొసైటీకి చెందిన స్క్రాబ్ షాపుల్లో ప్రమాదకరంగా ఉన్న కెమికల్ డబ్బాలను ఓపెన్ చేయవద్దని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్క్రాప్ దుకాణం దారులకు సూచించినట్లు తెలిపారు.

నగరవాసి కౌటికె విఠల్‌కు అరుదైన గౌరవం

- ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఇండియన్ టీంకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక



నవతెలంగాణ-బంజారాహిల్స్

నగరవాసి ఎల్ఐసీలోనెం.1 చీఫ్‌లైఫ్ ఇన్సూరెన్సు అడ్వైసర్ కౌటికె విఠల్‌కు అరుదైన గౌరవం లభించింది. అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రమోట్ చేస్తున్న ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీమ్ ఇండియాకు ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారని అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ డాక్టర్ సందీప్ చౌదరి వెల్లడించారు. ఈ సందర్భంగా విఠల్ 20న నగరంలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌కు చీఫ్‌గెస్ట్‌గా హాజరవుతారన్నారు. మలేషియాలో ఈ ఏడాది అక్టోబర్ 23 నుంచి జరగనున్న ఆసియన్ చాంపియన్ షిప్‌లో ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీంకు ప్రత్యేక అతిథిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారని, నెదర్లాండ్స్‌లో నవంబర్-డిసెంబర్ మాసాల్లో జరగనున్న అంతర్జాతీయ చాంపియన్ షిప్‌లో ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీంకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఇటీవల నియామక పత్రాన్ని అందుకున్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి



- పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని నిజాం కళాశాలలో నిరసన, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నిజాం కళాశాల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పవిత్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.6 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని , అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థి సంఘాలు, జర్నలిస్టులను రావద్దు అనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు నవీన్, భీమ్ సేన్, సాయి ప్రసాద్, అనిల్, సంజయ్, జాన్సన్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ రాక్షస దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలి

- ప్రగతిశీల మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కే.లలిత



నవతెలంగాణ-అడిక్‌మెట్

సమాజంలో మహిళలపై మనువాద రాజకీయ రాక్షస దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని ప్రగతిశీల మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కే.లలిత పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం అర్ధ శతాబ్ద వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ శతాబ్ది వారోత్సవాలకు జేఎన్‌యు ప్రొఫెసర్ నివేదిత మీనన్, లలిత హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలతో రాజ్యాంగ స్ఫూర్తిని బలహీనపరుస్తూ కార్పొరేటీకరణ కోసం పనిచేస్తుందన్నారు. నేటికీ సమాజంలో మహిళలపై హత్యలు అత్యాచారాలు రోజువారి కార్యక్రమాలుగా జరుగుతున్నాయన్నారు. బంగారు తెలంగాణ హామీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాష్ట్రంలో మద్యం తో విచ్చల విడతనం చేస్తూ కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. నేటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రగతిశీల మహిళా సంఘం తోపాటు ఇతర మహిళా సంఘాలు కలిసి ముందుకు రావాలని, నియంతృత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. నాడు మహిళా సంఘాలన్నీ ఒకే వేదికపై ద్వారా పోరాటాలు చేసాం నేడు అన్ని సంఘాలు కలవాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. యూనిఫామ్‌కి సివిల్‌కోడ్, ఫాసిజంలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను మట్టు పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు అంబికా, సంధ్య కే.సంధ్య, విమలక్క, అరుణ, అనసూయ, పుష్ప, కావేరి, స్వరూప, శిరోమణి, సరళ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్


వివిధ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఒక లక్ష 50 వేల మంది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగుల వలె అన్ని అర్హతలు ఉన్నాయ న్నారు. పోస్టులకు తగు విద్యార్హత ఉందని, నోటిఫికేషన్ ద్వారా మెరిట్ కం రోస్టర్ ద్వారా ఎంపిక చేశారని వేరే ఉద్యోగాలను వదులుకొని వచ్చారని తెలి పారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని వీరిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాలలో ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేశారని ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రమేష్, ఏసుదాసు, కిరణ్, పూర్ణ, వెంకటేష్, వేముల రామకృష్ణ, రాజకుమార్, దీపిక బిల్లా, బిసి వెంకట్, అరవింద పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకను శనివారం ఘనంగా నిర్వహించుకు న్నారు. ఈ సందర్భంగా సికింద్రా బాద్ పార్లమెంట్ ఖైరతాబాద్ నియోజవర్గం తెలు గుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ బాలాజీ గోస్వామి జూబ్లీహిల్స్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎం.నర్సింలు, ఆటో సలీం, షేక్ సలీంలు ఎన్టీఆర్ టెస్ట్ భవన్‌లో కలిసి పూలమాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



హింసకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళా శ్రామికులు



ప్రపంచంలోనే చైనా తర్వాత టీని ఉత్పత్తి చేస్తున్న దేశం మనదే. మన దగ్గర అస్సాం, డార్జిలింగ్ టీకి ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు. 200 ఏండ్ల నాటి చరిత్ర కలిగిన మన తేయాకు పరిశ్రమలో దాదాపు 80శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. అయితే శ్రామికశక్తిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ సాధికారతకు మాత్రం బహుదూరంగా ఉన్నారు. రెండేండ్ల కిందట IDH-ది సస్టైనబుల్ ట్రేడ్ ఇనిషియేటివ్ అనే సంస్థ తేయాకు తోటల్లో మహిళా కార్మికుల స్థితిని నిశితంగా పరిశీలించింది. ఆ పరిశోధనా వివరాలేంటో మనమూ తెలుసుకుందాం... ఏ తోటలోనూ మహిళా మేనేజర్ కానీ, ఫిర్యాదు అధికారి కానీ లేరని ఈ పరిశోధనలో తేలింది.

"చాలా తోటల్లో అంతర్గత కమిటీలు (IC) POSH (లైంగిక వేధింపుల నుండి మహిళల రక్షణ) చట్ట మార్గదర్శకాల ప్రకారం ఏర్పడలేదు. అయితే ప్రస్తుతం అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడులోని 350 తేయాకు తోటలలో 80శాతం కంటే ఎక్కువ మహిళా అధ్యక్షురాలు పనిచేస్తున్న అంతర్గత కమిటీలు ఉన్నాయి" అని IDH వారి ఉమెన్స్ సేఫ్టీ యాక్సిలరేటర్ ఫండ్ (WSAF) మేనేజర్ మనీషా మజుందార్ చెప్పారు. అస్సాం అంతటా 29 టీ ఎస్టేట్‌లలో లింగ వివక్షపై అవగాహనా కల్పించేందుకు 2021లో ప్రారంభించబడిన WSAF ద్వారానే ఇది సాధ్యమైంది. WSAF అనేది మహిళల భద్రతపై దృష్టి పెడుతుంది. టీ పరిశ్రమలో పని చేస్తున్న మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్న ప్రైవేట్ సంస్థ ఇది.

WSAF అవసరం

IDH ప్రకారం తేయాకు ఉత్పత్తిలో మహిళల అనివార్య పాత్ర ఉన్నప్పటికీ వారి పని పరిస్థితులు మాత్రం భయంకరంగా ఉన్నాయి. ఉదాహరణకు అస్సాంలోని టీ ఎస్టేట్‌లలో ప్రసూతి మరణాల రేటు కొంత వరకు మెరుగు పడినప్పటికీ, ఇవి ఇప్పటికీ భారతదేశంలోనే అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోని టీ తోట మహిళా కార్మికులలో బాల్య వివాహాలు, అక్రమ రవాణా, ప్రసూతి మరణాలు, వివిధ రకాల వివక్ష, హింస స్పష్టంగా కనిపిస్తున్నాయని IDH పరిశోధన చూపిస్తుంది. "టీ కమ్యూనిటీలో ముఖ్యంగా అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల మహిళల సమస్యలకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చాలా మంది మహిళలు, వారి కుటుంబాలతో తోటల చుట్టూ నివసిస్తుంటారు. వారి పని స్థలానికి, నివాస స్థలానికి మధ్య రేఖ చాలా సన్నగా ఉంటుంది. అందుకే సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి" అని మనీషా అంటున్నారు. అందుకే WSAF మొత్తం టీ రంగంలోని మహిళా శ్రామికశక్తికి సురక్షితమైన పని పరిస్థితులు కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

అవగాహన కల్పించేందుకు

టీ ఎస్టేట్‌లో సాధారణంగా ఆఫీస్, వర్కర్ కాలనీలు ఉంటాయి. ఇవి నగరాలకు చాలా దూరంగా ఉంటాయి. దాంతో స్థానిక పాలనతో వారికి ఎలాంటి సంబంధం ఉండదు. దాంతో హక్కులు, ప్రభుత్వ కల్పించే సౌకర్యాల గురించి వారికి ఎటువంటి అవగాహన లేదు. ఈ సమస్యలను మేము పరిష్కరించాలనుకుంటున్నాం" అని మనీషా చెప్పారు. వీరి ప్రయత్నంలో భాగంగా హింసకు వ్యతిరేకంగా సమాజంలో అవగాహన కల్పించడానికి వీధి నాటకాలలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. నిర్దిష్ట సమస్యల కోసం ఏ అధికారిని సంప్రదించాలి, ఫిర్యాదులు ఎలా ఇవ్వాలి వంటి విషయాల గురించి వారికి తెలియజేసారు. దీనికి సంబంధించిన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. మొత్తం ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించబడింది. స్టేక్‌హోల్డర్‌లను చేర్చుకోవడం ఈ ప్రోగ్రామ్‌లో అతి ముఖ్యమైనది. ఇది వివిధ స్థాయిలలో పని చేస్తుంది.

హింస చాలా రకాలు

అస్సాంలోని కనై గావ్‌లోని మొకల్‌బరి టీ ఎస్టేట్‌లోని మహిళా ఫ్లకర్స్ (గ్రూప్ నాయకురాలు సన్నీ ముండా మాట్లాడుతూ 'మహిళలపై జరుగుతున్న హింస కేవలం ఈవ్ టీజింగ్, వేధింపులతో ముగిసిపోదు. దీని ప్రభావం మా జీవితాలపై తీవ్రంగా ఉంటుంది. ఇందులో గృహ హింస, ఆర్థిక అభద్రత, దుర్భరమైన పని గంటలు, కనబడని యాజమాన్య వేధింపులు, పిల్లలపై లైంగిక వేధింపులు ఇలా ఎన్నో ఉన్నాయి. మహిళా కార్మికుల జీవితాల్లో ఇవన్నీ ఒక భాగం" అన్నారు. "మేము సంపాదించిన డబ్బును మా భర్తలు బలవంతంగా తీసుకొని మద్యానికి ఖర్చు చేస్తారు. దాంతో మా పిల్లలకు తిండి పెట్టలేక, పాఠశాలకు పంపలేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇది మా ఉత్పాదకతను కూడా ప్రభావితం చేస్తుంది" అని మోకల్‌బరి ఎస్టేట్‌లోని మరో మహిళా కార్మికురాలు సునీతా చవాసి చెప్పారు.

అప్పుడు.. ఇప్పుడు..

"మా మహిళల్లో చాలా మంది కార్యాలయాల్లో వేధింపులకు గురయ్యారు. అలాంటి వారిని మా మేనేజర్ కేవలం హెచ్చరించి వదిలేస్తారు. దీని వల్ల సమస్య మళ్ళీ పునరావృతం అవుతూనే ఉండేది" అని మనీషా చెప్పారు. "కానీ ఈ రోజు మా సమస్యలను మేనేజ్‌మెంట్ దృష్టికి మేము తక్షణమే తీసుకుపోగలుగుతున్నాం. మాకు సహాయం చేసే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్ళగలుగుతున్నాం. ఇప్పుడు ఏ సమస్యను ఎవరు పరిష్కరిస్తారో మాకు బాగా తెలిసింది. ఒకప్పుడు హింసను మా జీవితంలో ఒక భాగంగా భావించే వాళ్ళం. ఇప్పుడు పోరాటాలు మా రోజు వారి జీవితంలో భాగమయ్యాయి" అని చావాసి చెప్పారు.

ఫిర్యాదు సులభతరం చేయడానికి

సన్నీ వంటి వారికి ఫిర్యాదుల ప్రక్రియను సులభతరం చేయడానికి WSAF ప్రతి ఎస్టేట్‌లో స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చి తోటల మధ్య జెండర్ సెల్‌లను ఏర్పాటు చేసింది. అలాగే హక్కుల కోసం పని చేసే ఢిల్లీకి చెందిన సాక్షి అనే ఎన్‌జీఓ గత ఏడాది WSAF భాగస్వాములలో ఒకటిగా మారింది. ప్రస్తుతం సాక్షి పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడులోని 64 తేయాకు తోటలకు ఈ కార్యక్రమాన్ని తీసుకువెళ్లింది. 'హింసకు మూల కారణాలను, లింగవివక్షను అర్థం చేసుకోవడానికి మేము సమాజ్ నాయకులకు శిక్షణ ఇస్తాం. సంభాషణలు, వర్క్‌షాప్‌లు, రోల్ ప్లేలు, పాటలు, ప్రదర్శనలు వంటి వాటిని అవగాహన కోసం ఉపయోగి స్తాము. ప్రతి ఒక్కరినీ వారి హక్కుల గురించి తెలుసుకునేలా అన్ని రకాల హింసకు వ్యతిరేకంగా వారి స్వరాన్ని పెంచడానికి సన్నద్ధం చేయడమే WSAF లక్ష్యం" అని సాక్షి ప్రతినిధి భారతి అంటున్నారు.





– సలీమ



పిల్లలు తినకపోవడానికి కారణమేంటో...

ఎంతసేపు తింటావ్, సరిగా తినకపోతే బలమెలా వస్తుందంటూ తిట్టే తల్లులు కొందరు. మా పిల్లలు అస్సలు తినరండీ అంటూ కంప్లయింట్ చేసే తల్లులు ఇంకొందరు. తింటావా తన్నమంటావా అంటూ బెత్తం పట్టుకునే వాళ్ళు ఇంకొందరు. అయితే వీటన్నిటికంటే ముందు చేయాల్సింది ఇంకొకటుంది. బిడ్డ తినకపోవడానికి వెనుక కారణాన్ని వెతకడం. పిల్లలు తిండి తినకపోవడానికి ఆటల్లో పడిపోవడం ఒక్కటే కాదు... ఏదైనా పెద్ద కారణం ఉండొచ్చు. వాళ్లకేదైనా సమస్య ఉండివుండొచ్చు. కాబట్టి ఆ కోణంలో కూడా ఓసారి ఆలోచించమంటున్నారు పిల్లల నిపుణులు...

- పిల్లలు తిండి తినకపోవడానికి ఆరోగ్య సమస్యలు చాలాసార్లు కారణమవుతాయి. కాబట్టి వాళ్లకి అన్న వాహికలో ఏదైనా సమస్య ఉందా, హార్మోన్ల లోపాలేమైనా ఉన్నాయా, ఆకలి సంబంధింత సమస్యలేమైనా ఉన్నాయా, మలబద్ధకం ఉందా, అసిడిటీ ఏమైనా మొదలయ్యిందా, థైరాయిడ్ హార్మోన్లలో హెచ్చుతగ్గులేమైనా ఉన్నాయా, కాలేయ సమస్యలు కానీ కిడ్నీ సమస్యలు కానీ ఏమైనా ఉన్నాయా అన్నది తెలుసుకునే ప్రయత్నం చేయాలి. చిన్నపిల్లలకి ఈ సమస్యలా అనుకోకండి. మనకే కాదు... పిల్లలకీ చాలా ఇబ్బందులుంటాయి. అవి వాళ్ళు చెప్పలేరు. మనకి అర్థం కావు. అందుకే పిల్లలు తిండి తినకుండా మారాం చేస్తుంటే చిన్నతనం అని వదిలేయకుండా ఓసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లండి.
- ఇక శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలూ ఉంటాయి. మన మనసు బాగోకపోతే మనం తిండి తింటామా? అలాగే పిల్లలకూ ఉంటుంది. మనసులో ఏదైనా బెంగ, దిగులు, భయం ఉంటే వాళ్లకి కూడా తిండి సహించదు. కాబట్టి పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. వాళ్లతో మాట్లాడాలి. ఏమైంది అంటూ లాలించి వాళ్ల మనసులో మాటను తెలుసుకోవాలి. ఆ బెంగను, భయాన్ని దూరం చేయాలి. అప్పుడు బలవంతంగా తినిపించాల్సిన అవసరం ఉండదు. వాళ్లంతట వాళ్లే తినేస్తారు.
- ఈ కోణంలో ఆలోచించేవాళ్లు చాలా తక్కువమందే ఉంటారు. ఎందుకంటే చిన్నపిల్లలే కదా అని ఎక్కువ దూరం ఆలోచించకపోవడమే అసలు సమస్యకు కారణం. మీరు మాత్రం ఆ తప్పు చేయకండి. ఆటల్లో పడినా పిల్లలకు ఆకలి వేస్తుంది. కాస్త లేటయినా వచ్చి తినేస్తారు. కానీ ఎంతకీ తినడం లేదంటే వాళ్లకి సమస్య ఉన్నట్టే. దాన్ని కనిపెట్టాల్సిన బాధ్యత మీదే.

28 నుంచి దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

- సెప్టెంబర్ 5 వరకు వెబ్ఆప్షన్ల నమోదు
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 28 నుంచి ప్రారంభం కానుంది. శనివారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో దోస్త్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులందరూ ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులేననీ, వెబ్ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులు కొత్తగా చేసుకుని ఆప్షన్లను ఇవ్వాలని సూచించారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు వెబ్ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు (వికలాంగులు, సీఏపీ, ఎన్‌సీసీ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్) అభ్యర్థులకు వచ్చేనెల నాలుగో తేదీన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. వచ్చేనెల తొమ్మిదిన సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల పది నుంచి 15 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 11 నుంచి 15 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఈ విద్యాసంవత్సరంలో 16 సెక్టార్ స్కిల్ కౌన్సిల్ కోర్సులను 64 కాలేజీల్లో ప్రారంభించామని పేర్కొన్నారు. అందులో 29 ప్రభుత్వ 35 ప్రయివేటు డిగ్రీ కాలేజీలున్నాయని వివరించారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్, బీఎస్సీ బయోటెక్నాలజీ ఆనర్స్ కోర్సులనూ నూతనంగా ప్రారంభించామని తెలిపారు. ఇంజినీరింగ్, నీట్, అగ్రికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతున్నందున విద్యార్థుల సౌకర్యార్థం మరో విడత దోస్త్ అడ్మిషన్లను నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, ఓయూ వీసీ డి రవీందర్, ఎంజీయూ వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డి, శాతవాహన వీసీ ఎస్ మల్లేశం, పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, టీయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి, మహిళా వర్సిటీ వీసీ ఎం విజ్జులత, సీడీసీ పి రామచంద్రం, జాయింట్ డైరెక్టర్లు రాజేందర్‌సింగ్, జి యాదగిరి, సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ పి బాలభాస్కర్, రూసా ప్రాజెక్టు ఆఫీసర్ సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు 48 సీట్లు ఇవ్వాలి

- రేవంత్‌కు కత్తి వెంకటస్వామి విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోని ఓబీసీలకు 48 సీట్లు కేటాయించాలని ఓబీసీ జాతీయ నేత కత్తి వెంకటస్వామి కోరారు. ఈమేరకు శనివారం గాంధీభవన్‌లో రేవంత్‌ను కలిసి కోరినట్టు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. అంతకు ముందు గాంధీభవన్‌లో ఓబీసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం కత్తి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలోని బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వైపు బీసీలు చూస్తున్నారని తెలిపారు. వారు కాంగ్రెస్ వైపు మళ్లాలంటే తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. బీసీలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో వారినే నిలబెట్టాలని డిమాండ్ చేశారు. పోటీ చేసేందుకు 65మంది పైగా బీసీ నేతలు ఉన్నారని తెలిపారు. వారంతా ఆర్థికంగా బలంగా ఉన్నారని చెప్పారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 1,520 ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన 02/2023 నోటిఫికేషన్‌ను రద్దు చేసి కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు ఏఎన్ఎంలు వారి సర్వీసును రెగ్యులర్ చేయాలంటూ ఈనెల 15 నుంచి సుమారు ఆరు వేల మంది సమ్మె చేస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం లో, శిశు మరణాలను తగ్గించడంలో, కేసీఆర్ కిట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం, ఇమ్యూనైజేషన్, కుటుంబ నియంత్రణ వంటి పనుల్లో వారి కృషి ఉందని పేర్కొన్నారు. వారి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. 1520 ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టులను రాతపరీక్ష ద్వారా భర్తీచేస్తున్నట్టు 2/2023 నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఇచ్చిందని వివరించారు. ఇప్పటికే కాంట్రాక్టు సర్వీసెస్‌లో పనిచేస్తున్న వారికి సర్వీస్ వెయిటేజి కింద 20 మార్కులిస్తామనీ, మిగతా మార్కుల కోసం పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారని తెలిపారు. వయో పరిమితి 44 ఏండ్లతోపాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితరులకు ఐదేండ్ల సడలింపు కల్పించారని పేర్కొన్నారు.

దాని ద్వారా 20 ఏండ్లుగా పనిచేస్తున్న 49 ఏండ్లు నిండి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎం, హెచ్ఆర్డీ ఏఎన్ఎం, 104 ఏఎన్ఎంలుగా ఉన్న సుమారు ఆరు వేల మందిలో అత్యధికులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారంతా డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై సేవలందిస్తున్నారని తెలిపారు. మళ్లీ వారికి పరీక్ష నిర్వహించడం సరైందికాదని పేర్కొన్నారు. వారిని యథాతథంగా రెగ్యులర్ చేయాలని కోరారు. ఇప్పటికే కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా సర్వీసుకు వెయిటేజి ఇచ్చి రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. అలాగే జీఓ నెంబర్ 16 ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ (ఫిమేల్), ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్ట్, మేల్ హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేశారని తెలిపారు. వివిధ శాఖల్లో కూడా సుమారు ఐదు వేలకు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారని వివరించారు. కావును ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి, గత 20 ఏండ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లను రెగ్యులర్ చేయాలని కోరారు.

దగా...మోసం...!

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశమేమిటి అనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ఏ కూటమికి ఎన్ని స్థానాలు వస్తాయో ఈ సర్వేలు ఎలా అంచనా వేయగలుగుతున్నాయి? ప్రస్తుతం అనేక పార్టీలు రెండు కూటములతోనూ దోబూచులాడుతున్నాయి. అవి చివరికి ఎవరి వైపు ఉంటాయో చెప్పడం కష్టమే. రెండు కూటములకూ దూరంగా ఒంటరి పోరు సాగించే అవకాశం కూడా లేకపోలేదు. అందుకే ఇంకా రెండు కూటములూ పొత్తులను ఖరారు చేసుకోలేదు. కూటమిలో ఏ పార్టీ ఎన్ని స్థానాలకు పోటీ చేయాలి, ఏయే స్థానాలకు పోటీ చేయాలి అనేది కూడా ఇంకా నిర్ణయం కాలేదు.

అప్పుడే అంచనాలా?

మొత్తంగా చూస్తే ఎనిమిది నెలల తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాజకీయ చిత్రంలో ఇంకా అస్పష్టతే కన్పిస్తోంది. అయినా సర్వే సంస్థలు మాత్రం ఏ కూటమి గెలుస్తుంది, ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తుంది అని అంచనాలు వేసేస్తున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాలలో భాగస్వామ్య పక్షాలు తమకే ఎక్కువ సీట్లు కావాలని పట్టుబడుతున్నాయి. సీట్ల సర్దుబాటులో భాగంగా తనకు ఏ స్థానం వస్తుందో ఏ పార్టీకీ తెలియదు. ఇలాంటి పరిస్థితులలో విజయావకాశాలపై అంచనాలు వేయడం ఎలా సాధ్యమో అర్థం కాదు. ఏదేమైనా ప్రలోభాలకు లోబడి సర్వేలు నిర్వహిస్తున్న సంస్థల విశ్వసనీయత దారుణంగా దెబ్బ తింటుంది.

ఇటీవల ఓ సర్వే జరిగింది. మోడీ ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రతిపక్షాలకు ప్రయోజనం కలిగించిందా లేక హాని కలిగించిందా అని సర్వేలో ప్రశ్నించారట. మరి ప్రజలు ఏమన్నారట? అవిశ్వాస తీర్మానం బీజేపీకి, దాని భాగస్వామ్య పక్షాలకే ప్రయోజనం చేకూర్చిందని, అవిశ్వాసం ప్రవేశపెట్టడం ద్వారా ప్రతిపక్షాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నాయని వారు చెప్పారట. అంతేకాదు...మొత్తం అవిశ్వాసం ఎపిసోడ్‌లో మోడీ ప్రసంగమే హైలైట్ అట. ఇలాంటి సర్వేలను ఎవరు స్పాన్సర్ చేస్తున్నారో, అవి ఎవరికి లాభం చేకూరుస్తాయో అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

విలువలకు తిలోదకాలు

వాస్తవానికి మన దేశంలో ఇలాంటి సర్వేలన్నీ టీవీ ఛానల్స్ యాజమాన్యాలకు కాసులు కురిపించేవే. వీటి విశ్వసనీయత ఇప్పటి వరకూ ఎన్నడూ నిరూపితం కాలేదు. వాటిపై అనుమానాలు వ్యక్తం చేయడానికి నిర్దిష్ట కారణాలున్నాయి. దేశంలో ఒపీనియన్, ఎగ్జిట్ పోల్స్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకూ 1984 సార్వత్రిక ఎన్నికలలో మాత్రమే కచ్చితమైన అంచనాలు వెలువడ్డాయి. చాలా సందర్భాలలో సర్వేలో వచ్చిన ఫలితాలకు, వాస్తవ ఫలితాలకు మధ్య తేడాలే కన్పించాయి. ఇందుకు గత మూడు దశాబ్దాలలో జరిగిన అనేక ఎన్నికలను ఉదాహరణగా చూడవచ్చు. కొన్ని సందర్భాలలో అయితే సర్వేలలో వచ్చిన ఫలితాలకు వాస్తవ ఫలితాలు పూర్తి భిన్నంగా వచ్చాయి. ఆయా సందర్భాలలో సర్వే సంస్థల పైన, మీడియా సంస్థల పైన విమర్శలు వెల్లువెత్తాయి. వాటిపై ప్రజలలో విశ్వసనీయత సన్నగిల్లిపోయింది. అయినప్పటికీ ఆయా సంస్థలు మాత్రం ఎన్నికల సమయాలలో సర్వేలపై హడావిడి చేస్తూనే ఉన్నాయి. తమ సర్వే ఫలితాలు, అంచనాలు తప్పాయని తేలిన తర్వాత కూడా అవి కనీసం విచారం వ్యక్తం చేయడమో లేదా క్షమాపణ కోరడమో కూడా చేయవు. తద్వారా వృత్తిపరమైన విలువలకు తిలోదకాలు ఇస్తున్నాయి.

అశాస్త్రీయ పద్ధతిలో...

కొన్ని ఇతర దేశాలలో శాస్త్రీయ పద్ధతిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఆ విధంగానే మన దేశంలోనూ నిర్వహిస్తున్నామని ఆయా సంస్థలు చెబుతున్నప్పటికీ అలా జరగడం లేదు. భిన్నత్వంలో ఏకత్వం కన్పించే మన దేశంలో అనేక వైవిధ్యాలు, వైరుధ్యాలు ఉన్నాయి. ప్రజల జీవన శైలి, ఆహార అలవాట్లు, భాష, అవసరాలు, సమస్యలు వంటివి ప్రతి 60-70 కిలోమీటర్ల దూరానికీ మారుతుంటాయి. ఈ పరిస్థితులలో కేవలం కొన్ని నియోజకవర్గాలను తీసుకొని, కొద్ది మంది అభిప్రాయాలు సేకరించి, ఓ నిర్ధారణకు రావడం చాలా కష్టం. ఒకవేళ వచ్చినా అందులో కచ్చితత్వం లోపిస్తుంది. సర్వే సంస్థలకు ఈ విషయం తెలిసినా దానిని అంగీకరించవు. దేశంలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఫలితాలపై జోరుగా బెట్టింగులు జరుగుతుంటాయి. అదే సమయంలో టీవీ మీడియాలో అత్యాశ కన్పిస్తుంది. ఇలాంటి పరిస్థితులలో బెట్టింగ్ వ్యాపారం చేసే వారు, టీవీ మీడియా పరిశ్రమ చేతులు కలిపితే? ఒపీనియన్, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను తమ ఇష్టానుసారం నిర్ణయించి, కోట్లు దండుకోవచ్చు. మరి ఆ శక్తులు చేయలేని పని ఏముంటుంది?

వామ్మో ధరలు..

(మొదటిపేజీ తరువాయి)

గృహిణులు ఎక్కువగా వాడే టమాటాలు, ఉల్లిగడ్డలు, వంకాయలు, అల్లం, వెల్లుల్లి ధరలు గత కొన్ని నెలలలో రెట్టింపు అయ్యాయి. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరగడంతో రిజర్వ్‌బ్యాంక్ గత వారంలో రుణాలపై వడ్డీ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. బ్యాంకులలోని నగదు నిల్వలను తగ్గించే ఒందుకు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ ద్రవ్యో ల్బణం 4.9%-4.97% మధ్య ఉండవచ్చునని అంచనా వేశారు. ఇక ఆహార ధాన్యాలకు సంబంధించిన ద్రవ్యోల్బణం జూన్‌లో 12.7% ఉండగా జూలై నాటికి 13.04%కి పెరిగింది. దీంతో ధరలను అదుపు చేసే క్రమంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాబోయే నెలల్లో గోధుమలను దిగుమతి చేసుకోవాల్సి రావచ్చు. ఐదు రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు జరగబోయే ఎన్నికలపై ధరల ప్రభావం తప్పనిసరిగా పడుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే ఇప్పుడు గోధుమలను దిగుమతి చేసుకోవడం ద్వారా ధరలకు కళ్లెం వేయాలని యోచిస్తోంది. బాసుమతి యేతర తెల్ల బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం గత నెలలో ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు గోధుమలపై 40% దిగుమతి సుంకాలను రద్దు చేయాలని అనుకుంటోంది. ఆహార ద్రవ్యోల్బణంలో ఓ మాదిరి పెరుగుదల కన్పించినా అది ఓటర్లకు ఆగ్రహం తెప్పిస్తుందని ఆర్థికవేత్త ధీరజ్ నిమ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోక తప్పదని అన్నారు. 'ద్రవ్యోల్బణం అనేది ప్రతి ఒక్కరి సమస్య. అది అందరి పైన ప్రభావం చూపుతుంది. కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తుంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆయన వివరించారు.

26న చేవెళ్లలో ప్రజాగర్జన సభ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తారని వివరించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు శాసనసభ నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'తిరగబడదాం...తరిమికొడదాం' అనే కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలను ప్రతీ గడపకు పోవాలనీ, ప్రతీ తలుపు తట్టేలా చూడాలని కోరారు. ఇందుకోసం నియమించిన పార్లమెంట్ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు ప్రయత్నం చేయాలని సూచించారు. ఈనెల 29న మైనార్టీ డిక్లరేషన్‌ను వరంగల్‌లో విడుదల చేయనున్నట్టు చెప్పారు. ఓబీసీ, మహిళా డిక్లరేషన్ల కోసం సబ్ కమిటీని నియమిస్తామన్నారు. మహిళా డిక్లరేషన్ సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తామన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నెలరోజులపాటు విస్తృతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ, ఆ తర్వాత కాంగ్రెస్ ఏం చేయబోతుందో ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై మరో చార్జిషీట్ విడుదల చేస్తామని తెలిపారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ : రేవంత్ హామీ

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. జెండాలను, అజెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పాలమూరు ప్రజలకు రేవంత్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం బిజినేపల్లి మండలానికి చెందిన సర్పంచులు వెంకటస్వామి, అమృత్‌రెడ్డి, తిరుపతయ్య, ఎంపీటీసీ అంజి, మాజీ సర్పంచులు అలియా నాయక్, రాంచందర్, మాజీ ఎంపీపీ రాములు, వార్డు సభ్యులు, కార్యకర్తలు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పాలమూరు జిల్లాలో 14సీట్లకు 14 గెలిపిస్తే...రాష్ట్రంలో వంద సీట్లు గెలిపించే బాధ్యత తమదేనన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని రేవంత్ వివరించారు.

మణిపూర్ హృదయ విదారకం

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. సీతారాం ఏచూరి, క్షత్రిమయుకు శాంత, మాజీ ముఖ్యమంత్రి ఓక్రమ్ ఇబోబీ సింగ్, పీసీసీ అధ్యక్షుడు కైషమ్ మేఘచంద్ర సింగ్‌లు నాయకత్వం వహించారు.

సమస్యలను పరిష్కరించాల్సిన వారే మణిపూర్‌లో మంటలు రాజేస్తున్నారు

సమస్యలను పరిష్కరించాల్సిన వారే మణిపూర్‌కు నిప్పంటించారని బిషప్ డొమినిక్ లూమోన్ అన్నారు. ఆర్చిబిషప్ హౌస్‌లో సీతారాం ఏచూరితో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'ప్రతి జాతికి దాని సొంత ఆందోళనలు, భయాలు ఉన్నాయి. దీనిని ప్రభుత్వ చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ఇది జరగలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానమే ఘర్షణకు దారి తీసింది' అని ఆర్చ్ బిషప్ అన్నారు. శాంతి చర్చలు జరగనందున సహాయక చర్యలు కూడా అసాధ్యమని ఆర్చ్ డియోసెస్ వికార్ జనరల్ వర్గీస్ అన్నారు. 'సహాయ సామాగ్రి తీసుకువెళ్లే ట్రక్కులు రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. ఇంటర్నెట్ నిషేధంతో బ్యాంకులు, పోస్టాఫీసుల పనితీరుకు అంతరాయం కలుగుతోంది' అని అన్నారు.

విద్వేష ప్రసంగం ఎవరు చేసినా...

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చారు. ఆ నేపథ్యంలో తాజాగా శుక్రవారం కోర్టు విద్వేష ప్రసంగాలపై దాఖలైన పిటిషన్లను విచారించింది. కేరళలో ఐయుఎంఎల్ ర్యాలీ సందర్భంగా రెచ్చగొట్టే నినాదాలు చేసిన 300 మందిపై ఆ రాష్ట్ర పోలీసులు కేసులు పెట్టారు. ఐయుఎంఎల్ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమిలో భాగం కావడం గమనార్హం.

ఐసీసీ టైటిల్ వేటలో దశాబ్ది నిరీక్షణకు తెరదించాలని భారత్ భావిస్తుంది. ఆతిథ్య జట్టుగా మళ్లీ ప్రపంచకప్ నెగ్గాలనే పట్టుదల టీమ్ ఇండియాలో కనిపిస్తుంది. కానీ బ్యాటింగ్ ఆర్డర్‌లో నం.4 బ్యాటర్ ఎవరు? వికెట్ కీపర్, రెండో స్పిన్నర్ ఎవరనే కీలక ప్రశ్నలకు సమాధానం లేదు. 2019 వరల్డ్‌కప్‌లో నం.4 డైలామా భారత్‌ను దెబ్బతీయగా.. ఇప్పుడూ అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచకప్ ముంగిట వరల్డ్‌కప్ జట్టును ఆసియా కప్‌లో ప్రయోగించేందుకు రంగం సిద్ధమైంది. ఆసియా కప్ జట్టును సోమవారం ఎంపిక చేయనున్నారు.

సెలక్షన్ సస్పెన్స్!

- సోమవారం ఆసియా కప్ జట్టు ఎంపిక
- వరల్డ్‌కప్ జట్టుపైనా రానున్న స్పష్టత

ఉత్కంఠ రేపుతున్న సెలక్షన్ కమిటీ భేటీ





నవతెలంగాణ-న్యూఢిల్లీ

2023 వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్, టికెటింగ్‌లో బీసీసీఐ తీవ్ర విమర్శల పాలైంది. మెగా ఈవెంట్‌కు 50 రోజుల కౌంట్‌డౌన్ మొదలైనా.. అభిమానులు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం లేదు. మరోవైపు ప్రపంచకప్‌ను భారత జట్టును సంసిద్ధం చేయటంలోనూ బీసీసీఐ పూర్తిగా తేలిపోయింది. ప్రపంచకప్ సమీపిస్తున్నా.. గెలుపు గుర్రాలను ఎంపిక చేయటం అటుంచి.. కనీసం తుది జట్టు కూర్పు కుదిరేట్టు ఓ కాంబినేషన్‌ను సైతం సిద్ధం చేయలేకపోయింది. కీలక స్థానాల్లో ఆడే క్రికెటర్లు ఎవరనే ప్రశ్నకు సమాధానమే లభించటం లేదు. ఈ నేపథ్యంలో ఆసియా కప్ జట్టును ఎంపిక చేసేందుకు బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ సోమవారం న్యూఢిల్లీలో సమావేశం కానుంది. ప్రపంచకప్ జట్టుపైనా ఈ సమావేశంలోనే చర్చించనున్నారు. దీంతో సోమవారం నాడు సీనియర్ సెలక్షన్ కమిటీ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అసలు చర్చ ఆ జట్టుపైనే!

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే వరల్డ్‌కప్‌పై సరైన సన్నద్ధత, ప్రణాళిక లేకుండా పోయావని బోర్డు విమర్శలు ఎదుర్కొంటుంది. ప్రపంచకప్‌లో పోటీపడే జట్టు ముందుగా కనీసం ఒక టోర్నీలోనైనా కలిసి ఆడే అవకాశం ఇవ్వరా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దీంతో ఆసియా కప్ వేదికగా వరల్డ్‌కప్ జట్టును పరీక్షించేందుకు బోర్డు సిద్ధమవుతోంది. ప్రపంచకప్ ముసాయిదా జట్టును ప్రకటించేందుకు సెప్టెంబర్ 5 తుది గడువు. దీంతో సోమవారం నాటి సమావేశంలోనే ప్రపంచకప్ జట్టుపైనా చర్చ జరుగనుంది. ఈ భేటీకి భారత కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌లు సైతం హాజరు కానున్నారు. ఐర్లాండ్ పర్యటనలో ఉన్న ఓ సెలక్టర్ ఎస్ఎస్ దాస్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశంలో భాగం కానున్నాడు. ప్రపంచకప్‌కు ఎంపిక చేసే 15 మందినే ఆసియా కప్‌కు సైతం పంపాలనే ఆలోచనలో జట్టు మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీ ఉన్నాయి.

ఆ ముగ్గురు వస్తారా..?

కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, జశ్‌ప్రీత్ బుమ్రా. ప్రపంచకప్ జట్టు ఎంపికకు ముందు సెలక్షన్ కమిటీ ఎదుర్కొంటున్న అతిపెద్ద సందిగ్ధం. గాయం నుంచి కోలుకుని మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం శ్రమిస్తున్న ఈ ముగ్గురు ఫిట్‌నెస్ నిరూపించుకుంటే జట్టులో చోటు ఖాయం. ఐర్లాండ్ పర్యటనలో బుమ్రా మెరిసినా.. వన్డేల్లో వరుస స్పెల్స్‌లో 4-5 ఓవర్లు వేయటం టీ20లకు భిన్నమైన సవాల్. ఇక శ్రేయస్ అయ్యర్ ఎన్‌సీఏ ప్రాక్టీస్ గేమ్‌లో ఆకట్టుకున్నాడు. 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్, 38 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేశాడు. ఆదివారం జరిగే మరో ప్రాక్టీస్ గేమ్‌లో కెఎల్ రాహుల్ సైతం బ్యాట్ పట్టనున్నాడు. ఎన్‌సీఏ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ ఇద్దరి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సాధిస్తే భారత్ ఎదుర్కొంటున్న నం.4 డైలామాకు తెర పడుతుంది. కెఎల్ రాహుల్‌కు గ్రీన్ సిగ్నల్ లభిస్తే.. వికెట్ కీపర్ సహా లోయర్ ఆర్డర్‌లో ఫినీషర్ కొరత తీరుతుంది. ఒకవేళ ఈ ఇద్దరిలో ఎవరు ఫిట్‌నెస్ సాధించకపోయినా.. జట్టు కష్టాలు పడాల్సిందే. బ్యాటింగ్ ఆర్డర్ మార్పుల నుంచి.. ఇప్పటికిప్పుడు కుర్రాళ్లకు నయా సవాళ్లకు సిద్ధం చేయక తప్పదు. ఆ తలనొప్పి నుంచి తప్పించేందుకు ఎన్‌సీఏ కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై వంద శాతం ప్రయత్నం చేస్తుంది.

బంతితోనూ తిప్పలే

బౌలింగ్ విభాగంలో ఆటగాళ్లపైనా ఇప్పటివరకు స్పష్టత లేదు. జశ్‌ప్రీత్ బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌పై ఇప్పటికే ఓ నిర్ధారణకు రాలేం. ప్రసిద్ కృష్ణ జట్టు ప్రణాళికల్లో భాగం. అతడూ ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి, శార్దుల్ ఠాకూర్ మాత్రమే సిద్ధంగా ఉన్నారు. ఉపఖండ పిచ్‌లపై పేస్ ఆల్‌రౌండర్ పాత్ర పెద్దగా ఉండదు. దీంతో స్పిన్ ఆల్‌రౌండర్ వేటలోనే భారత్ కనిపిస్తుంది. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను తిరిగి తీసుకోవాలనే చర్చ నడుస్తుంది. కుల్దీప్, చాహల్ మెరుస్తున్నా.. ఎడమ చేతి వాటం బ్యాటర్లపై సంప్రదాయ ఆఫ్ స్పిన్ ప్రభావం తోసిపుచ్చలేం. ఆసియా కప్ తర్వాత జట్టులో మార్పులు ఉండకూడదని భావిస్తున్న తరుణంలో.. సోమవారం భేటీలో సెలక్షన్ కమిటీ నిర్ణయాలపై ఆసక్తి కనిపిస్తుంది.

ఆసియా కప్‌లో భారత్ టైటిల్ వేటను సెప్టెంబర్ 2న పాకిస్తాన్‌తో పోరుతో షురూ చేయనుంది. సెప్టెంబర్ 4న నేపాల్‌తో ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచులు పల్లెకల్‌లోనే జరుగుతాయి. ఆ తర్వాత సూపర్ 4, ఫైనల్ ఉంటాయి. ఆసియా కప్ అనంతరం స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రోహిత్‌సేన తలపడనుంది. ప్రపంచకప్‌లోనూ అక్టోబర్ 8న చెన్నైలో ఆస్ట్రేలియాతో పోరుతోనే దండయాత్ర మొదలుపెట్టనుంది.

జైషాతో ద్రవిడ్ భేటీ

టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బీసీసీఐ కార్యదర్శి జై షా సమావేశం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కరీబియన్లతో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో భాగంగా భారత జట్టు ఫ్లోరిడాలో ఉండగా.. అదే సమయంలో జై షా సైతం ప్రయివేటు పర్యటనలో భాగంగా అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రస్తుత టీమ్ ఇండియా పురోగతి, ప్రపంచకప్ ప్రణాళికలు, కీలక మ్యాచుల్లో పరాజయాలపై గల కారణాలపై రాహుల్ ద్రవిడ్‌ను జై షా ఆరా తీసినట్టు తెలుస్తుంది. ప్రపంచ కప్ ప్రణాళికలను సైతం రాహుల్ ద్రవిడ్ పంచుకున్నట్టు తెలుస్తుంది. ఈ భేటీపై బీసీసీఐ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇక ఐర్లాండ్‌తో తొలి టీ20 అనంతరమే ఆసియా కప్ జట్టును ప్రకటించాలని తొలుత భావించినా.. వర్షం అంతరాయం కలిగించటంతో పూర్తి మ్యాచ్ సాధ్యపడలేదు. దీంతో రెండో టీ20 అనంతరం సెలక్షన్ కమిటీ సమావేశం అవుతుంది.



బ్యాటర్లపైనే ఫోకస్

- సిరీస్ విజయంపై భారత్ గురి
- ఐర్లాండ్‌తో రెండో టీ20 నేడు

రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18లో..

నవతెలంగాణ-డబ్లిన్ : వర్షం అంతరాయంతో భారత్, ఐర్లాండ్ తొలి టీ20 అర్ధాంతరంగా నిలిచిపోయింది. డక్‌వర్త్ లూయిస్ పద్దతిలో ఫలితాన్ని తేల్చాల్సి వచ్చింది. డబ్లిన్ పోరులో భారత బౌలర్లు విజృంభించారు. ప్రత్యేకించి గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన జశ్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ కృష్ణలు రెండేసి వికెట్లతో సత్తా చాటారు. రెండు ఓవర్ల స్పెల్‌తో ఒకింత మ్యాచ్ ఫిట్‌నెస్, ఫామ్ నిరూపించుకునే ప్రయత్నంలో విజయవంతం అయ్యారు. ఛేదనకు వరుణుడు అడ్డు నిలువగా.. నేడు రెండో టీ20లో భారత బ్యాటర్లపై ఫోకస్ పడింది. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ, సంజు శాంసన్‌లు సెలక్షన్ కమిటీ మెప్పు పొందేందుకు ధనాధన్ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడేందుకు ఎదురు చూస్తున్నారు.

సిరీస్ పడతారా? : డబ్లిన్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ భారత్ ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్ ఓ దశలో 59/6తో వందలోపే కుప్పకూలేలా కనిపించినా.. లోయర్ ఆర్డర్ మెరుపులతో ఆతిథ్య జట్టు మంచి స్కోరు సాధించింది. చివర్లో బారీ మెక్‌కార్టీ, కర్టిస్ కాంఫెర్‌లు ఆకట్టుకునే ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. నేటి మ్యాచ్‌లో ఐర్లాండ్‌కు కోలుకునే అవకాశమే లేకుండా.. మరింత స్వల్ప స్కోరుకు పరిమితం చేయాలని భారత్ భావిస్తోంది.

రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, సంజు శాంసన్‌లు సెలక్షన్ కమిటీ ప్రణాళికల్లో కనిపిస్తున్నారు. పసికూన ఐర్లాండ్‌పై భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లు భావిస్తున్నారు. నేటి మ్యాచ్‌లో టాస్ నెగ్గితే భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది. రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్, శివం దూబెలు సత్తా చాటాలని చూస్తున్నారు.

25 నుంచి స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నీ

నాలుగు దేశాల నుంచి రానున్న చెస్ మాస్టర్లు



హైదరాబాద్ : హైదరాబాద్ మరో అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు వేదికగా నిలువనుంది. ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ సహా ఫిడె గుర్తింపు, తెలంగాణ చెస్ సంఘం సహకారంతో ఆగస్టు 25 నుంచి యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ జరుగుతుంది. ఫిడె 1600 రేటింగ్‌కు దిగువన ఉండే మాస్టర్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. బిలో 1600 రేటింగ్ టోర్నీ హైదరాబాద్‌లో జరగనుండటం ఇదే తొలిసారి కానుంది. భారత్ సహా కెనడా, యెమన్, అమెరికాల నుంచి చెస్ మాస్టర్లు ఈ టోర్నీలో ఎత్తులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి చెస్ క్రీడాకారులు హైదరాబాద్‌కు రానున్నారు. స్విస్ సిస్టమ్‌లో తొమ్మిది రౌండ్ల పాటు జరిగే మూడు రోజుల మెగా ఈవెంట్‌లో విజేతలు రూ.10 లక్షల భారీ నగదు బహుమతి అందుకోనున్నారు. ఓవరాల్‌గా 94 నగదు బహుమతులు, 300కి మంది ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు స్లాన్‌స్పోర్ట్స్ సీఓఓ నవీన్ తెలిపారు. ఈ మేరకు అంతర్జాతీయ చెస్ టోర్నీ బ్రోచర్‌ను శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ శనివారం ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చెస్ టోర్నీలో పోటీపడాలనుకునే (ఫిడె రేటింగ్ 1600 పాయింట్లకు దిగువన ఉన్న చెస్ మాస్టర్లు) రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కొరకు 7386377787 నంబర్‌ను సంప్రదించగలరు.





ఆర్చరీలో పసిడి ధమాకా

చాంపియన్స్‌గా మెన్స్, ఉమెన్స్ జట్లు ● ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 4

పారిస్ : ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 4లో భారత ఆర్చర్ల గురి అదిరింది. టోర్నీలో ఏకంగా నాల్గో పసిడి పతకం సాధించిన టీమ్ ఇండియా.. శనివారం టీమ్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు ఖాతాలో వేసుకుంది. పురుషుల కాంపౌడ్ జట్టు ఓజాస్, ప్రతమేశ్ జాకర్, అభిషేక్ వర్మ త్రయం పసిడి వేటలో అమెరికాపై గెలుపొందారు. 236-222తో అమెరికా ఆర్చర్లను ఓడించారు. 59-60, 59-58, 58-58, 60-56తో ఆఖరు రౌండ్లో స్వర్ణం కైవసం చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ విభాగంలో ప్రపంచ చాంపియన్ త్రయం వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్నీత్ కౌర్ గోల్డ్ మెడల్ రౌండ్లో మెక్సికోపై ఉత్కంఠ విజయం సాధించారు. 234-233తో పాయింట్ తేడాతో భారత త్రయం బంగారు పతకం నెగ్గింది. 59-59, 59-58, 57-59, 59-57తో ఉత్కంఠగా సాగిన పసిడి వేటలో ఆఖరు రౌండ్లో సురేఖ, అదితి, కౌర్ పైచేయి సాధించారు. మహిళల వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ కాంస్యం దక్కించుకుంది. సెమీస్‌లో వరల్డ్ నం.1 చేతిలో 148-150తో నిరాశపరిచిన జ్యోతి.. కాంస్య పతక షూట్‌ఆఫ్‌లో పైచేయి సాధించింది. కాంపౌండ్ విభాగంలో రెండు పసిడి, ఓ కాంస్యం సహా రికర్వ్ విభాగంలో భారత్ రెండు కాంస్య పతకాలు సాధించింది.

నవచిత్రం

ఆ డైలాగ్ స్ఫూర్తితో ఈ కథ రాశా..

కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన సినిమా 'బెదురులంక 2012'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ఈనెల 25న సినిమా విడుదల కానున్న సందర్భంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్న క్లాక్స్ (ఉద్దరాజు వెంకట కృష్ణ పాండురంగ రాజు) మీడియాతో ముచ్చటించారు.



క్లాక్స్

■ మాది భీమవరం దగ్గర ఓ పల్లెటూరు. చిత్రసీమలోకి రాకముందు చాలా ఉద్యోగాలు చేశా. నా రూమ్మేట్స్ సినిమాల్లో ట్రై చేసేవారు. వాళ్లతో కథలు డిస్కస్ చేసేవాడిని. చిన్నప్పటి నుంచి సినిమాల్లోకి రావాలని అనుకోలేదు. అయితే, అనుకోకుండా 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అని ఇటాలియన్ సినిమా చూసా. అది నాపై చాలా ప్రభావం చూపించింది. నా ఫ్రెండ్ చరణ్ ద్వారా సుధీర్ వర్మ పరిచయం అయ్యారు. దేవా కట్టా 'బాహుబలి' సిరీస్ తీయాలని వర్క్ చేశారు. దానికి కూడా పని చేశా. తర్వాత రామ్ గోపాల్ వర్మ దగ్గర ఆరు నెలలు పని చేసే అవకాశం లభించింది. సినిమా అనేది సైన్స్ కాదు. దీన్ని రూల్స్ బట్టి చూడకూడదు. కళని కళగా చూడాలని అర్థమైంది. అప్పుడు నాలో భయం పోయింది. సుధీర్ వర్మ , దేవా కట్టా సెకండ్ యూనిట్ డైరెక్షన్ ఛాన్సులు ఇచ్చారు. అందువల్ల, ఈ సినిమా ఫస్ట్ డే డైరెక్ట్ చేసేటప్పుడు నాకు స్ట్రెస్ ఏమీ అనిపించలేదు.

■ నా స్నేహితుడు అజయ్ భూపతి ద్వారా కార్తికేయ పరిచయం కావడంతో ఓ కథ చెప్పా. ఆయనకు నచ్చింది. 'ఆర్ఎక్స్ 100' భారీ విజయం సాధించడంతో ఆయన దగ్గరకు వెళ్లడానికి ధైర్యం చాల్లేదు. కొన్ని రోజుల తర్వాత 'ఇంకో కథ ఉంది. వింటారా?' అని కార్తికేయను అడిగితే... 'ఓకే' అన్నారు. అదే ఈ సినిమా.

■ ఈ సినిమా అంతా ఫిక్షనల్ ఐలాండ్‌లో జరుగుతుంది. మేం 'ఎదురులంక' అని ఓ ఊరిలో షూటింగ్ చేశాం. బోర్డులపై 'బెదురులంక' అని రాశాం. ఎందుకంటే... కథలో ఓ ఫియర్ ఉంటుంది. దానిని కంటిన్యూ చేసేలా ఆ పేరు పెట్టాం.

■ నాకు అకిరా కురసోవా 'సెవెన్ సమురాయ్' చాలా ఇష్టం. అందులో ఓ డైలాగ్ ఉంటుంది. రేపు ఉండదని అన్నప్పుడు... సమాజం ఏమనుకుంటుందో మనం పట్టించుకోం. ఇది బాగా నచ్చింది. ఆ పాయింట్ మీద ఏదో ఒకటి తీయాలని అనుకున్నా. అప్పుడు హాలీవుడ్ సినిమా '2012' వచ్చింది. ఆ రెండింటి స్ఫూర్తితో పల్లెటూరి నేపథ్యంలో కొత్త కథ రాశా. డ్రామెడీ జోనర్‌లో సినిమా తీశా. సందేశం కూడా అంతర్లీనంగా ఉంటుంది. వినోదం, డ్రామా ఎక్కువ ఉంటుంది. తెరపై పాత్రల కంటే ప్రేక్షకుడికి ఎక్కువ కథ తెలుస్తుంది. దాంతో వినోదం బావుంటుంది.

■ ఇందులో ఊరిని ఎదిరించే కుర్రాడిగా కార్తికేయ కనపడతారు. 'డీజే టిల్లు' విడుదల తర్వాత నేహా శెట్టిని ఎంపిక చేశాం. ఆమె చాలా చక్కగా చేసింది. మణిశర్మ అద్భుతమైన సంగీతం అందించారు. సుధీర్ వర్మ టీజర్, ట్రైలర్స్ చూసి, బావున్నాయని చెప్పారు. ఈ కథను అందరి కంటే ముందు చెప్పింది ఆయనకే. 'స్వామి రారా' కంటే ముందు వినిపించా. సెన్సార్ సభ్యులు సినిమా చూశారు. మా సినిమాకు ఒక్క విజువల్ కట్ కూడా ఇవ్వలేదు. వాళ్ళు బాగా ఎంజాయ్ చేశారు. హ్యాపీగా అనిపించింది.అలాగే మా నిర్మాత బెన్నీ ఈ కథని, సినిమాని బాగా నమ్మారు. ఆయన ఎక్కడా రాజీపడలేదు. ఆడియన్స్ రియాక్షన్ కోసం వెయిట్ చేస్తున్నా. మంచి ఫలితం వస్తుందని ఆశిస్తున్నా.

ఘనంగా జెంటిల్‌మన్ 2 ప్రారంభం

'జెంటిల్‌మన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రానికి సీక్వెల్‌గా అగ్ర నిర్మాత కె.టి. కుంజుమోన్ నిర్మిస్తున్న 'జెంటిల్‌మన్ 2' సినిమా ప్రారంభోత్సవం శనివారం చెన్నైలోని ఎగోమర్‌లోని రాజా ముత్తయ్య హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సినిమా ప్రారంభోత్సవ సందర్భంగా సంగీత దర్శకుడు ఎంఎం



కీరవాణికి ఘన సన్మానం జరిగింది. అంగరంగ వైభవంగా ఈ వేడుకకు తెలుగు, తమిళ సినీ పరిశ్రమలకు చెందిన లీడింగ్ ఫిల్మ్ మేకర్స్ హాజరయ్యారు. వీరితోపాటు సమాచార, ప్రసార, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ రాష్ట్ర మంత్రి ఎల్ మురుగన్, జపాన్ కాన్సులేట్ జనరల్ టాగా మసయుకి, పీపుల్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ అరిఫుర్ రెహమాన్, సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ రవి కొట్టారా కారా తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నిర్మాత కె.టి.కుంజుమోన్ సతీమణి ఐరిన్ కుంజుమోన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

తెలుగులో చేగువేరా బయోపిక్

తెలుగు తెరపై మరో బయోపిక్ రాబోతుంది. క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'చే'. లాంగ్ లైవ్ అనేది ట్యాగ్ లైన్. క్యూబా తరువాత ప్రపంచంలో తొలిసారి రూపొందుతున్న చేగువేరా బియోపిక్ ఇది. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్ పై బి.ఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. సూర్య, బాబు, దేవేంద్ర నిర్మిస్తున్న ఈ చిత్రంలో లావణ్య సమీరా, పూల సిద్దేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమామహేశ్వర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్ర పోస్టర్‌ను చేగువేరా తనయ డాక్టర్ అలైదా గువేరా ఆవిష్కరించి, చిత్రయూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు బి.ఆర్ సభావత్ నాయక్ మాట్లాడుతూ, "విప్లవ వీరుడు, యువత స్ఫూర్తిదాయకుడు చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తీయడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాను. ఆయన చేసిన పోరాటలు, త్యాగాలు ఈ చిత్రంలో తీశాం. అప్పటి పరిస్థితులకు అద్దం పట్టే విధంగా చాలా జాగ్రత్తలు తీసుకుని, ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా రూపొందించాం' అని చెప్పారు. ఈ చిత్రానికి డి.ఓ.పి : జగదీష్, ఎడిటర్ : శివ శర్వాణి, సంగీత దర్శకుడు : రవిశంకర్.



క్రేజీ జోనర్ ఫిల్మ్

నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్ బస్టర్ 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'ను తెలుగులో 'బాయ్స్ హాస్టల్' పేరుతో విడుదల చేస్తున్నారు. నితిన్ కృష్ణమూర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఇందులో ప్రజ్వల్ బిపి, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ జయన్న ఉర్స్ ప్రధాన పాత్రలు పోషించగా, రిషబ్ శెట్టి, పవన్‌కుమార్, షైన్ శెట్టి, రష్మీగౌతమ్, తరుణ్ భాస్కర్ అతిథి పాత్రల్లో నటించారు.



'బేబీ' టీమ్ 'బాయ్స్ హాస్టల్' థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది.ఈ సినిమా ఈనెల 26న విడుదల కానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత శరత్ మాట్లాడుతూ,'ఈ సినిమా చూసినప్పుడు ప్రారంభం నుంచి చివరి వరకూ నవ్వుతూనే ఉన్నాను. ఇదొక క్రేజీ జోనర్ ఫిల్మ్. సినిమా బ్రిలియంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. కన్నడలో చూసిన వాళ్ళకి కూడా తెలుగులో చూస్తే కొత్త అనుభూతిని ఇస్తుంది' అని తెలిపారు. 'దాదాపు 500 మంది కొత్త థియేటర్ ఆర్టిస్టలతో ఈ సినిమాని క్రియేట్ చేశారు. ఇది మ్యాడ్ ఫిల్మ్' అని మరో నిర్మాత అనురాగ్ రెడ్డి చెప్పారు. సుప్రియ మాట్లాడుతూ, 'ట్రైలర్ చూశాను. చాలా ఫన్, ఎనర్జిటిక్‌గా ఉంది. అప్పుడే ఈ సినిమాని తెలుగులో విడుదల చేయాలని భావించాం' అని అన్నారు.

థియేటర్లని పెంచుతున్నాం

డైరెక్టర్ కె.విజయభాస్కర్ చాలా విరామం చేసిన యూత్ ఫుల్ ఫన్ అండ్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ 'జిలేబి'. పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ ఎస్ఆర్కే ఆర్ట్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మించారు. అంజు అశ్రాని చిత్రాన్ని ప్రజెంట్ చేశారు. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా పరిచయమైన ఈ చిత్రంలో శివాని రాజశేఖర్ కథానాయికగా నటించారు.

శుక్రవారం విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు కె.విజయభాస్కర్ మాట్లాడుతూ, 'ఇంత మంచి ఫన్ ఎంటర్‌టైనర్‌ని ఎంచుకొని, ఎక్కడా రాజీపడకుండా ఒక పెద్ద సినిమాలా నిర్మించిన నిర్మాతలు రామకృష్ణ, అంజుఅశ్రానికి ధన్యవాదాలు. సినిమాపై ఉన్న నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేశారు. ఈ సినిమా చదువుకునే రోజులు, హాస్టల్ డేస్‌ని మళ్ళీ గుర్తుకు తెచ్చింది. నటీనటులంతా చక్కగా నటించారు.



శ్రీకమల్, కె. విజయభాస్కర్

అందరూ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి సహకరించారు. సినిమాకి వస్తున్న రెస్పాన్స్ అద్భుతంగా ఉంది' అని తెలిపారు.

'మార్నింగ్, ఈవెంట్ షోస్ కంటే నైట్ షోస్ ఇంకా పెరిగాయి. థియేటర్స్ ఇంకా పెరుగుతున్నాయి. నా మొదటి సినిమాకి ఇంత మంచి ఫీడ్ బ్యాక్ రావడం సర్‌ప్రైజ్‌గా ఉంది. అందరూ సినిమా చూడండి పొట్టచెక్కలయ్యేలా నవ్వుకుంటారు. ఇది మా గ్యారెంటీ. థియేటర్‌కి రండి.. నవ్వుతూ బయటికి వెళ్తారు' అని హీరో శ్రీ కమల్ అన్నారు. నిర్మాత గుంటూరు రామకృష్ణ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి అన్ని చోట్ల నుంచి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. చాలా డీసెంట్ మూవీ అని, కామెడీ చాలా బావుందని రివ్యూస్ వస్తున్నాయి. సినిమా ఫలితం పట్ల చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు. 'ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా షోస్‌ని ప్రతి చోటా ఇంకా పెంచుతున్నాం' అని నిర్మాత అంజు అశ్రాని తెలిపారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

సయ్యద్ సోహైల్ రియాన్, రూపా కొడవాయుర్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'మిస్టర్ ప్రెగ్నెంట్'. ఈ చిత్రాన్ని మైక్ మూవీస్ బ్యానర్‌లో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల నిర్మించారు. కొత్త దర్శకుడు శ్రీనివాస్ వింజనంపాటి రూపొందించిన ఈ సినిమా శుక్రవారం థియేటర్స్‌లో రిలీజైంది. ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి తెరకెక్కిన ఈ సినిమాకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ, 'మా సినిమాకు మంచి సక్సెస్ అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ఇలాంటి సినిమాలు చేయాలంటే ప్రొడ్యూసర్స్‌కు గట్స్ ఉండాలి. మా సినిమాలోని ఎమోషన్‌తో పాటు బ్రహ్మాజీ కామెడీ సూపర్‌గా వర్కవుట్ అయ్యింది. ఆ సీక్వెన్స్ వస్తున్నప్పుడు థియేటర్‌లో డైలాగ్స్ వినిపించనంతగా ప్రేక్షకులు గోల చేస్తూ ఎంజాయ్ చేశారు. కుటుంబమంతా కలిసి చూడాల్సిన మూవీ' అని తెలిపారు. 'ఈ చిత్రానికి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషంగా ఉంది. కొత్త కాన్సెప్ట్ అయినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. తెలుగు తెరపై ఇలాంటి సినిమా రాలేదు. మేము ఆ ప్రయత్నం చేశాం. మా సినిమా చూసిన మహిళా ప్రేక్షకులు ఎమోషనల్‌గా మాట్లాడుతున్నారు' అని నిర్మాత అప్పిరెడ్డి అన్నారు. హీరో సోహైల్ మాట్లాడుతూ, 'నేను పదహారేళ్లుగా ఇండస్ట్రీలో పడుతున్న కష్టానికి ఇవాళ ఫలితం దక్కిందని అనుకుంటున్నాను. నేనొక నటుడిని అని గుర్తింపు దక్కినందుకు సంతోషంగా ఉంది' అని చెప్పారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఆఫీస్‌కు రాకుంటే ఇంటికే..!

- ఉద్యోగులకు మెటా హెచ్చరిక



న్యూఢిల్లీ : ఉద్యోగులు తప్పకుండా కార్యాలయాలకు రావాల్సిందేనని మెటా తమ సిబ్బందికి స్పష్టం చేసింది. వారానికి కనీసం మూడు రోజులు అయినా ఆఫీసులకు రావాలని.. లేకపోతే ఉద్యోగం వదిలి ఇంటికి వెళ్లిపోవచ్చని హెచ్చరించింది. సెప్టెంబర్ 5 నుంచి ఈ నిబంధనను కఠినంగా అమలు చేయనున్నట్లు ఉద్యోగులకు జారీ చేసిన నోటీసులో స్పష్టం చేసిందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థల మాతృసంస్థ అయినా మెటా తమ ఉద్యోగులు ఆఫీసుకు వచ్చే హాజరు శాతాన్ని పరిశీలించాలని మేనేజర్లకు సూచించింది. ఆఫీసులకు రావడం ద్వారానే ఉద్యోగుల మధ్య బంధాలు బలోపేతం కావడంతో పాటుగా.. టీమ్ వర్క్‌కు ఈ నిర్ణయం దోహదపడుతుందని మెటా నోటీసులో పేర్కొంది. కాగా.. ఈ నిర్ణయం నుంచి కొద్ది మంది రిమోట్ ఉద్యోగులకు మినహాయింపునిచ్చినట్లు సమాచారం. కరోనా కాలంలో అనేక ఐటి కంపెనీలు తమ ఉద్యోగులకు ఇంటి నుంచి పని చేసే సౌలభ్యాన్ని కల్పించిన విషయం తెలిసిందే. కరోనా ముగిసినప్పటికీ ఇప్పటికీ అనేక మంది ఉద్యోగులు ఇంటి నుంచే పనికి ఆసక్తి చూపుతున్నారు. ఆఫీసులకు రావడానికి అనాసక్తి చూపుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలు ఐటి కంపెనీలు ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆఫీసులకు తప్పనిసరిగా రావాల్సిందేనని ఆదేశాలు జారీ చేశాయి. మరికొన్ని కంపెనీలు వారంలో కొన్ని రోజులు ఇళ్ల, కొన్ని రోజులు ఆఫీసుకు రావాలని హైబ్రిడ్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. కాగా.. ఇంటి వద్ద నుంచి పెద్ద ఫలితాలు రావడం లేదని ఐటి కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కో కంపెనీ వరుసగా కార్యాలయాలకు రావాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తున్నాయి. లేనిచో ఉద్యోగాలు ఊడుతాయని బెదిరిస్తున్నాయి.

లక్షపైగా మహీంద్రా కార్ల రీకాల్

- వైరింగ్‌లో సమస్యలు..



న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) విక్రయిస్తోన్న ఎక్స్‌యువి 700 మోడల్‌లోని ఒక లక్ష యూనిట్ల పైగా రీకాల్ చేస్తోన్నట్లు వెల్లడించింది. వాహనాల్లో వైరింగ్ విషయంలో లోపాలు గుర్తించామని ఆ కంపెనీ తెలిపింది. 2021 జూన్ 8 నుంచి 2023 జూన్ 28 మధ్య తయారైన 1,08,306 యూనిట్ల కార్లలోని ఇంజన్ బేలో వైరింగ్ లూమ్ రూటింగ్‌లో లోపాలు తలెత్తే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వాటిలో తగు మార్పులు చేసి వినియోగదారులకు తిరిగి అప్పగించనున్నట్లు ఆ సంస్థ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. అదే విధంగా ఎక్స్‌యువి 400కు సంబంధించి 2023 ఫిబ్రవరి 16 నుంచి 2023 జూన్ 5 మధ్య తయారైన 3,560 యూనిట్లను రీకాల్ చేస్తోన్నట్లు పేర్కొంది. ఎక్స్‌యువి 400 వాహనాల్లో బ్రేక్ పొటెన్షియోమీటర్‌లో స్ప్రింగ్ రిటర్న్ యాక్షన్‌లో లోపాలు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఈ కార్లు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఎలాంటి చార్జీలు లేకుండానే స్వచ్ఛందంగానే మరమ్మతులు చేసి ఇస్తామని పేర్కొంది.

ఏపీపీఎస్‌సీ గ్రూప్-1లో శ్రీచైతన్య విజయభేరి



హైదరాబాద్: ఏపీపీఎస్‌సీ ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమి విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. స్టేట్ 1వ ర్యాంక్‌తో పాటు మంచి సెలక్షన్స్ సాధించి సంస్థ ఔన్నత్యాన్ని మరోమారు సాటారని పేర్కొంది. గతంలో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమిలో ఇంటర్, డిగ్రీలలో ఇంటిగ్రేటెడ్ కోర్స్ చదివిన భానుశ్రీ లక్ష్మీ గ్రూప్-1 తొలి ర్యాంక్ కైవసం చేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారని వెల్లడించింది. మరో అభ్యర్థి బోడెల్ సుజిత అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా, ఆర్‌టిఒగా గోపి శెట్టి మనోహర్, ఎంపిడిఒలుగా వెల్లపనేని జ్యోతి, శ్రీసాయి హర్ష మున్సిపల్ కమిషనర్‌గా బి రమ్య కీర్తన సెలక్షన్స్ సాధించారని తెలిపింది. శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమిలో ఇంటర్, డిగ్రీలలో ఇంటిగ్రేటెడ్ కోర్స్ చదివిన విద్యార్థులు గ్రూప్-1లోనూ టాపర్స్‌గా నిలిచి.. వివిధ సర్వీసులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. విజేతలకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.


50 కోట్ల మార్క్‌కు జన్ ధన్ ఖాతాలు

న్యూఢిల్లీ : తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభించిన జన్ ధన్ యోజన బ్యాంక్ ఖాతాలు 50 కోట్ల మార్క్‌కు చేరాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో 67 శాతం పైగా ఖాతాలు గ్రామీణ ప్రాంతాల నుంచి నమోదయ్యాయని పేర్కొంది. వీటిలో మొత్తంగా రూ.2.03 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపింది. ఈ ఖాతాలు కలిగిన వారికి దాదాపుగా 34 కోట్ల రూపే కార్డులను జారీ చేసినట్లు పేర్కొంది. ఆయా ఖాతాల్లో సగటు నిల్వ రూ.4,076గా ఉందని.. వీరిలో 5.5 కోట్ల మంది ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి)ని పొందుతున్నారని వెల్లడించింది.

రతన్‌టాటాకు ఉద్యోగ రత్న అవార్డ్

ముంబయి : దిగ్గజ పారిశ్రామికవేత్త టాటా గ్రూప్ అధిపతి రతన్ టాటాను మహారాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ రత్న అవార్డుతో సత్కరించింది. శనివారం రతన్ టాటా నివాసంలో జరిగిన కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు పాల్గొని.. రతన్ టాటాకు అవార్డ్‌ను ప్రదానం చేశారు. రతన్ టాటా, టాటా గ్రూప్స్ దేశానికి ఎనలేని సేవలందించాయని షిండే పేర్కొన్నారు.

ఎస్‌బిఐ కార్డ్‌తోనూ యూపీఐ చెల్లింపులు..!



న్యూఢిల్లీ: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ)తో కలిసి ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్ నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. తమ వినియోగదారులు రూపే నెట్‌వర్క్ క్రెడిట్ కార్డులను యుపిఐ సేవలకు అనుసంధానం చేసుకోవచ్చని పేర్కొంది. ఇకపై స్కాన్ చేసి కొనుగోళ్లు చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తోన్నట్లు వెల్లడించింది. ఇటీవలనే ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. ఉచితంగా ఈ సేవలను పొందొచ్చని పేర్కొంది.

ఉల్లి ఎగుమతులపై 40 శాతం సుంకం



న్యూఢిల్లీ : ఉల్లి ఎగుమతులపై 40 శాతం సుంకం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పెంచిన ఎగుమతి సుంకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇది 2023 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో దేశంలో టమాట, ఇతర ఆహారోత్పత్తుల ధరలు అనుహ్యంగా పెరుగుతూ వస్తోన్నాయి. ఉల్లి ధర కూడా భారీగా పెరుగొచ్చని ఆగస్ట్ తొలి వారంలో క్రిసిల్ ఇచ్చిన రిపోర్ట్‌తో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమయినట్లు తెలుస్తోంది. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని పెంచడం ద్వారా లభ్యతను మెరుగుపర్చడానికి ఈ చర్య తీసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.

వెయ్యేళ్ల బానిసత్వమట !

మొఘల్, బ్రిటీష్ పాలనను ఒకే గాట కట్టిన వైనం

- స్వాతంత్ర్య సమరయోధులు, చరిత్రకారుల అభిప్రాయాలకు భిన్నం



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుండి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ దేశం వెయ్యి సంవత్సరాల బానిసత్వంలో మగ్గిపోయిందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పుకొచ్చారు. ఆయన ఇలా చెప్పడం ఇది మొదటిసారి కాదు. ఇదే విషయాన్ని ఆయన అరిగిపోయిన రికార్డు మాదిరిగా పలు సందర్భాలలో చెబుతూనే ఉన్నారు. ఇటీవల అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు జూన్ 23న ప్రతినిధుల సభను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా ఆయన ఇవే మాటలు చెప్పారు. వెయ్యి సంవత్సరాల పాటు ఏదో ఒక రూపంలో విదేశీ పాలనలో ఉన్న తర్వాత భారతదేశం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోందని సెలవిచ్చారు. అయితే చరిత్రకారులు, స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములైన సమరయోధుల అభిప్రాయాలకు మోడీ వాదన పూర్తి భిన్నంగా ఉంది.దేశాన్ని తొలుత మొఘలులు, ఆ తర్వాత బ్రిటీష్ వారు కలిసి వెయ్యి సంవత్సరాలు పాలించారంటూ ఆర్‌ఎస్‌ఎస్, అప్పటి జనసంఘ్ చేసిన వాదనను భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తోసిపుచ్చారు. అయినప్పటికీ మొఘలులు, బ్రిటీష్ వారి పాలనలో దేశం వెయ్యి సంవత్సరాలు బానిసత్వంలో మగ్గిపోయిందంటూ కొందరు ఇప్పటికీ వాదిస్తూనే ఉన్నారు. మోడీ కూడా ఇదే వాదనను కొనసాగిస్తున్నారు. అయితే చారిత్రక వాస్తవాలను గమనిస్తే ఈ వాదన ఎంతమాత్రం సమర్థనీయం కాదని అర్థమవుతుంది.

సాక్ష్యాలివిగో...


వాస్తవానికి ముస్లింలీగ్, హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు ఎన్నడూ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కాలేదు. పైగా అవి దేశంలో బ్రిటీష్ పాలన కొనసాగేందుకు మద్దతు తెలిపాయి. హిందూత్వ సిద్ధాంతవేత్త వీడీ సావర్కార్ చారిత్రక క్విట్ ఇండియా ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి అలనాటి స్వాతంత్ర్య పోరాట యోధులు, కొందరు చరిత్రకారులు సైతం ఈ కఠోర వాస్తవాలను సాక్ష్యాధారాలతో సహా నిరూపించారు. ఉదాహరణకు గాంధీజీ రచించిన 'సావర్కార్ సోదరులు' అనే వ్యాసం 1920 మే 26న యంగ్ ఇండియాలో ప్రచురితమైంది.

ఈ వ్యాసంలో ఆయన ఏమన్నారంటే... 'బ్రిటీష్ పాలన నుండి దేశానికి స్వాతంత్ర్యం లభించడం తమకు ఇష్టం లేదని ఆ సోదరులు నిర్ద్వందంగా చెప్పారు. బ్రిటీష్ వారితో కలిసి ఉంటేనే భారత్ సురక్షితంగా ఉంటుందని కూడా వారు అభిప్రాయపడ్డారు'. ఇక నేతాజీ 'భారతీయుల పోరాటం : 1920-42' అని రాసిన పుస్తకంలో తాను గాంధీజీతోనూ, ఇండియన్ ముస్లింలీగ్ అధ్యక్షుడు ఎంఏ జిన్నాతోనూ, హిందూ మహాసభ అధ్యక్షుడు సావర్కార్‌తోనూ జరిపిన సమావేశాలను ప్రస్తావించారు. దేశం వెలుపల నుండి స్వాతంత్ర్య పోరాటాన్ని కొనసాగించేందుకు బోస్ విదేశాలకు వెళ్లబోయే ముందు ఈ సమావేశాలు జరిగాయి. గాంధీజీతో చర్చలు సహృద్భావ వాతావరణంలో జరిగాయని, కానీ మిగిలిన ఇద్దరితో జరిపిన సమావేశాలు అసంతృప్తి కలిగించాయని నేతాజీ రాశారు. 'భారత్‌లోని బ్రిటీష్ సైన్యంలో చేరేందుకు హిందువులకు ఎలా సైనిక శిక్షణ ఇవ్వాలన్న విషయం పైనే సావర్కార్ ఆలోచించారు. ముస్లింలీగ్ నుండి కానీ, హిందూ మహాసభ నుండి కానీ నేను ఏమీ ఆశించలేదు' అని తెలిపారు.

తప్పుదోవ పట్టించే ప్రయత్నం

చారిత్రక వాస్తవాలు ఇలా ఉంటే ప్రధాని మోడీ మాత్రం వెయ్యి సంవత్సరాల విదేశీ పాలన, బానిసత్వం అంటూ జాతిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మొఘలుల పాలనలో భారతీయులు కట్టుబానిసలుగా జీవించారంటూ అసత్య ప్రచారం సాగిస్తున్నారు. 1946 డిసెంబర్ 17 నాటి రాజ్యాంగ అసెంబ్లీ రికార్డులను ఒకసారి పరిశీలిద్దాం. డిసెంబర్ 13వ తేదీన నెహ్రూ అసెంబ్లీలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై జరిగిన చర్చలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ మాట్లాడుతూ రాజ్యాంగ అసెంబ్లీ హిందువుల సంస్థ అంటూ లార్డ్ సిమన్స్ చేసిన ప్రకటనను ప్రస్తావించారు. బ్రిటీష్ వారు వ్యాపారులుగా దేశంలో ప్రవేశించారని, 'గొప్పవారైన' మొఘలుల ముందు మోకరిల్లారని తెలిపారు. ముఖర్జీ అంటే ప్రధాని మోడీ, ఆయన పార్టీ సహచరులకు ఎంతో గౌరవం. మరి మొఘలులు చాలా గొప్పవారని ముఖర్జీ అంటుంటే ఆయన అనుయాయులు మాత్రం వెయ్యి సంవత్సరాల విదేశీ పాలన అని ఎలా చెబుతున్నారు? అందులో మొఘలుల పాలనను ఎలా చేరుస్తున్నారు?

గాంధీజీ ఏమన్నారంటే...



మహాత్మా గాంధీ మొఘలుల పాలనను బానిసత్వ కాలంగా ఎన్నడూ అభివర్ణించలేదు. 1921 మార్చి 24న కటక్‌లో ఆయన ప్రసంగిస్తూ 'బ్రిటీష్ వారి కంటే ముందు దేశాన్ని పరిపాలించిన వారిది బానిసత్వ పాలన కాదు. మొఘలుల కాలంలో మనం కొంత స్వయం పాలన అనుభవించాము. అక్బర్ హయాంలో ప్రతాప్ జన్మించారు. ఔరంగజేబు పాలనలో శివాజీ తన ప్రాభవాన్ని చూపారు. కానీ 150 సంవత్సరాల బ్రిటీష్ పాలనలో ప్రతాప్, శివాజీ వంటి వారు ప్రభావం చూపగలిగారా?' అని ప్రశ్నించారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుండి మోడీ చేసిన ప్రసంగానికి, 1957లో అదే సందర్భంలో నెహ్రూ చేసిన ప్రసంగానికి మధ్య చాలా వైరుధ్యాలు ఉన్నాయి. 1957వ సంవత్సరంలో దేశ ప్రజలు తొలి స్వాతంత్రోద్యమ పోరాట శత వార్షిక ఉత్సవాలను కూడా జరుపుకున్నారు. ఆ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ బ్రిటీష్ పాలన నుండి జరిగిన పోరాటాన్ని మాత్రమే ప్రస్తావించారు. ఈ ప్రసంగం ఇప్పటికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. భారత వారసత్వ సంపదను గురించి తెలుసుకోవాలని అనుకునే వారు దానిని వినవచ్చు. ప్రజలలో ఓ వర్గం వారిని లక్ష్యంగా చేసుకొని చెప్పే తప్పుడు భాష్యాలను కాకుండా శాంతిని, సంఘీభావాన్ని కోరుకునే వారు కూడా విధిగా నెహ్రూ ప్రసంగాన్ని వినాల్సిన అవసరం ఉంది.

ఉపాధి వేతనాలకు 'హామీ' ఏది?

అనుసంధానం సాకుతో నిరాకరణ

- జాబ్ కార్డుల తొలగింపుతో ఇబ్బందులు
- ప్రామాణీకరణలోనూ సమస్యలు
- తగ్గుతున్న బడ్జెట్ కేటాయింపులు



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 20.8 లక్షల మంది కార్మికులు క్రియాశీలకంగా పని చేస్తున్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందడం లేదు. దీనికి కారణం...వారి జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఎబీపీఎస్)తో అనుసంధానం కాకపోవడమే. వేతనాలు పొందాలంటే వారికి ఈ అనుసంధానం తప్పనిసరి. దక్షిణాది రాష్ట్రాలలో ఉపాధి పథకంలో మొత్తం 3.57 కోట్ల మంది లబ్ది పొందుతుండగా వారిలో 3.36 కోట్ల మంది ఎబీపీఎస్‌తో అనుసంధానమయ్యారు. ఈ నెల 17 నాటికి ఇంకా 20.8 లక్షల మంది కార్మికుల జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఈ వ్యవస్థతో అనుసంధానం కాలేదు. దీంతో వారికి వేతనాలు అందలేదు. దేశంలో ఎబీపీఎస్ కింద అర్హత పొందిన కార్మికుల సంఖ్య అధికంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో దక్షిణాదికి చెందిన ఐదు రాష్ట్రాలు ఉండడం ఓ విశేషమైతే, వాటిలో సైతం లక్షలాది మంది లబ్దిదారులు ఇప్పటికీ అనుసంధానం కోసం వేచి చూడాల్సి రావడం దురదృష్టకరం.

గడువు సమీపిస్తున్నా...

దేశవ్యాప్తంగా 14.4 కోట్ల మంది క్రియాశీలక కార్మికులు, 2.89 మంది కార్మికులకు ఇప్పటికీ ఈ వ్యవస్థతో అనుసంధానం జరగలేదని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. ఆధార్ ఆధారిత అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలోనే ఆదేశాలు జారీ చేసింది. అయితే దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో అనేక పర్యాయాలు గడువు పెంచారు. తాజా గడువు ప్రకారం ఈ నెల 31లోగా కార్మికులు ఎబీపీఎస్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. చట్ట ప్రకారం పని చేసిన పదిహేను రోజులలో కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే చెల్లింపులలో జాప్యం జరుగుతోంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ దీనికి మరో అడ్డంకిగా మారింది. చాలా మంది కార్మికులు ఆధార్ సీడింగ్‌ను, ప్రమాణీకరణ (అథెంటికేషన్) ప్రక్రియను పూర్తి చేయలేకపోయారు. అవి పూర్తి చేస్తేనే వారికి వేతనాలు అందుతాయి. ఉదాహరణకు ఒక్క తెలంగాణలోనే ఆగస్ట్ రెండో వారం నాటికి సుమారు 41.99 లక్షల మంది (క్రియాశీలక కార్మికులతో కలిపి) కార్మికులకు అనుసంధానాలు పూర్తి కాలేదు. జాబ్ కార్డులు జారీ అయిన వారిని మొత్తం కార్మికులుగా (టోటల్ వర్కర్స్), 2022-23లో పని చేసిన వారిని క్రియాశీలక కార్మికులుగా (యాక్టివ్ వర్కర్స్) పరిగణిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో ఈ నెల 17వ తేదీ నాటికి 3,57,25,047 మంది క్రియాశీలక కార్మికులు ఉండగా, వారిలో 3,56,38,420 మందికి సీడింగ్ పూర్తయింది. 3,51,52,392 మంది ప్రామాణీకరణ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తంగా 3,36,42,935 మంది ఎబీపీఎస్‌తో అనుసంధానం అయ్యారు. ఇంకా అర్హత సాధించని వారి సంఖ్య 20,82,112.

చిన్న చిన్న కారణాలతో...

ఫిబ్రవరి వరకూ కార్మికుల బ్యాంక్ ఖాతాలలో వేతనాలు జమ చేసే వారు. ఆధార్ ఆధారిత చెల్లింపులు కూడా చేసేవారు. ఎబీపీఎస్‌తో అనుసంధానంపై ప్రకటన చేసే సమయానికి కేవలం మూడో వంతు క్రియాశీలక కార్మికులు మాత్రమే అర్హులుగా తేలారు. ఎబీపీఎస్‌కు అర్హులు కావాలంటే కార్మికుల జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఆధార్‌తో సీడింగ్ కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రామాణీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. ఈ సంక్లిష్ట ప్రక్రియ కారణంగా అనేక జాబ్ కార్డులను పొరబాటుగా తొలగించారు. అక్షర దోషాలు, చిన్న చిన్న తప్పిదాలను కారణంగా చూపారు. ఉదాహరణకు తెలంగాణలోని నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన 22 సంవత్సరాల యువకుడు, ఆమె తల్లిదండ్రులు ఉపాధి పథకం పైనే ఎక్కువగా ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఎబీపీఎస్‌తో అనుసంధానానికి అవసరమైన జాబ్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నప్పటికీ యువకుడి జాబ్ కార్డును అకస్మాత్తుగా తొలగించారు. దీంతో అతను ఉపాధి హామీ పథకం కింద పనికి అనర్హుడు అయ్యాడు. గత వేసవిలో నెల రోజులు పని చేసినా వేతనం ఇవ్వలేదని, చివరికి జాబ్ కార్డు రద్దయిందని చెప్పారని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. పనికి వెళ్లినప్పుడు మస్టర్ రోల్‌లో పేరు కనిపించని సందర్భంలో మాత్రమే క్రియాశీలక కార్మికులకు జాబ్ కార్డులో సమస్య ఉన్నదని అర్థమవుతోంది. అక్షర దోషాలు, పురుషుడు లేక స్త్రీ అనే విషయాన్ని తప్పుగా నమోదు చేయడం వంటి చిన్న చిన్న కారణాలతో జాబ్ కార్డులు ఆధార్‌తో సీడింగ్ కావడం లేదు. ఆధార్‌ను ప్రజా పంపిణీ వ్యవస్థతో, ఓటర్ ఐడీ కార్డులతో అనుసంధానం చేసే సమయంలో కూడా ఇలాంటి చిన్న చిన్న తప్పులే సమస్యలకు కారణమవుతున్నాయి.

ఒకసారి ఆధార్‌ను తప్పుగా అనుసంధానం చేసినా, పొరబాటున తొలగించినా, సీడింగ్ లేదా ప్రమాణీకరణ ప్రక్రియలో తేడాలు ఉన్నా సమస్యను పరిష్కరించడం అంత తేలిక కాదు. కొన్ని సందర్భాలలో ఫిర్యాదులు వచ్చినప్పుడు కార్మికుడు చనిపోయాడనో లేదా పని చేయడానికి ఇష్టపడడం లేదనో చెప్పి జాబ్ కార్డులను అధికారులు తొలగిస్తు న్నారు. సమస్యను పరిష్కరించే ఓపిక, సహనం లేకనే వారు ఇలా కార్డుల తొలగింపునకు పూనుకుంటున్నారు. ఆగస్ట్ 3వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 33.23 లక్షల కార్డులను తొలగించారని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు తెలియజేసింది. అసలు జాబ్ కార్డులను తొలగించాలంటే కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కానీ వాటిని పాటిస్తున్న దాఖలాలు కన్పించడం లేదు.

ఈ సమస్యలు కూడా...

అసలు ఆధార్ సీడింగ్, ప్రామాణీకరణ ప్రక్రియ సరిగా జరిగాయా లేదా అనే విషయం కూడా కార్మికులకు తెలియడం లేదు. తగిన సాంకేతిక పరిజ్ఞానం వారిలో లేకపోవడమే దీనికి కారణం. ఎబీపీఎస్ గుర్తించిన బ్యాంక్ ఖాతాను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపర్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. కార్మికులకు పలు బ్యాంక్ ఖాతాలు ఉంటే తాజాగా మ్యాపింగ్ జరిపిన ఖాతాలోనే వేతనాలు జమ చేస్తారు. దీని వల్ల కొన్ని సమస్యలు ఎదురవు తున్నాయి. ఇక డిజిటల్ అటెండెన్స్ కూడా సమస్యలకు కారణమవుతోంది. ఫొటోలు తీసే సమయంలో పని ప్రదేశంలో లేకపోతే ఆ రోజుకు వేతనం లభించదు. గ్రామీణ ప్రాంతా లలో యాప్ సరిగా పని చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ ప్రమాణీకరణ విజయవంతం కాకపోతే లక్షలా ది మంది కార్మికులకు వేతనాలు అందవు. మరోవైపు ఉపాధి పథకానికి నిధుల కేటాయింపులు రానురానూ తగ్గిపోతున్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం ద్వారా మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ పథకాన్ని నీరు కారుస్తోందని విమర్శించాయి.

సమయం మించిపోయింది

అహ్మదాబాద్:గర్భ విచ్ఛిత్తి (అబార్షన్) చేయించుకు నేందుకు అనుమతించాల్సిందిగా ఓ లైంగికదాడి బాధితురా లు చేసిన అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తోసిపుచ్చడంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై శనివారం అత్యవసర విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే సమయం మించిపోయిందని వ్యాఖ్యానించింది. బాధితురాలి అభ్యర్థనపై నిర్ణయం తీసుకునేందుకు హైకోర్టు అతి విలువైన 12 రోజుల సమయం తీసుకోవడంపై అసంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేసింది. జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక విచారణ జరిపింది. బాధితురాలి తరఫున న్యాయవాది శశాంక్ సింగ్ వాదనలు వినిపిస్తూ అబార్షన్‌కు మెడికల్ బోర్డు సిఫార్సు చేసిందని, అయినా హైకోర్టు ఆమె అభ్యర్థనను తోసిపుచ్చిందని తెలిపారు. గర్భిణి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు ఈ నెల 8వ తేదీన హైకోర్టు మెడికల్ బోర్డును ఏర్పాటు చేసిందని చెప్పారు. వైద్యులు ఆమెను పరీక్షించి 10వ తేదీన నివేదిక అందజేశారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 'నివేదిక అందినట్టు 11వ తేదీన హైకోర్టు రికార్డులలో నమోదు చేశారు. కానీ విచారణను 12 రోజులు ఆలస్యం చేస్తూ 23వ తేదీకి వాయిదా వేశారు. గర్భస్థ శిశువు వయసు 28 వారాలకు చేరుతున్న దశలో ఒక్క రోజు జాప్యం జరిగినా నష్టమేనన్న వాస్తవాన్ని హైకోర్టు విస్మరించడం ఆశ్చర్యంగా ఉంది' అని వ్యాఖ్యానించింది.

కోడ్‌ను ఉల్లంఘిస్తున్న బీజేపీ

- ఈసీకి సీపీఐ (ఎం) ఫిర్యాదు

అగర్తల : త్రిపురలో రెండు అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా అధికార బీజేపీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తోందని సీపీఐ (ఎం) ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలోని ధన్‌పూర్, బాక్సానగర్ శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు ఎన్నికల కార్యాలయానికి వెళుతుండగా అధికారులు తమ ప్రదర్శనను అడ్డుకున్నారని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి విమర్శించారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున ప్రదర్శనకు అనుమతి లేదని ఎన్నికల అధికారులు తెలిపారని, అయితే అదే ప్రాంతంలో పలువురు బీజేపీ నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తుంటే ఎవరూ నిరోధించలేదని ఆయన చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘించే వారిని అదుపు చేయడంలో అధికారులు విఫలమైతే మొత్తం ఎన్నికల ప్రక్రియే అపహాస్యం పాలవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి పునీత్ అగర్వాల్‌కు రాసిన లేఖలో చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించినప్పటికీ ఆంక్షలు అమలులో ఉన్న ప్రదేశంలో ప్రసంగించకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, బీజేపీ నేతలను అడ్డుకునేందుకు ఏమీ చేయలేదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాల నుండి ప్రభుత్వ ప్రచార సామగ్రిని తొలగించాలంటూ తాము చేసిన విజ్ఞప్తిని కూడా ఆయన పట్టించుకోలేదని వివరించారు.

'బీజేపీ ప్రభుత్వ విజయాలను ప్రస్తుతిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్లు, కటౌట్లు, ఇతర సామగ్రిని తొలగించాల్సిందిగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత మేము అధికారులను కోరాము.

కానీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని చౌదరి తన ఫిర్యాదులో తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాల్సిన అధికార పార్టీ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దురదృష్టకరమని అంటూ ఎన్నికల ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.

ఉక్రెయిన్ ప్రతిదాడి విఫలమౌతుందని
అమెరికా గూఢచార వర్గాల అంచనా : వాషింగ్టన్ పోస్టు

ప్రపంచ గమనం



ఉక్రెయిన్ కొనసాగిస్తున్న ప్రతిదాడి స్థితి 'విచారకరం'గా ఉన్నదని, అది సంవత్సరాంతానికల్లా క్రిమియా వైపు దూసుకుపోజాలదని అమెరికా గూఢచార వర్గాలు భావిస్తున్నట్టు వాషిగ్టన్ పోస్టు పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాలను రష్యా 'క్రూర నైపుణ్యం'తో పరిరక్షిస్తోందని అమెరికా గూఢచార వర్గాలు తయారు చేసిన నివేదిక విశ్లేషించినట్టు వాషింగ్టన్ పోస్టు రాసింది. ఈ నివేదిక గురువారం వాషింగ్టన్ పోస్టుకు అందిందని ఆ పత్రిక చెప్పుకుంది. ఆగ్నేయ ప్రాంతంలోగల మెల్టీపోల్ ప్రధాన నగరాన్ని చేరుకోవటంలో ఉక్రెయిన్ ప్రతిదాడి విఫలమౌతుందని, క్రిమియాను రష్యా చేరేందుకు వీలుకల్పించే భూభాగాన్ని విడగొట్టే ప్రధాన లక్ష్యాన్ని చేరుకోవటానికి ఈ సంవత్సరంలో ఉక్రెయిన్ కు సాధ్యపడదని ఆ నివేదిక తెలియజేసింది.

క్రిమియా 2014 నుంచి రష్యా ఆధీనంలోనే ఉంది.ఇందుకు ఒక రిఫరెండం ద్వారా ప్రజలు ఆమోదం తెలిపారు. అయితే క్రిమియాని తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఉక్రెయిన్ పదేపదే ప్రతిజ్ఞలు చేస్తోంది. ఉక్రెయిన్ క్రిమియాను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే అజోవ్ సముద్ర తీరంలోని ప్రధాన నగరమైన మెల్టీపోల్‌ను ఆక్రమించుకోవాలి. అందు కోసం ఉక్రెయిన్ ఎన్ని దాడులు చేసినప్పటికీ ఉపయోగం ఉండటం లేదు. వాషింగ్టన్ పోస్టు రాసింది ఈమధ్యకాలంలో ప్రముఖ ఇన్వెస్టేటివ్ జర్న లిస్టు, సెమౌర్ హెర్ష్ చెప్పిన దానితో పోలివుంది. గురువారం ప్రచురించిన ఒక వ్యాసంలో 'ఉక్రెయిన్ ఈ యుద్ధాన్ని గెలవలేదు' అని ఒక గూఢచార అధి కారి అన్నట్టుగా హెర్ష్ పేర్కొన్నాడు. ఉక్రెయిన్ ప్రతి దాడి విఫలమౌతుందనే విషయాన్ని సిఐఏ అమెరికా విదేశాంగ కార్యదర్శికి తెలియజేసిం దనే సమాచారం తనకు ఉందని, ఇదంతా ఉక్రెయిన్ అధ్యక్షుడు, వ్లాడీమీర్ జెలెన్స్కి ఆడుతున్న నాటకమని, ఈ నాటకాన్ని బైడెన్ టీంలో కొందరు నమ్ముతున్నారని హెర్ష్ అన్నాడు. ఉక్రెయిన్ తన ప్రతిదాడిని జూన్ ఆరంభంలో మొదలెట్టింది. ఈ ప్రతి దాడిలో ప్రశ్చిమ దేశాల ఆయుధాలతోపాటు, వివిధ దేశాలలో సైనిక శిక్షణ పొందిన బ్రిగేడ్లు పాల్గొన్నాయి. దక్షిణంలోవున్న జపోర్జియే రాష్ట్రం లోని క్రిమియాను డోన్ బాస్ తో కలిపే భూభాగాన్ని విడగొట్టాలని ఉక్రెయిన్ తీవ్రంగా ప్రయత్నించినా విజయం సాధించలేకపోయింది. ఈ ప్రయత్నం లో ఉక్రెయిన్ 43వేల సైన్యాన్ని, 5వేల భారీ ఆయుధాలను పోగొట్టుకుంది. ఇలా విఫలం కావటానికి కారణం పశ్చిమ దేశాలు యుద్ధ విమానాలను, సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను సరఫరా చెయ్యకపోవటమేనని జెలెన్స్కి పదేపదే నిందిస్తున్నాడు. ఈ ప్రతిదాడిని కొనసాగించాలా లేక వచ్చే వసంతకాలందాకా వేచిచూడాలా అనే విషయంపైన ఉక్రెయిన్ నాయకత్వంలో విబేధాలు ఉన్నాయి. 'మొత్తంగా రంగంలోకి దూకి ఘోరంగా విఫల మయ్యే ప్రమాదాన్ని ఎదుర్కోవటమో లేక నష్టాలను తగ్గించుకుని రాజకీయంగా అవమానకరమైన ఓటమిని అంగీకరించటమో తేల్చుకోవ లసిన స్థితిలో జెలెన్స్కి ఉన్నాడు' అని న్యూస్ వీక్ రాసింది.

డాలర్ గురించి హెచ్చరికను జారీచేసిన ట్రంప్



ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ తన ప్రతిష్టను కోల్పోతున్నదని మాజీ అమెరికా అధ్యక్షుడు, డోనాల్డ్ ట్రంప్ గురువారం నాడు హెచ్చరించాడు. ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ కొనసాగకపోవటమంటే అది యుద్ధం లో ఓడిపోయినదానికంటే ఎక్కువ అని ఆయన అన్నాడు. చైనా అమెరికా ఆధిపత్యా నికి గండికొట్టే ప్రయత్నం చేస్తోందని కూడా ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు.

రెగ్యులరైజ్ అసాధ్యం

- పోస్టులు, వయోపరిమితి పెంచాం
- సమ్మె విరమించండి
- సేవలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు
- డీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు
- సెకెండ్ ఏఎన్ఎం యూనియన్ల నాయకులతో చర్చలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయడం అసాధ్యం. అది అయ్యే పని కాదు. చాలా సమస్యలతో ముడిపడి ఉన్నది. జాతీయ ఆరోగ్య మిషన్లో సెకెండ్ ఏఎన్ఎంలు మాత్రమే లేరు. మిగిలిన క్యాడర్ల వారు కూడా ఉన్నారు. అదే విధంగా వైద్యారోగ్యశాఖలోనే కాకుండా మిగిలిన శాఖల్లోనూ కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. న్యాయవివాదాలు రాకుండా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ముందుకొచ్చింది. రెగ్యులర్ ఏఎన్ఎం పోస్టుల భర్తీకి సంబంధించి ఇది వరకే ఇచ్చిన నోటిఫికేషన్‌లో 1,520 పోస్టులుండగా వాటిని 1,931కి పెంచాం. రాబోయే మూడు నెలల కాలంలో ఖాళీ అయ్యే పోస్టులను కూడా కలుపుతాం. వయోపరిమితిని ఒసీలకు 48 ఏండ్లకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 53 ఏండ్లకు పెంచాం. వెయిటేజీని అత్యధికంగా 20 మార్కుల నుంచి 30 మార్కులకు పెంచాం. పరీక్షను ఇంగ్లీష్‌తో పాటు తెలుగులోనూ నిర్వహిస్తాం. పరీక్షకు సిద్ధపడేందుకు మెటీరియల్‌ను, జిల్లాల్లో ఉచిత శిక్షణ ఇస్తాం. ఏఎన్ఎంల వివిధ రకాల డిమాండ్లు, పనిభారంపై అధ్యయనం వేసేందుకు రాష్ట్ర స్థాయి కమిటీ వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కమిటీ కొన్ని వారాల్లోనే నివేదిక ఇస్తుంది. రాష్ట్రంలో తల్లులు, బిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు దెబ్బతినకుండా సమ్మె విరమించాలి...." అని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ కోఠిలోని డీహెచ్ కార్యాలయంలో ఆయన ఆయా సంఘాల నేతలతో చర్చించాక మీడియా సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్రంలో కొన్ని సంఘాలు కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను సమ్మెకు ప్రేరేపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా తెలంగాణలోనే జీతాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గుజరాత్‌లో రూ.17 వేలు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.23,393, కర్నాటకలో రూ.18,523 మాత్రమే చెల్లిస్తున్నారని ఉదహరించారు. తెలంగాణలో రెగ్యులర్ ఉద్యోగి బేసిక్ పేను ఇస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఇస్తున్న వెసులుబాటుతో రెగ్యులర్ ఉద్యోగాల్లో 99.99 శాతం వారికే వస్తాయని తెలిపారు. జనాభా ప్రాతిపదికన కొత్త పోస్టుల మంజూరు యోచన కూడా ఉందని వెల్లడించారు. మార్కులు, సీనియార్టీ ప్రాతిపదికన అంటూ రెగ్యులరైజేషన్ చేయలేమని స్పష్టం చేశారు. దీంతో న్యాయసంబంధమైన సమస్యలు వచ్చే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వ సేవలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమ్మెను ప్రోత్సహిస్తున్న యూనియన్ల నాయకుల అంతరాత్మకు కూడా రెగ్యులరైజ్ కాదనే విషయం తెలుసని డీహెచ్ కామెంట్ చేశారు. ఉన్నవి 2000 ఉద్యోగాలైతే 5000 మందిని రెగ్యులరైజ్ చేయాలంటే వారిలో ఎవరిని చేయాలి? అని యూనియన్ నాయకులను ప్రశ్నించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ఒకరకంగా ప్రభుత్వం పరోక్షంగా రెగ్యులర్ చేస్తున్నట్టేనని డీహెచ్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వంతో చర్చలు విఫలం
కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మె కొనసాగింపు
-టీయుఎంహెచ్ఇయూ

సమ్మె ఐదో రోజుకు చేరిన సందర్భంగా ప్రభుత్వం ఆహ్వానం మేరకు డీహెచ్‌తో జరిగిన చర్చల్లో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ - సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్,యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్, యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఏ కవిత,రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బలరాం, కిరణ్మయి, సుగుణ, ప్రభావతి, మాధవి, అనిత, ప్రమీల తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. యధావిధిగా రెగ్యులర్ చేయడం కుదరదనీ, 70 మార్కులకు రాత పరీక్ష ఉంటుందనీ, 30 మార్కుల సర్వీస్ వెయిటేజీ ఇస్తామనీ, నోటిఫికేషన్‌లో అదనంగా 411 పోస్టులు పెంచి మొత్తం 1,931 పోస్టులు భర్తీ చేస్తామనీ, అత్యధికంగా వయోపరిమితి 53 ఏండ్లు ఉంటుందన్న ప్రభుత్వం చెప్పిన విషయాలపై వారు ఆ యూనియన్ జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కమిటీలో చర్చించారు. ఆ సమావేశాల్లో అందరిని రెగ్యులర్ చేయాలనీ, రాత పరీక్ష రద్దు చేయాలనీ, సమ్మె చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినందున సమ్మె యథాతథంగా కొనసాగుతుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ తెలిపారు. ప్రభుత్వమే పునరాలోచించి చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లాల్లోని సమ్మె శిబిరాల్లో వినూత్న కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.

వీఆర్ఏల కోసం 14 వేలు సృష్టించలేదా?
-ఎం.నరసింహ

డీహెచ్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలిపారు. ఈ మేరకు ఆ యూనియన్ ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ ఆరోగ్య పథకం కేంద్ర ప్రభుత్వ మిషన్ అయినప్పటికీ ఉద్యోగుల ఎంపిక విషయం మాత్రం రాష్ట్ర పరిధేనని తెలిపారు. వీఆర్ఏల కోసం 14 వేల పోస్టులను సృష్టించిన ప్రభుత్వం ఏఎన్ఎంల కోసం 4 వేల పోస్టులను సృష్టించలేదా? అని ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు
-బీఆర్టీయూ

పోస్టులు పెంచి, వయోపరిమితిలో సడలింపునిచ్చిందనందుకు బీఆర్టీయూ అనుబంధ సెకెండ్ ఏఎన్ఎం అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. డీహెచ్ మీడియా సమావేశం అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాధ మాట్లాడుతూ రెగ్యులర్ ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను 5,500కు పెంచాలని కోరినట్టు తెలిపారు. గత 20 ఏండ్లుగా సబ్ సెంటర్లు పెరగలేదనీ, జనాభా ప్రాతిపదికన వాటిని పెంచితే సమస్య పరిష్కారమవుతుందన్నారు.

అన్ని ఖాళీలను భర్తీ చేయాలి
-తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం
హెచ్1 యూనియన్

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీహెచ్ఏ ఖాళీలన్నింటినీ గుర్తించి భర్తీ చేయాలని తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయిరెడ్డి కోరారు. జనాభా ప్రాతిపదికన మైదాన ప్రాంతాల్లో 5 వేల జనాభాకు, ఏజెన్సీ ఏరియాలో 3 వేల జనాభాకు ఒక సబ్ సెంటర్ మంజూరు చేయాలని సూచించారు.

జీవో జారీ

కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఇప్పటికే గుర్తించిన 1,520 పోస్టులతో పాటు అదనంగా 146 ఖాళీలను భర్తీ చేయనున్నట్టు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు వయోపరిమితి, వెయిటేజీ పాయింట్ల పెంపును ఆమోదించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటితో పాటు తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ప్రకటించిన 265 పోస్టులను కూడా ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్‌లో కలిపినట్టు వైద్యారోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

సీటు కోసం హీటెక్కుతున్న జహీరాబాద్..

- దక్కించుకునేందుకు నేతల పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ సీటు కోసం నేతలు పోటాపోటీగా ప్రయత్నాలు కొనసాగిస్తుండటంతో జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం హీటెక్కుతోంది. సీఎం కేసీఆర్ చేయించిన సర్వేల ప్రకారం... ప్రస్తుత ఎమ్మెల్యే మాణిక్‌రావుపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అందువల్ల ఈసారి కేసీఆర్ ఆయనకు టిక్కెట్ నిరాకరించవచ్చని సమాచారం. మాణిక్‌రావుకు బదులుగా నరోత్తమ్ (మొదట టీడీపీ, ఆ తర్వాత కాంగ్రెస్, ఇప్పుడు బీఆర్ఎస్)కు ఆ స్థానాన్ని కేటాయించనున్నారని సమాచారం. దీంతో మాణిక్‌రావు అనుచరులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఈ విషయమై సీఎం కేసీఆర్‌తోనూ, మంత్రి కేటీఆర్‌తోనూ మాణిక్‌రావు చర్చించారు. అయినా ఫలితం కనబడలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే మాణిక్‌రావుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెబుతున్న కొందరు నేతలు.. నరోత్తమ్‌ను కూడా అంగీకరించటం లేదు. ముఖ్యంగా అక్కడి సీనియర్ నాయకుడు ఎమ్‌జీ రాములుతోపాటు మరికొందరు నేతలు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నట్టు తెలంగాణ భవన్‌లో గుసగుసలు వినబడుతున్నాయి. కొన్ని సామాజిక వర్గాలు కూడా నరోత్తమ్‌ను వ్యతిరేకిస్తున్నాయని వినికిడి. ఈ క్రమంలో మధ్యేమార్గంగా సీఎం కేసీఆర్ ఢిల్లీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఉన్నత విద్యావంతుడు కావటం, రైతుల డిమాండ్లపై గతంలో ఢిల్లీ స్థాయిలో పాదయాత్ర నిర్వహించటం, 22 ఏండ్లుగా సామాజిక కార్యక్రమాలను నిర్వహించటంలాంటి అంశాలతో ఆయన సీఎం దృష్టిలో పడ్డారని బీఆర్ఎస్‌కు చెందిన ఓ సీనియర్ వ్యాఖ్యానించారు. అయితే మాణిక్‌రావు, నరోత్తమ్, వసంత్... ఈ ముగ్గురిలో ఎవరి పేరును కేసీఆర్ ఖరారు చేస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ తొలి జాబితాలో కూడా జహీరాబాద్ అభ్యర్థి పేరు ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ నియోజకవర్గానికి చెందిన నేతలు మాత్రం తమ లీడర్‌కే టిక్కెట్ దక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అందుకోసం వారు గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోనే తిష్టవేశారు.

విమానాశ్రయంలో 836 గ్రాముల బంగారం పట్టివేత

నవతెలంగాణ-శంషాబాద్



విదేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ ఇద్దరు ప్రయాణికులు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం పట్టుబడ్డారు. మొత్తం 836 గ్రాముల బంగారాన్ని అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జెడ్డా నుంచి ఇండిగో విమానంలో ఒక ప్రయాణికుడు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అనుమానంతో అతన్ని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తే, రూ.19.62 లక్షల విలువైన 326 గ్రాముల బంగారం బయటపడింది. బంగారాన్ని స్వాధీనం చేసుకుని ప్రయాణికున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మరో వ్యక్తి వద్ద 510 గ్రాములు

బ్యాంకాక్ నుంచి ఓ ప్రయాణికుడు థాయిఎయిర్వేస్‌లో విమానాశ్రయానికి తెల్లవారుజామున చేరుకున్నాడు. కస్టమ్స్ అధికారులు అతన్ని తనిఖీ చేసి 510.5 గ్రాముల బంగారం ఉన్నట్టు గుర్తించారు. బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బంగారం విలువ రూ. 30.78 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

మణిపూర్‌లో మహిళల భారీ నిరసన

ఇంఫాల్ : మణిపూర్‌లో మహిళలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఉఖ్రుల్ జిల్లాలో తోవాయి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు కుకీలు హత్యకు గురయ్యారు. ఈ ఘటనను నిరసిస్తూ కుకీ-జో కమ్యూనిటీ ఆధిపత్యం ఉన్న కాంగ్‌పోక్పి జిల్లాలో వందలాది మంది మహిళలు శుక్రవారం మధ్యాహ్నం నుంచి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. శనివారం కూడా వారి ఆందోళన కొనసాగింది. కుకీల హత్యపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని పెద్దపెట్టున నినదించారు. కొండ ప్రాంతాల్లో అస్సాం రైఫిల్స్‌ను మోహరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొండ జిల్లాల మాదిరిగానే మణిపూర్‌లోని అన్ని లోయ జిల్లాల్లో ఎఎఫ్ఎస్‌పిఎతో భద్రత కల్పించాలని గిరిజన ఐక్యత కమిటీ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

మెడికల్ సీట్లు ఇవ్వండి

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని 54 వైద్య కళాశాలల్లో తొలి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు కాళోజీ వైద్య విశ్వవిద్యాలయానికి హైకోర్టు అనుమతిచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని మెడికల్, డెంటల్ కోర్సు సీట్లు తెలంగాణ స్టూడెంట్స్‌కే చెందుతాయని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 72ను సవాల్ చేసిన పిటిషన్‌లో హైకోర్టు పైవిధంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ జీవోను ఏపీకి చెందిన ఆరుగురు విద్యార్థులే సవాల్ చేశారని, ఈ కారణంగా 53 కాలేజీల్లో సీట్ల కేటాయింపు నిలిపివేయలేమని చెప్పింది. తమ ఉత్తర్వుల తర్వాత ఆరుగురు విద్యార్థులకు సీట్లు వస్తే సమస్యే లేదని, సీట్లు రాకపోతే ఏం చేస్తారో చెప్పాలని యూనివర్సిటీని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత నెలకొల్పిన 34 కాలేజీల్లో ఆ కోటా సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని, రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న 20 కాలేజీల్లోని ఆ కోటా సీట్లు ఏపీ, తెలంగాణ విద్యార్థులకు చెందుతాయని ప్రభుత్వం చెప్పింది. రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకంగా జీవో 72 ఉందని, తెలంగాణలోని కొత్త, పాత కాలేజీలన్నింటిలోనూ ఆ కోటా సీట్లు ఏపీ స్టూడెంట్స్‌కు కూడా లభిస్తాయనేది పిటిషనర్ల వాదన.

టీబీపై సీరియస్‌గా వ్యవహరించాలి

- రోగి కుటుంబీకుల పైనా దృష్టిని పెట్టాలి
- ఈ వ్యాధి ఇప్పటికీ ఒక సవాలే
- ఆరోగ్య, వైద్య నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లో క్షయవ్యాధి నియంత్రణలో మోడీ సర్కారు ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోతున్నది. టీబీ నిరోధానికి విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న తరుణంలో కేంద్రం పనితీరుపై ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీబీ నియంత్రణ అంటే వ్యాధిని నిరోధించే వైపుగా చర్యలు చేపట్టాలి కానీ వ్యాధిన బారిన పడిన వారిని లెక్కించకుండా గణాంకాల ద్వారా తప్పించుకోవాలని చూడటం కాదని చెప్పారు. భారత్‌లో టీబీ వ్యాధి అనేది ఇప్పటికీ ఒక పెద్ద సవాలుగానే ఉన్నదనీ, దీని నుంచి రోగిని మాత్రమే కాకుండా రోగి కుటుంబాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని వారు తెలిపారు. వారి కుటుంబాలను రక్షించడానికి చర్యలు ప్రారంభించే ముందు రోగిని గుర్తించి చికిత్స చేయాల్సి ఉంటుందని వివరించారు. ఫుడ్ బాస్కెట్స్ టీబీ రోగుల కుటుంబ సభ్యులలో అంటువ్యాధులను ఎలా నిరోధించవచ్చనే దానిని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తన అధ్యయనంలో పునరుద్ఘాటించింది. ఫుడ్ బాస్కెట్స్ అనేవి టీబీ మరణాలను కూడా తగ్గించగలవని వివరించింది. కేసులను నమోదు చేయకుండా 'మేడిపండు చందంగా' దేశంలోని టీబీని నిరోధించామని చెప్పుకునే ప్రయత్నాలు దేశంలో జరుగుతున్నాయని ఆరోగ్య, వైద్య నిపుణులు తెలిపారు. 2025 టీబీని నిర్మూలించేందుకు ప్రధాని మోడీ చేసిన వాగ్దానం గడువు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వ నిష్క్రియాత్మక తీరు ఆశ్చర్యం, ఆవేదన కలిగించక మానదని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో టీబీ మహమ్మారికి ప్రధాన కారణాలలో పోషకాహార లోపం ఒకటని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహారం విషయంలో దృష్టిని సారించాలని చెప్పారు. దేశంలో దాదాపు 80 శాతం మంది టీబీ రోగులు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతారని అంచనా. అయితే ప్రభుత్వ నివేదికలో ప్రచురించిన డేటా ప్రకారం.. ఇది 30 శాతంగా ఉన్నది. ఈ వ్యాధిని 2012లో నోటిఫై చేసినప్పటికీ, ఆ తర్వాత దానిని తెలియజేయకపోవడం శిక్షార్హమైన నేరంగా మారింది. నోటిఫై చేయని ఒక టీబీ పేషెంట్ వారు అర్హులైన పోషకాహార స్టైఫండ్‌ను కోల్పోతారు. అలాగే కనీసం ఆరు నెలల యాంటీ ట్యూబర్‌క్యులర్ డ్రగ్స్‌ని రోగికి కట్టుబడి ఉండేలా చూసే ఆరోగ్య కార్యకర్తల సేవలకు సైతం దూరమయ్యే పరిస్థితులు ఉంటాయి. కేంద్రంలోని మోడీ సర్కారు టీబీ విషయంలో సీరియస్‌గా వ్యవహరించి వ్యాధిని నియంత్రించాలని ఆరోగ్య నిపుణులు, వైద్యులు సూచించారు. రోగి, వారి కుటంబానికి అవసరమైన మందులు, పోషకాహారం, ఇతర వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. టీబీని నియంత్రించే చర్యలను పటిష్టం చేయకపోతే అది తీవ్ర రూపం దాల్చి మరింతగా నష్టాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

3 రైళ్లలో అగ్ని ప్రమాదాలు

- వేర్వేరు చోట్ల ఘటనలు
- నాగ్‌పూర్‌లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత



న్యూఢిల్లీ : వివిధ ప్రాంతాల్లోని మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో శనివారం అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలు బోగీలు దగ్ధమయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. శనివారం ఉదయం తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-2 బోగీలో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది రైలును నాగ్‌పూర్ సమీపంలో నిలిపేశారు. ప్రయాణికులు బోగి నుంచి కిందకు దిగి పరుగులుపెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో ఎవరికీ హాని జరగలేదని, ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

బెంగళూరులో ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్..

కర్నాటకలోని బెంగళూరులో ఉన్న సంగోలి రాయన్న రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఓ రైలులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 5:45 గంటలకు చేరుకుంది. ప్రయాణికులంతా దిగిన తర్వాత ప్లాట్‌ఫామ్‌పై రైలును నిలిపివుంచారు. ఉదయం 7:10 గంటలకు రైలులోని బి1, బి2 బోగీల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్టేషన్‌లో పొగలు దట్టంగా అలముకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. రైలులో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఉదయం 7:10 గంటలకు ప్రమాదం జరిగితే.. అగ్నిమాపక సిబ్బంది 7:35కు చేరుకున్నారని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో కూడా...

ఉదయ్‌పూర్-ఖజురహో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ సిటీలోని సిథోలి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే రైలు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన లోకో పైలట్ రైలును అక్కడికక్కడే నిలిపేశారు. ఇంజిన్‌లో మంటలు గురించి తెలియగానే ప్రయాణికులు రైలు దిగి పరుగులు తీశారు. ముందుగా లోకో పైలట్ రైలింజన్‌లోంచి మంటలు రావడాన్ని గమనించారని, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంటు వ్యవస్థను పూర్తిగా ఆపేసి మంటలను అదుపులోకి తెచ్చారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైలు ఇంజిన్‌ను తొలగించి, మరో ఇంజిన్‌తో రైలును గమ్యస్థానానికి పంపినట్టు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నామన్నారు.

నివారణ చర్యలు సూచించండి

- కోటా విద్యార్థుల ఆత్మహత్యలపై
- కమిటీకి రాజస్థాన్ సీఎం ఆదేశం

జైపూర్ : రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. పిల్లల భవిష్యత్తుపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు బలవన్మరణాలు తీవ్ర శోకాన్ని మిగిలుస్తున్నాయి. ఈ తరుణంలో రాజస్థాన్ ప్రభుత్వం స్పందించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలను సూచించే కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, కోచింగ్ సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో గెహ్లాట్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితోపాటు సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి కోసం కోచింగ్ ఇనిస్టిట్యూట్‌ల కేంద్రంగా ఉన్న కోటాలో ఈ ఏడాది వరుస ఆత్మహత్యలు సంచలనం రేపాయి.

కాగా, ఈ కమిటీలో కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ప్రతినిధులు, తల్లిదండ్రులు, వైద్యులు కూడా ఉండాలని గెహ్లాట్ ఆదేశించారు. కమిటీ 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 9, 10వ తరగతి విద్యార్థులు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరడం వల్ల అదనపు భారం పడుతుందని గెహ్లాట్ చెప్పారు. దీంతో కమిటీ తన నివేదికలో ఏ సలహాలు, సూచనలు చేస్తుందోనన్న విషయంపై ఆసక్తి నెలకొన్నది.

ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఎస్సీ కులాలను అటు సామాజిక వివక్ష నుంచి దూరం చేయడంతోపాటు, ఇటు ఆర్థిక స్వావలంబనను కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. దళితబంధు, షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక ప్రగతి నిధి, ఆర్థిక చేయూత పథకం,ఎస్సీ హాస్టళ్ళు, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, ఎస్సీ పారిశ్రామిక వేత్తలకు రాయితీలు,ఎస్సీ, ఎస్టీ, గౌడలకు మద్యం దుకాణాల కేటాయింపు, టీఎస్ - ప్రైడ్ (తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఎంటర్ ప్రెన్యూయర్స్), ఎస్సీ లకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది.

ఎస్సీలకు విద్య , ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎస్సీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, ఎస్సీ డిగ్రీ కాలేజీలు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లు, ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ లు, స్టడీ సర్కిళ్ళు, ఎస్సీ యువత కోసం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ రైతుల ఖాతాల్లోనూ నగదు జమ చేయాలి

- సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీ పథకంలో భాగంగా పంటరుణాలు పూర్తిగా చెల్లించిన వారికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతుల ఖాతాల్లో నగదును జమ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రుణమాఫీ కార్యక్రమంలో పంటరుణాలను తీసుకుని, పూర్తిగా చెల్లించిన వారికి రుణమాఫీ చేసినట్టు ట్రెజరీ ద్వారా బ్యాంక్‌లో నగదు పడినట్టు రైతుల ఫోన్‌కు సమాచారం వచ్చినట్టు తెలుస్తున్నదని తెలిపారు. పంటరుణాలు కట్టిన వెంటనే సంబంధిత ఖాతా రద్దు చేయబడుతున్నదనీ, ఆ ఖాతాలో ఎలాంటి నగదు జమ కాలేదంటూ బ్యాంక్ అధికారులు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. కానీ ట్రెజరీ ద్వారా నగదు చెల్లించినట్టు సమాచారం ఇస్తున్నారని వివరించారు. రుణమాఫీ విధివిధానాల ప్రకారం పంటరుణాలు చెల్లిస్తే రుణమాఫీ నగదు పూర్తిగా ఇవ్వనున్నట్టు చెప్తున్నారని తెలిపారు. కానీ రైతులకు రుణమాఫీ డబ్బులు పడకపోవడం, ట్రెజరీ ద్వారా చెల్లించినట్టు సమాచారం రావడంతో వారు తీవ్ర ఆయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. పంటరుణాల అకౌంట్ రద్దు చేసిన వారి వ్యక్తిగత అకౌంట్‌కు రుణమాఫీ నగదు ఇవ్వొచ్చని సూచించారు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఎందుకు జరుగుతున్నాయో సంబంధిత అధికారులకూ తెలియకపోవడం అన్యాయంగా ఉందని విమర్శించారు. పంటరుణాలు చెల్లించిన వారికి రుణమాఫీ నగదు వేయడంలో జరిగిన గందరగోళ పరిస్థితులపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని కోరారు.

'డబుల్' ఇండ్ల పేరుతో వసూళ్లు

- అధికారులతో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కార్పొరేటర్

నవతెలంగాణ-అంబర్ పేట

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామంటూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహకారంతో హైదరాబాద్ అంబర్‌పేట్ కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్ గౌడ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకెళ్తే..

ఎల్బీనగర్‌కు చెందిన యేసయ్య అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో శనివారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేర అమాయకుల నుంచి రూ.25 వేలు వసూలు చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహకారంతో అతన్ని పట్టుకొని అంబర్‌పేట పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు అతన్ని విచారించగా.. మరో ముగ్గురి నుంచి డబ్బులు తీసుకున్నట్టు తెలిసింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

మూడ్రోజులు వానలే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో మరో మూడ్రోజులు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు పడతాయని హెచ్చరిస్తూ, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి సహా మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం రోజు బస్సు కోసం ఎల్బీనగర్ చౌరస్తాలో నిలబడి ఉన్న గిరిజన మహిళ వడిత్యా లక్ష్మిని పోలీసులు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించి, రాత్రంతా చిత్రహింసలు పెట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఆ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్ వెస్లీ, టీ స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూతురి పెండ్లి పత్రిక చూపించినా, వినకుండా పోలీసులు ఆమె పట్ల అమానుషంగా ప్రవర్తించారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన ఇద్దరు పోలీసులను ఉద్యోగం నుండి తొలగించాలనీ, వాళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. బాధితురాలికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనీ, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీహార్ జర్నలిస్ట్ హత్య కేసులో నలుగురు అరెస్టు

పాట్నా : బీహార్‌లో దైనిక్ జాగరణ్ వార్తాపత్రిక జర్నలిస్టు విమల్ కుమార్ యాదవ్ (35) హత్య కేసులో నలుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బీహార్‌లోని అరారియా జిల్లాలోని ప్రేమ్‌నగర్ గ్రామంలో తన నివాసంలోనే విమల్ కుమార్ యాదవ్‌ను శుక్రవారం దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే.



ఇప్పుడైనా చెప్పవూ...!!

డిక్షనరీలో లేని పదాలకు
కొత్త కొత్త అర్థాలను అన్వయించి
అంగాంగ వర్ణనలను... అతిశయోక్తిగా చేసే
ఓ కవివర్యా....!
ఇంకా ఎంత కాలం...???
మీ సిర చుక్కల లెక్కలు
మా అణువణువు కొలతల సైజులు తెల్చేది...
చెప్పవూ......!!

అక్కడెక్కడో ఉన్న ఆకాశాన్ని తెస్తావు
ఏవేవో రంగులన్నిటిని పురమాయించి
మా శరీర చుట్టు కొలతలకు
గాలి ఆడని ఓ చీరని చుడతావు
ఓ కలం వీరుడా..?
ఇప్పుడైనా చెప్పగలవా..
నాలుగు అక్షరాలకు నగిషీలు చెక్కి
నయవంచకుల ముందు నగ్నంగా
ఊరేగిస్తావు..
ఎందుకు అలా..?

ఓ కవి వత్సల...!
పురాణేతిహాసాల నుండి
ఒక్కసారి తొంగిచూడుడి
అడుగంటిన మానవత పాత్రల నుండి
మట్టిగలిసిన చరిత్ర నుండి
ఎన్ని మానవ మృగాలు
ఉద్రేకించి తిరుగుతున్నయో..
ఎప్పుడైనా గమనించరా మీరు....?

ఓ కళ రూపి...!
మీ చేతిలోని అక్షరాల ఉలితో
ఎన్ని కళాఖండాలకు ఆయుష్షు పోశారో..
అందుకే.... ఒక్కసారైనా
మగువ మనసు పొరల్లోకి
మీ పెన్ పాళిని చొచ్చించి తీసుకు వెళ్ళుము
అక్కడో మహా సంగ్రామం హోరెత్తుతోంది
ఎటు చూసినా విఘాత జీవులే ...కానీ
అవన్నీ "ఆమె" శవాలే అని ఎవరికి తెలియదు
అందుకే ఒక్కసారి ఆ రోదనని విని చూడు
మీ కలం ఎన్నిసార్లు కన్నీరు కారుస్తుందో
కలం పట్టిన మీకు కూడా తెలియదు
ఆ కన్నీటి వేదన...!!

– జి.గోపి

నవతెలంగాణ
15 హైదరాబాద్
ఆదివారం
20 ఆగస్టు 2023
జోష్ YOUTH N YOUTH

శారీరక అంగవైకల్యం ఉన్న వారి జీవితం ఒక కష్టమైన ప్రయాణం. వారికున్న లోపం వారిలో ఆత్మవిశ్వాసాన్ని తగ్గించి, ఆందోళన పెంచుతుంది. నైపుణ్యం ఉన్నా సమాజంలో వారంటే కొంత చిన్న చూపు. అయినా ఎదురొడ్డి నిలబడినా వారికి అవకాశాలు అంతంత మాత్రమే. ఆ అవాంతకాలను అధిగమించి ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. ఏటైపికల్ అడ్వాంటేజ్ (ఏఏ) పోర్టల్ ప్రారంభించి.. వైకల్యం వారికి అడ్డు కాకుండా నైపుణ్యమే కొలమానంగా అవకాశాలు కల్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. అతనే వినీత్ సరైవాలా.. ఈ పోర్టల్ ద్వారా ఏ విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాడో... అతనికి ఈ ఆలోచన ఏవిధంగా వచ్చిందో... ఎంతమందికి ఉపాధి.. ఏ విధంగా ఉపాధి కల్పిస్తున్నాడో.. అతని మాటల్లోనే... ఈ వారం జోష్...



తనలాంటి వారికోసం...
తనే ఆదాయ మార్గమై...

కరోనా సమయంలో దేశవ్యాప్తంగా చాలా మంది తమ ఉద్యోగాలను కాపాడుకోవాలని ప్రయత్నించారు. కానీ నేను అలా చేయలేదు.. ఫీచర్ గ్రూప్ సంస్థ అందిస్తున్న అధిక జీతాన్ని తృణప్రాయంగా వదిలేసి శారీరక అంగవైకల్యం ఉన్న వారి కోసం ఆదాయ మార్గాన్ని చూపించే పోర్టల్‌ను 2020 డిసెంబర్‌లో ఏర్పాటు చేశాను. అదే ఎటైపికల్ అడ్వాంటేజ్ (ఏఏ). ఈ పోర్టల్ ఆన్‌లైన్ డేటాబేస్ సర్వీసును అందిస్తుంది. అంటే దీనిలో కొనుగోలు దారుడు, అమ్మకం దారుడు ఇద్దరూ ఉంటారు. వీరిద్దరినీ ఈ పోర్టల్ కలుపుతుంది. అదే ఆన్‌లైన్ డేటాబేస్. ఈ పోర్టల్ ద్వారా శారీరక అంగవైకల్యం ఉన్న వారికి పార్ట్ టైం లేదా ఫుల్‌టైం ఉద్యోగావకాశాలు అందిస్తుంది. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు ఈ పోర్టల్‌లో తమ కంపెనీ వివరాలు నమోదు చేయించుకోని, వారికి కావాల్సిన అర్హతలున్న వారిని ఇక్కడ నుంచి రిక్రూట్ చేసుకోవచ్చు. ఈ విధంగా పోర్టల్ శారీరక వైకల్యం కలిగిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.

స్వానుభవంతో వచ్చిన ఆలోచన..

మాది మధ్య తరగతి కుటుంబం. నాకు పుట్టుకతోనే జన్యుపరంగా సంక్రమించే అరుదైన రుగ్మత రెటినిటిస్ పిగ్మెంటోసా సమస్య ఉంది. 16 ఏండ్లు ఉన్నపుడు ఈ సమస్యను మొదటి సారి గుర్తించాం. అన్ని రకాల చికిత్సలను ప్రయత్నించాం. శస్త్రచికిత్స, హెూమియోపతి, ఆయుర్వేదం, అల్లోపతి, ధ్యానం, హస్తసాముద్రికం ఇలా ఏవేవో ప్రయత్నించినా ఉపయోగం లేదు. వాస్తవాన్ని స్వీకరించక తప్పలేదు. అలా అని నా భవిష్యత్తు అక్కడితో ఆగిపోతుందని నిరాశపడలేదు. ఆగలేదు. పోరాడాను. మా ఇంట్లో మా అన్న అనూజ్‌కి కూడా ఇదే సమస్య. అది మా కుటుంబాన్ని మరింత ఇబ్బంది పెట్టిన విషయం. అయినా నా అడుగు వెనక్కు పడలేదు. దేశంలో గర్వించదగిన విద్యా సంస్థ ఐఐఎంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (పీజీపీ)లో చేరాను.

గర్వంగా ఉంది...

ఏటిపికల్ అడ్వాంటేజ్‌లో పెద్ద పెద్ద సంస్థలు కలిసి నడవడానికి చాలా కృషి చేస్తున్నాడు. "ప్రతిభ, నైపుణ్యాలకు వైకల్యం ఎప్పటికీ అడ్డు రాద"ని చెప్తూ వారిని తమతో కలిసి నడిచేందుకు ప్రోత్సహిస్తున్నాడు కూడా. ఇప్పటి వరకు మేం సాధించిన విజయం చూస్తే చాలా గర్వంగా ఉంది. దీనంతటికీ నేను నేర్చుకున్న బిజినెస్ మేనేజ్‌మెంటే కారణం. ఏ కంపెనీ అభివృద్ధికైనా మార్కెట్ అభిప్రాయం ముఖ్యం. ఏ ఉత్పత్తినైనా లాంచ్ చేసేముందు దాన్ని పరిపూర్ణం చేయాలనే ఆలోచన పక్కకు పెట్టి.. ప్రారంభమైన తర్వాత నుంచి మార్పులు చేసుకుంటూ ఎదగొచ్చు. ప్రస్తుతం 10 వేల మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను.



ఐఐఎం నుంచి ఫీచర్ గ్రూప్ వరకు..

2013 – 2015 మధ్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (పీజీపీ) పూర్తి చేశాను. ఐఐఎంలో చేరిన మొదటి రోజు ఉత్సాహంగా గడపలేదు. అప్పటికే ఎక్కువ భాగం చూపు కోల్పోయాను. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలో నా భవిష్యత్తు అస్పష్టంగా అనిపించింది. తీవ్రమైన ఆందోళనలతో కుంగిపోయాను. నా బ్యాచ్‌మేట్స్ నన్ను అంగీకరించరని భయపడ్డాను. ఒక విధమైన అభద్రతకు గురయ్యాను. ఎవరైనా నా సామర్థ్యాన్ని ప్రశ్నిస్తే ఎలా నిరూపించుకోవాలనే సందిగ్ధంలో పడిపోయాను. అసలు హాస్టల్ నుండి క్లాస్‌రూం వరకు స్వంతంగా నడవగలనా? పరీక్షలను ఎలా రాయాలి వంటి అనేక సందేహాలు నన్ను చుట్టుముట్టాయి. అయితే దేశంలోని కొందరు మేధావులతో కలిసి చదువుకుంటున్నందుకు సంతోషించాను. నా స్నేహితులు అందించిన సహకారం నా భయాన్ని పటాపంచెలు చేసింది. గ్రూప్ ప్రాజెక్టులకు నాయకత్వం వహించాను. అవకాశం ఉన్న ప్రతి విషయంలో ముందుకు నడిచాను. ఫలితంగా నా సామర్థ్యం ఏంటో నాకు తెలిసింది. నాలోని నాయకత్వ లక్షణాలు తెలుసుకోగలిగాను. పీజీపీ పట్టా పొందాను. తర్వాత ఉద్యోగాల వేట చాలా కష్టం అనిపించింది. ఉద్యోగావకాశం ఇచ్చేందుకు నాలోపం వారికి అడ్డంకిగా మారింది. అయితే కాలేజీలో నేను చూపించిన ప్రతిభ, అర్హతలే తర్వాత రోజుల్లో ఫ్యూచర్ గ్రూప్‌లో మంచి స్థాయిలో నిలబెట్టాయి. ముంబైలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన నేను డిప్యూటీ మేనేజర్‌గా, బిగ్‌బజార్ రిక్రూట్‌మెంట్స్, నియామక ప్రక్రియ, సంస్థ కార్యకలాపాలు ఇలా చాలా వరకు దాదాపు ప్రతీ బాధ్యత నిర్వహించాను.





సవాళ్లతో కూడుకున్న పని...

పోర్టల్ ప్రారంభించగానే సరికాదు కదా.. ప్రతి అడుగు సవాలుతో కూడుకున్నదే. కంపెనీలను ఒప్పించడం ఒకెత్తైతే... ఆర్థిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవడం మరో సవాలు. కంపెనీల ఆలోచనా విధానాన్ని మార్చడం అంత సులువేం కాదు. వారికి కావాల్సిన నైపుణ్యం కలిగిన వ్యక్తిని కచ్చితంగా అందించాలి. వారి నమ్మకం పొందడం చాలా ముఖ్యం. కంపెనీల అవసరాన్ని బట్టి, ఆర్టిస్ట్‌ల పెయింటింగ్స్, వర్క్ వీడియోలు ముందుగానే పంపిస్తాం. కంపెనీ అవసరానికనుగుణంగా అవతలి వ్యక్తి ఎంత మేర వర్క్ చూపించగలరో వారు సరి చూసుకున్న తర్వాతనే ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

ఇక ఫైనాన్షియల్ విషయానికొస్తే... పోర్టల్ ప్రారంభంలో ఇన్వెస్టర్ల నుండి డబ్బులు అడగడానికి కాస్త సంకోచించాను. కంపెనీల నుంచి పెరిగిన ఆఫర్లతో పోర్టల్ మీద నమ్మకం పెరిగింది. పెట్టుబడులు పెరిగాయి. అయితే మన భావజాలంతో ఏకీభవించే వారిని పెట్టుబడులు పెట్టగలరని అనుభవంలో అర్థమైంది. ఇప్పటి వరకు పెట్టుబడులు పెట్టిన వారంతా రాబడి కాకుండా సంస్థ సామాజిక విలువను మాత్రమే గుర్తించారు. అమెజాన్, పెప్పర్‌ఫ్రై, టీసీఎస్, హెచ్‌యుల్ వంటి సంస్థలలో ఇప్పటి వరకు నియమకాలు చేశాం. ఈ మధ్య కాలంలో అమెజాన్ 40 మందిని ఏఏ ఫోరమ్ ద్వారా తీసుకుంది.

ఏ రోజుకైనా కంపెనీలు నేరుగా వైకల్యం కలిగిన వారిని నేరుగా నియమించుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. అలా చేయడం వల్ల చాలా మంది ఉపాధి పొందుతారు. ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు బయటకు వస్తారు.

లాభాపేక్ష లేకుండా

మా కళాకారుల విషయానికొస్తే, వారిలో చాలా మంది ఇప్పటివరకు రూ.లక్ష ఆదాయం పొందారు. డౌన్ సిండ్రోమ్ తో బాధపడుతున్న ఒక పెయింటర్ తన పెయింటింగ్‌ను కాలిఫోర్నియాకు చెందిన వ్యక్తికి రూ. 28,000కి విక్రయించింది. మస్కులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న ఒక అమ్మాయి ఇప్పుడు తన కాఫీ పోట్రెయిట్‌ల (చిత్రాల) ద్వారా ఆదాయాన్ని పొందుతోంది.

- ◆ స్వామినాథన్ మణివన్నన్ మూగ, చెవుడు సమస్య ఉంది. అయితే అతను ఒక ఆర్టిస్ట్. ఈ పోర్టల్ ద్వారా దాదాపు 15 పెయింటింగ్స్ అమ్మాడు.
- ◆ రాజ్ జైన్ గాయకుడు. కానీ పాక్షిక దృష్టి లోపం ఉంది. ఈ వేదికగా దాదాపు 10 షోలు నిర్వహించాడు. ఇప్పటి వరకు ఈ సంస్థ 1000కిపైగా వైకల్యం ఉన్న వారికి ఆదాయ మార్గాన్ని చూపించింది. దాదాపు 120కి పైగా బ్రాండ్స్ ఈ పోర్టల్‌తో కలిసి పనిచేస్తున్నాయి.
- ◆ దేశ వ్యాప్తంగా ఉన్న పెప్పర్‌ఫ్రై సంస్థల్లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 30 మంది వైకల్యం కలిగిన ఆర్టిస్టులు గాజుపై పెయింటింగ్స్ వేసేందుకు నియమితులయ్యారు. ఐటీ ఎనలిస్ట్‌గా టీసీఎస్ నుంచి చూపులేని అమ్మాయిని నియమించుకున్నారు. వినికిడి సమస్య ఉన్న ఓ పదిహేనేండ్ల అమ్మాయిని అమెజాన్ మోడల్‌గా అలెక్సా డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్‌కు తీసుకున్నారు.
- ◆ నియామకాలకు సంబంధించి క్యాండిడేట్ రెమ్యునరేషన్ మీద 8.33 శాతం తీసుకుంటాం. ఈవెంట్‌లు ఏవైనా నిర్వహిస్తే మా మార్జిన్ 15 – 30 శాతం మధ్యలో ఉంటుంది.

– అంకం రమాదేవి

యువకులు యువకులు యువకులు

యువకులు యువకులు యువకులు
నవమానవ జీవన తళుకులు
పసితనానికి ముసలితనానికి
మధ్యన మెరిసే దివ్యశక్తులు

చిగురులు ముదిరితే ఆకులు
శిశువులు పెరిగితే యువకులు
దేశ ప్రగతి సుగతికి యువరక్తం
సదా సర్వదా బహు ఉపయుక్తం

యువకులే..మన సంఘసేవకులు
సమాజ రక్షణలో వీరసైనికులు
యువకులే..మన దేశపాలకులు
సమాజనౌకకు సదా నావికులు

సాహసమే తమ శ్వాసగా.....
ఆదర్శాలే తమ ధ్యాసగా.....
జీవించే ఘనులు యువకులు

పురోగమనానికి వారే ప్రతీకలు

యువకులే నిత్య యుద్ధయోధులు
ప్రగతిరథాన్ని నడిపించే సారథులు
మూఢవిశ్వాసాలకు విరోధులు
నవసమాజ భవనపు పునాదులు

కులగజ్జి సోకితే సంఘనాశకులు
మతపిచ్చి పట్టితే మతోన్మాదులు
ధర్మవర్తనులు ధర్మరక్షణ దీక్షితులు
ఈ ధరణీతలమున ధన్యజీవులు

ఈ సమాజ జీవన గాయకులు
మన సంస్కృతి రక్షణ నాయకులు
త్యాగానికి వారివే ముందువరుసలు
నాటి వీరశివాజీకి నిజవారసులు

ధైర్య స్థైర్యమున నేతాజీలు
శాంతి అహింసల బాపూజీలు



"ఆజాద్" "అల్లూరి"కి సోదరులు
సమసమాజానికి రహదారులు

యువకులు జనకుల కానుకలు
పాలన జీవన హృదయప్రేమికులు
నవ్యసమాజానికి చేసే మార్పులు
నేర్పు కూర్పుల యువతీయువకులు

(అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా)

– "జనశ్రీ" జనార్ధన్ కుడికాల
9703275050

అచేతనం

నిండుగ పారుతున్న కెనాల్ ప్రవాహం
కనిపించినపుడల్లా నేను
ఆ కన్నీళ్ళలో మునిగి పోతాను...

కనీకనిపించనిదేదో తేలుతూ వస్తున్నది
అనిపించినపుడల్లా నేను
ఆ ప్రవాహంలోనే కొట్టుకుపోతాను...

ఆ నీళ్ళని దాటి ఒడ్డున ఆ అచేతనం
చెట్టు కింద చాప పై ఒరిగి
నను చూసి నవ్వి నపుడల్లా
నేనకడే పాతాళానికి కుంగి పోతాను...


– అశోక్ గుంటుక
9908144099

మూత్రాభిషేకం

1
రాముడి కాళ్లు కడిగి..
ఎంగిలి పండ్లను తినిపించినందుకు
శబరి రుణం తీరిపోయింది.

2
బొటనవ్రేలు గురుదక్షిణగా
స్వీకరించినందుకు ద్రోణాచార్యుడు
కురిపించిన పుత్రవాత్సల్యంతో
ఇన్నేండ్లకు ఏకలవ్యుడు తడిసి ముద్దయి
ముగ్ధుడై పరవశించి పోయిండు.

3
అడవిని అంటిపెట్టుకున్నందుకు,
కంటికి రెప్పలా కాపాడుతున్నందుకు
మూత్రాభిషేకంతో సత్కరించి
సరికొత్త మనుస్మృతిలోని
పౌరసత్వాన్ని గుర్తిస్తూ
దిగొచ్చిన పీఠాధిపతులు
నా కాళ్లు కడిగి నెత్తిన చల్లుకొని



చేయిస్తున్న పాపాలన్నీ ఇకనుంచి
తొలగిపోయినట్లేనని,
ఎగరేసిన అలిఖిత శాసనపత్ర
పతంగొకటి గాలిలో స్వేచ్ఛగా
చక్కర్లు కొడుతూ సువార్తను
మోసుకు తిరుగుతుంది.

4
అగ సూడు.. ఇప్పటికైనా
ఏ రీతి మర్యాద దక్కునో
తెలిపినందుకు కృతజ్ఞత పాటిస్తూ
జమ్మి చెట్టు మీది ఆయుధాలు
వింటినారిని సరిచేసుకుంటూ
భుజం మార్చుకుంటున్నయి.

5
అంగరంగ వైభవంగా
జరిగిన పట్టాభిషేకాన్ని
తిలకించిన పురజనులారా...
అనుమానమక్కర్లేదు!
ఇమాన పూర్తిగా నేను
ఈ దేశ ముఖచిత్రాన్ని!!

– బండారి రాజ్‌కుమార్
8919556560